మహాసేల్ గరి వారంతాల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
fb.com/vaartha Digital
29-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 178 పేజీలు: 10+4 వెల: 6.50
epaper.vaartha.com WWW.VAARTHA.COM
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam



జార్జియాలోని బతుమీలో సోమవారం విజయానంతరం మీడియాతో దివ్య దేశ్‌ముఖ్

## బిసిల 42% రిజర్వేషన్లకోసం
# ఛలో ఢిల్లీ



సోమవారం హైదరాబాద్‌లో కేబినెట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి

తొలి రోజు పార్లమెంటులో విపక్ష ఎంపీలతో వాయిదా తీర్మానం

తర్వాత మంత్రులు, ఎంపీలతో జంతర్‌మంతర్ వద్ద ధర్నా

3వ రోజు 200 మంది ఎంపీలతో కలిసి రాష్ట్రపతికి వినతి పత్రం

బిసిల రిజర్వేషన్ల కోరే వారు మాతో ఢిల్లీకి రావాలి

కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించిన మంత్రి పొన్నం

### ఆగస్టు 5,6,7 తేదీల్లో హస్తినలో ఒత్తిడికి కార్యాచరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై28:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో బీసీల రిజర్వేషన్ల సాధనక ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని అందుకు సంబంధించిన కార్యాచరణను నిర్ణయించుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఆగస్ట్ 5వ తేదీన బీసీల రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసన తెలిపేందుకు పార్లమెంట్‌లో పార్టీ ఎంపీల ద్వారా వాయిదా తీర్మానం ఇవ్వాలని కేబినేట్ నిర్ణయించింది. ఈ మేరకు 5,6,7 తేదీలలో ఢిల్లీలో కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు కార్యాచరణను నిర్ణయించింది. కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయాలను బీసీ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు కొండా సురేఖ,వాకిటి శ్రీహరితో కలిసి మీడియాకు వివరించారు. ఆగస్ట్ 6వ తేదీన రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులందరితో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకున్నారు.. మరుసటి రోజున ఆగస్ట్ 7వ తేదీన ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలని ఈ ఏడాది మార్చిలోనే అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించింది. విద్యా ఉద్యోగ అవకాశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లును అదే రోజున ఆమోదించింది. మార్చి 17న తెలంగాణ అసెంబ్లీ, మార్చి 18న తెలంగాణ కౌన్సిల్ మోదించిన ఈ >>2

## వరల్డ్ చెస్ చాంపియన్‌గా
# దివ్య దేశ్‌ముఖ్

### ఫిడే మహిళల వరల్డ్‌కప్ -25లో 'గ్రాండ్ మాస్టర్' హంపి ఓటమి


### ఇది ఆరంభం మాత్రమే: దివ్య

**న్యూఢిల్లీ:** ఫిడే మహిళల వరల్డ్ కప్-2025, ఫైనల్‌ల్లో భారత్‌కు చెందిన 19 ఏళ్ల అమ్మాయి దివ్య దేశ్‌ముఖ్ సంచలనం సృష్టించింది. తనకంటే సీనియర్, భారత్ గ్రాండ్ మాస్టర్ 38 ఏళ్ల కోనేరు హంపిని చిత్తుగా ఓడించింది. ఫిడే వరల్డ్ కప్ కైవసం చేసుకున్న తొలి భారతీయ మహిళగా రికార్డు నమోదు చేసింది. జార్జియాలోని బతూమీ వేదికగా సోమవారం జరిగిన టై బ్రేకర్‌లో హంపి తొలుత నల్ల పావులతో ఆడగా, దివ్యతో కలిసి డ్రా చేసుకుంది. 15 నిముషాల పాటు సాగిన గేమ్‌లో 81 ఎత్తుల తర్వాత ఇద్దరూ ఎట్టకేలకు డ్రాకు అంగీకరించారు. అనంతరం 15 నిముషాల రెండో ర్యాపిడ్ మ్యాచ్‌లో హంపి తెల్ల పావులతో ఆడగా, దివ్య నల్ల >>2

## మన సైనిక సత్తాకు 'సిందూర్' నిదర్శనం

### లోక్‌సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

### 22 నిముషాల్లోనే ఆపరేషన్ పూర్తి


సోమవారం లోక్‌సభలో ప్రసంగిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ, జూలై 28:** భారత సైన్యం సత్తాకు ఆపరేషన్ సిందూర్ నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో >>2




# ఆ ముగ్గురు 'ఎన్‌కౌంటర్'

### ఉగ్రముష్కరులను మట్టుబెట్టిన 'ఆపరేషన్ మహదేవ్'

### దాడి సూత్రధారి సులేమాన్‌షా కూడా మృతి

**న్యూఢిల్లీ, జూలై 28:** జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంవ్‌లో పర్యాటకులపై జరిగిన ముష్కరదాడికి ప్రతీకారంగాపాక్‌కు గుణపాఠం చెప్పేందుకు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులోచర్చజరుగుతున్న సమయంలోనే ఆదాడికి సూత్రదారులుగా భావిస్తున్న ముగ్గురు ఉగ్రవాదులను మన భద్రతా దళాలు మట్టుబెట్టాయి. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న బలగాలు ఒక్కసారిగా భారీ సంఖ్యలో వారిని చుట్టుముట్టి అంతమొందించాయి. పహల్గాంవ్ దాడికి సూత్రధారిగా భావిస్తున్న సులేమాన్‌షా అలియాస్ మూసాఈ ఎన్‌కౌంటర్‌లో హతం అయ్యాడు. శ్రీనగర్‌కు సమీపంలో దట్టమైన అటవీప్రాంతంలో ముగ్గురు పాకిస్తానీ ఉగ్రవాదులను మట్టుబెట్టారు. వీరిలో ఇద్దరు పహల్గాంవ్ దాడిలోపాల్గొని 26 మంది అమాయక పర్యాటకులను కాల్చివేసిన సంఘటలో పాల్గొన్నట్లు గుర్తించారు. సులేమాన్‌షా నిజానికి లష్కరేతాయిబా ఉగ్రవాదిగా ఉన్నాడు. ఏప్రిల్ 22న జరిగిన దాడికి ఆతడే సూత్రధారి అనికూడా అధికారులు నిర్ధారించారు. సోమవారంనాటి కీలక ఆపరేషన్‌కు మన అధికారులు ఆపరేషన్ మహాదేవ్ అని పేరుపెట్టారు. సులేమాన్‌తోపాటు మరో ఇద్దరిపేర్లను కూడా గుర్తించారు. అబూ హంజా, యాసిర్‌లుగా చెపుతున్నారు. యాసిర్‌కూడా పహల్గాంవ్ దాడిలో పాలొనగన్న ఉగ్రవాదేనని సైన్యం ప్రకటించింది. సెక్యూరిటీ పరంగా ఆర్మీ, సిఆర్‌పిఎఫ్, జమ్ము కాశ్మీర్‌పోలీసులు >>2

# ఇక మీనాక్షి పాదయాత్ర



### 'స్థానిక' సమరానికి శ్రమదానంతో కదలనున్న కాంగ్రెస్

### పరిగి నియోజకవర్గం రంగాపూర్‌లో 31న ఆరంభం

### పాల్గొననున్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు

**హైదరాబాద్,జూలై 28,ప్రభాతవార్త:** తెలంగాణలో స్థానిక సమరంకు కాంగ్రెస్ శ్రేణులను సమాయత్తం చేసేందుకు పాదయాత్ర శ్రమదానంతో పార్టీ నాయకగణం కాలుకదుపుతోన్నది. కార్యకర్తలతో సమావేశం నిర్వహించి స్థానిక సమస్యలపై ఒక కార్యచరణ రూపొందించే దిశగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా రాత్రి గ్రామంలోనే రాష్ట్ర నాయకగణం బసచేసేలా ఏర్పాట్లు చేశారు. మొదటి విడుత వారం రోజులు కారక్రమాన్ని ప్రకటించారు. ఎఐసిసి ఆదేశానుసారం ఈ నెల 31వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలలో ఒక నియోజక వర్గంలో జిల్లా స్థాయి పాదయాత్ర శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు టిపిసిసి ప్రణాళిక రూపొందించింది. ఈ కార్యక్రమాలలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆ జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొంటారు.నిర్ణయించిన తేదీలలో నియోజకవర్గంలోని ఒక ముఖ్యమైన కేంద్రంలో సాయంత్రం 5 గంటల నుంచి 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి, అనంతరం అదే ప్రాంతంలో కాంగ్రెస్ కార్యకర్తలతో పల్లె నిద్ర చేయనున్నారు. మరుసటి రోజు తెల్లవారు జామున లేచి గ్రామంలో పెద్ద ఎత్తున శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం ఆ జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, మండలం అధ్యక్షుడు, డిసిసి సభ్యులు, ఎంపిపిలు, జడ్పీటిసిలు, గ్రామ సర్పంచులు.. ఇలా ఆ ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతలతో సమావేశం నిర్వహించి, సాయంత్రం మరో నియోజకవర్గంలో పాదయాత్ర కార్యక్రమాలు చేపట్టనున్నారు.మొదటి విడతగా ఆరు జిల్లాల్లో ఒక్కో నియోజక వర్గాన్ని ఎంపిక చేసుకొని జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించాలని ఏఐసీసీ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గం తో ప్రారంభమై వరంగల్ జిల్లా వనపర్తి నియోజకవర్గంలో ముగించనున్నారు. జూలై 31న సాయంత్రం రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గం రంగాపూర్ గ్రామంలో సాయంత్రం ఐదుగంటలకు పాదయాత్ర చేసి అక్కడే రాత్రి బసచేస్తారు. ఆగస్టు1న ఉదయం 11 గంటలకు శ్రమదానం,కార్యర్తలలో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం నిర్వహిస్తారు. మెదక్ జిల్లా ఆంధోల్ నియోజకవర్గంలో అదేరోజు సాయంత్రం >>2

# కదలని 'బనకచర్ల'



### తెలంగాణ అభ్యంతరాలతో ఇంకా పనులు చేపట్టని ఎపి

### రాజ్యసభలో కేంద్ర మంత్రి రాజ్ భూషణ్ వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై28:** బనకచర్ల ప్రాజెక్ట్ పనులు ఇంకా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ.81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను >>2

## 'సృష్టి' మోసాలపై హెచ్‌ఆర్‌సి ఆగ్రహం

### ఆగస్టు 28లోగా నివేదిక ఇవ్వాలని వైద్యఆరోగ్యశాఖకు ఆదేశాలు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** సృష్టిఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై రాష్ట్రమానవ హక్కుల కమిషన్(ఎస్‌హెచ్‌ఆర్సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. పలు పత్రికల్లో వచ్చిన వార్త కథనాల ఆధారంగా ఈ కేసును సుమోటోగా స్వీకరించినట్లు తెలిపింది. అక్రమ సరోగసీ, నవజాత శిశువుల విక్రయాన్ని తీవ్రంగా పరిగణించాలన్న ఎస్‌హెచ్‌ఆర్సీ, దీనిపై సమగ్ర విచారణ జరిపి ఆగస్టు 28లోగా నివేదిక అందజేయాలని వైద్యారోగ్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది.

**గతంలో సంతానం పొందిన దంపతుల వివరాల సేకరణ**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన యూనివర్సల్ 'సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. సంతానం కోసం డా.నమ్రతను ఆశ్రయించిన దంపతులను తన మాయమాటలతో బుట్టలో వేసుకుని వారి నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేసినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఐవిఎఫ్, ఐయూఐ, సరోగసీల ద్వారా పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చని నమ్మించి ఎంతో మంది దంపతులను మోసం చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే డాక్టర్ నమ్రతతో సహా 8 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

**దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు..**

ఎలాంటి అనుమతులు లేకుండా ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహిస్తూ అక్రమ మార్గంలో కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా డాక్టర్ నమ్రత చేసిన అరాచకాలపై >>2

## ఘోష్ నివేదిక
# రేపో, మాపో!

### 31తో ముగియనున్న కమిషన్ కాలపరిమితి

**హైదరాబాద్,జూలై 28,ప్రభాతవార్త:** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటు, అవకతవకలపై న్యాయ విచారణ కోసం జస్టిస్ వేసిన పిసిఘోష్ న్యాయవిచారణ కమిటి ఇచ్చే నివేదికపై అందరిలో ఆసక్తి పెరుగతోంది. సోమవారం కేబినెట్ ఉండటంతో పిసి ఘోష్ నివేదిక ప్రభుత్వంకు సమర్పించలేకపోయారని తెలిసింది. వచ్చే మూడు రోజుల్లో ప్రభుత్వంకు తన నివేదిక అందించే అవకాశం ఉంది. ఈ విచారణకు సంబంధించిన తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేందుకు పీసీ ఘోష్ కమిషన్ సర్వం సిద్ధం చేసుకుంటోంది. ఈ నెల 31న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పదవీ కాలం ముగియనుంది. దాంతో అదే రోజున పీసీ ఘోష్ కమిషన్ వద్ద నుంచి తుది రిపోర్ట్‌ను ఇరిగేషన్ శాఖ తీసుకోనుంది. నిన్నే కోల్‌కతా నుంచి >>2




## ఇంకా అద్దె భవనంలోనే
# 'ఉన్నత విద్య'

### 37 యేళ్లుగా సొంతభవనం లేక అవస్థలు

### ప్రభుత్వానికి పలు లేఖలు రాసినా ఫలించని వైనం

### పర్మినెంట్ బిల్డింగ్ కావాలంటున్న ఉద్యోగులు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత విద్యను క్రమపద్ధతిలో నడిపించడంలో ముందుంటున్న తెలంగాణ ఉన్నత విద్యా మండలికి సొంతం భవనం లేదు. గత 37 ఏళ్లుగా సొంతం భవనం లేకుండా.. అద్దె భవనాల్లోనే కొనసాగుతూ వస్తోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చే వరకు అద్దె కూడా చెల్లించేవారు. ప్రత్యేక రాష్ట్రంఏర్పడిన తరువాత అద్దెచెల్లించకుండా విద్యుత్ బిల్లులతో పాటు త్రాగునీటి బిల్లులను చెల్లిస్తూ వస్తోంది. ఉన్నత విద్యను గాడిలో పెడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఉన్నత విద్యలో దేశంలోనే ముందుండేలాగా చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న ఉన్నత విద్యా మండలికి సొంత భవనం కావాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుకుంటున్నారు. తమకు ఒక సొంత భవనం కేటాయించాలని.. లేకపోతే కనీసం సొంత భవనం చూపితే తాము దానిని కొనుగోలు చేసుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామంటూ.. తెలంగాణ ఉన్నత విద్యా మండలి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. 1988లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వానికి ఉన్నత విద్యా సంస్థలకు అనుసంధానంగా ఉన్నత విద్యా మండలిని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ప్రస్తుత పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలో కొనసాగింది. 2004 వరకు అక్కడే కొనసాగిన ఉన్నత విద్యా మండలి కార్యాలయం.. 2005లో మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలోకి మార్చబడింది. అయితే ఇక్కడ ఉన్నత విద్యా మండలికి కేటాయించిన భవనం కోసం స్క్వేర్ మీటర్‌కి ఇంత అంటూ అద్దెను చెల్లించినట్టు >>2

## హైకోర్టుకు నలుగురు
# కొత్త జడ్జీల నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై28:** తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు కోలిజియం ఇటీవల చేసిన సిఫార్సులను ఆమోదిస్తూ నలుగురు కొత్త జడ్జీల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో హైకోర్టులో న్యాయ వ్యవస్థ మరింత బలపడనుందని న్యాయవర్గాలు అభిప్రాయ >>2

# బిసిల 42% రిజర్వేషన్లకోసం ఛలో ఢిల్లీ

>> రెండు ఈ బిల్లులు మార్చి 22న రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించింది. మార్చి 30వ తేదీ నాడు ఈ బిల్లులను రాష్ట్ర గవర్నర్ రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. ఇప్పటికీ ఆ బిల్లులు రాష్ట్రపతి వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. బీసీల రిజర్వేషన్ల పెంపు నిర్ణయంపై రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ ముడిపడి ఉంది. మూడు నెలల్లోనే ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని ఇప్పటికే రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఈ నెలాఖరులోపు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. అందుకే బీసీల రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకుంది. మరోవైపు గతంలో పదేండ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ బీసీలకు తీరని ద్రోహం చేశారు. అన్ని సామాజిక వర్గాల రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో ప్రత్యేక నిబంధనను పొందుపరిచారు. కేసీఆర్ తెచ్చిన ఈ చట్టం బీసీల రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారింది. కెసీఆర్ బీసీలకు చేసిన ద్రోహాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మొన్న జులై10వ తేదీన జరిగిన కేబినేట్ సమావేశంలో ఆ చట్టాన్ని సవరించాలని నిర్ణయం తీసుకుంది. చట్ట సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని తీర్మానించింది. చట్టంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్ నిబంధనను ఎత్తివేసేలా సవరణ ఆర్డినెన్స్ ఫైల్‌ను జులై 14వ తేదీన ప్రభుత్వం గవర్నర్‌కు పంపించింది. ఈ ఆర్డినెన్స్ ఫైలును కూడా గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపించినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. అందుకే బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ను వెంటనే ఆమోదించాలని రాష్ట్ర కేబినేట్ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయటంతో పాటు ఆగస్ట్ 5, 6, 7 తేదీల్లో జాతీయ స్థాయిలో అవసరమైన కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. కాగా, 5,6,7 తేదీల్లో దేశ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కాంగ్రెస్ కూటమి ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, తెలంగాణలోని అన్ని పార్టీల నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్య సభ సభ్యులు ఢిల్లీకి వెళ్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు తెలిపారు. తెలంగాణలోని ప్రతి బీసీ బిడ్డ ఢిల్లీకి రావాలి, బీసీ మేధావులు, కుల సంఘాల ప్రతినిధులు అన్ని పార్టీల నాయకులు ఢిల్లీకి వచ్చి బీసీలు 42శాతం రిజర్వేషన్లు తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయితీలకు కేంద్రం నుంచి నిధులు రావడం లేదని, హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు గడువులోగా నిర్వహించాల్సి ఉందన్నారు. బిజెపి నాయకత్వానికి కార్యకర్తలతో సహా పార్టీలో ఉన్న బిసి నాయకులు అరవింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, లక్ష్మణ్ కేంద్రంపై ఒత్తిడి చేసి రాష్ట్రపతి దగ్గర ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింప చేయాలని కోరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, బిజెపి బీసీ నాయకత్వం దాన్ని ఖండించి బలహీన వర్గాలకు మద్దతు తెలపాలని కోరారు. గతంలో కేశవరావు, తాను, వాకిటి శ్రీహరి, మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ వర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అందరం కలిసి చేతులెత్తి దండం పెట్టామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం లాగా స్ఫూర్తి దాయకంగా బలహీన వర్గాలకు అవకాశం వస్తుందన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు పలికి ఇప్పుడు ఈ బిల్లుకు మోకాలు అడ్డుతున్నారని, కడుపులో కత్తులు పెట్టుకుని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి నేతలపై విమర్శలు చేశారు.

**అంతరాష్ట్ర చెక్ పోస్ట్‌లు రద్దు**

రవాణా శాఖ కు సంబంధించి రాష్టంలో ఉన్న అంతరాష్ట్ర చెక్ పోస్టులను రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా చెక్ పోస్టులను తొలిగించాలని కేంద్ర ప్రభుత్వం కూడా అన్ని రాష్ట్రాలకు సూచించింది. చెక్ పోస్టులు సిబ్బంది కాకుండా ఇకపై వాహన్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ కొనసాగుతుంది. కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్స్‌లో మైక్రోబ్రూవరీస్ ఏర్పాటుకు కేబినెట్ఆమోదం తెలిపింది. మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.




బీహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఆవరణలో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్లకార్డును ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, డిఎంకె ఎంపి కనిమొళి కరుణానిధి తదితరులు

## ఆ ముగ్గురు 'ఎన్‌కౌంటర్'

>> సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. సులేమాన్ గతంలో పాకిస్తాన్ ఆర్మీలో పనిచేసాడు. ఆసమయంలో హాషీమ్ మూసాగా పిలువబడేవాడు. పహల్గాంవ్‌లోని బైసారన్‌లోయలో జరిగిన ముష్కర దాడికి ఆతడుకూడా కీలకమే. వీరు ఒక్కొక్కరిపైనా జమ్ముకాశ్మీర్‌పోలీసులు రూ.20 లక్షల రివార్డు చొప్పున ప్రకటించారు. కాశ్మీర్‌లోని ఆర్మీ చినార్‌కార్ప్స్ అధికారికంగా ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రకటనచేసింది. లద్వాస్‌లో ఆపరేషన్ మహాదేవ్ కొనసాగించామని, ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు తెలిపింది. చనిపోయిన ముగ్గురుకూడా అత్యంత కీలకమైన కమాండర్ల హోదాలో ఉన్నవారేనని భావిస్తున్నారు. నిఘా వేగుల సమాచారం పరిసరాల్లోని నివాసితులు, గొర్రెల కాపరుల నుంచి సమాచారం సేకరిస్తున్న సైన్యం నెలరోజులముందునుంచే గట్టిప్రణాళికతో నడుస్తోంది. హార్వాన్‌లోని ముల్నార్‌ప్రాంతంలో ఈ ఆపరేషన్‌ను ముందుప్రారంభించింది. ఆ తర్వాత ఉగ్రవాదులున్న ప్రాంతాలకు వెళ్లింది. ఆపరేషన్ మహాదేవ్‌లో సైన్యం ఉగ్రవాదులు ముగ్గురు గొయ్యిని తవ్వి వాటిపై షామియానాను వేసుకుని అక్కడినుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. దట్టమైన అటవీప్రాంతంలో ఈ టెంట్ శిబిరాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే ఆప్రాంతాన్ని చుట్టుముట్టడంతో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. శిబిరంలో ఎకె47 రైఫిళ్లు, 17 రైఫిల్ గ్రేనేడ్లు, ఇతర ఆయుధాలు, ఆయుధ సామగ్రిని అక్కడినుంచి స్వాధీనంచేసుకుఆన్నరు. జమ్ముకాశ్మీర్‌లో ఈ ఉగ్రవాదులు భారీ పేలుళ్లకే పథకరచన చేసినట్లు జాయింట్ ఆపరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. శ్రీనగర్ సమీపంలోని హార్వాన్, దాచిగమ్ అటవీప్రాంతాల్లో జరిపిన గాలింపు చర్యలతోనే ఉగ్రవాదులు కాల్పులుప్రారంభించడంతో సైన్యం ఎదురుకాల్పులుజరిపింది. హార్వాన్‌లో ఇప్పటికీ ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని కాశ్మీర్ ఐజిపి వికె బిర్డి చెప్పారు. పహల్గాంవ్ దాడికి నిరసనగా ఆపరేషన్ సింధూర్‌పేరిట రక్షణమంత్రిత్వశాఖ మెరుపుదాడులునిర్వహించి పాక్ ఉగ్రస్థావరాలన్నింటినీ ధ్వంసంచేసిన సంగతి తెలిసిందే.

## 'సిందూర్' నిదర్శనం

>> సోమవారం నాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకంగా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు బెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టుబెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు.

ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు. 2025 మే 10వ తేదిని మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు. పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకుపడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

ఎలాంటి ఒత్తిడి లేదు, ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు. విమానాల కూల్చివేతపై ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అనిఅడగవచ్చని, అందుకు అవునన్నదే తన సమ ధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికు లెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.



## కొత్త జడ్జీల నియామకం

>> పడుతున్నాయి. ఈ నియామకాలతో గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ త్వరలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. న్యాయవాదుల అనుభవం, నిబద్ధత, న్యాయపరమైన ప్రతిభను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే సుప్రీంకోర్టు కొలిజియం వారిని ఎంపిక చేసింది. కాగా సోమవారం దేశ వ్యాప్తంగా పలు హైకోర్టులకు 19 మంది జడ్జీలు, అదనపు జడ్జీలు నియమితులయ్యారు. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు, నలుగురు అదనపు జడ్జీలు, ఇక అస్సాం హైకోర్టుకు నలుగురు జడ్జీలు నియమితులయ్యారు.

## రేపో, మాపో!

>> హైదరాబాద్ చేరుకున్న కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్.. ప్రభుత్వానికి తుది నివేదిక ఇచ్చే ముందు లీగల్ అంశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. న్యాయపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫైనల్ రిపోర్ట్‌ను పీసీ ఘోష్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## పెరిగిన రవాణ సర్వీసు చార్జీలు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** తెలంగాణలో పలురకాల రవాణా సర్వీసు ఛార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవాణాశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. ఫైనాన్స్ పై వెహికల్స్ తీసుకున్న వారికి హైపొథెకేషన్ ఫీజును రూ.2,135 నుంచి ఏకంగా రూ.3,135కు పెంచేశారు. లెర్నర్స్ లైసెన్స్, డ్రైవింగ్ టెస్ట్ ఫీజుల ఛార్జీలు రూ.335 నుంచి రూ.440కి పెంచారు. టూవీలర్, కారు లెర్నర్స్ లైసెన్స్ ఫీజు రూ.450 నుంచి రూ.585కు పెంచారు. గతంలో డ్రైవింగ్ టెస్టుకు రూ.1035 వసూలు చేస్తే.. ప్రస్తుతం దానిని రూ.1135కు పెంచారు. వెహికల్ యాజమాన్య బదిలీ ఫీజు రూ.935 నుంచి రూ.1805కు పెంచేశారు. ఆటో రిక్షా డ్రైవింగ్ టెస్ట్ ఫీజును రూ.800 నుంచి రూ.900గా ఫిక్స్ చేశారు. వాహనాల ఆర్సీల కాలపరిమితి, నేషనల్ పర్మిట్ల ఫీజుల్ని కూడా పెంచడంతో.. వాహనదారులకు షాక్ తగిలినట్లయింది.

## కదలని 'బనకచర్ల'

>> కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన ఫైల్‌ను కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది. ఆ తర్వాత.. ఇటీవల ఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు , రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలు ఈ సందర్భంగా వీరు చర్చించారు. అనంతరం ఈ అంశంపై నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల భారీ నీటి పారుదల శాఖ మంత్రులతోపాటు ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎవరికీ అన్యాయం జరగకుండా నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయానికి వచ్చారు.

## వారం - వర్జ్యం

29-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
పంచమి రా.12.49
ఉత్తరఫల్గుణి రా.7.31
వర్జ్యం : తె.4.45-6.31
దు.ఉ.8.23-9.15, 2) రా.11.51-12.43
శుభసమయం:ఉ.7.30-8.15, సా.6.45-7.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**వృషభం:** కొత్త బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుతుంది.

**మిథునం:** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా వుంటాయి.

**కర్కాటకం :** నూతన వస్తు, వస్త్రాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. సంతానం అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు.

**సింహం:** రాజకీయ, కళారంగాల వారికి అన్ని విధాలుగా అనుకూలమై సమయం. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఒడిదుడుకులు సన్నిహితుల సాయంతో బయట పడతారు.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** బాధ్యతలు పెరిగి ఉక్కిరి బిక్కిరి కాగలరు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** కాంట్రాక్టులు లాభిస్తాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది. స్వల్పధనలాభం పొందుతారు.

**మకరం:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కుంభం:** రాజకీయ, కళా, వ్యవసాయ రంగాలలోని వారికి అన్ని విధాలా కలిసి వచ్చే సమయం. వాహనాల పట్ల జాగ్రత్త అవసరం.

**మీనం :** పనులు అనుకున్న విధంగా పూర్తికాగలవు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




జార్జియాలోని బతూమీలో సోమవారం చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో కోనేరు హంపితో దివ్య దేశ్‌ముఖ్

## వరల్డ్ చెస్ చాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్

>> పావులతో ఎత్తులు వేసింది. అయితే ఈ టై బ్రేక్‌లో హంపి చేసిన తప్పిదాల ఫలితంగా దివ్య చాంపియన్‌గా అవతరించింది. టై బ్రేక్‌లలో 10 నిముషాల చొప్పున రెండు రాపిడ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ప్రతీ కదలిక తర్వాత 10 సెకన్ల ఇంక్రిమెంట్ ఉంటుంది. స్కోరు సమంగా ఉంటే ప్రతీ కదలిక తర్వాత మూడు సెకన్ల ఇంక్రిమెంట్‌లతో రెండు, ఐదు నిముషాల మ్యాచ్‌లు ఆడతారు. టై కొనసాగితే ప్రతీ కదలిక తర్వాత రెండు సెకన్ల ఇంక్రిమెంట్‌లతో మూడు నిముషాల చొప్పున రెండు బ్లిట్జ్ మ్యాచ్‌లు ఆడాలి. ఈ గెలుపుతో దివ్య గ్రాండ్ మాస్టర్‌గా ప్రమోషన్ పొందడంతో పాటు, క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. హంపిపై గెలిచిన అనంతరం దివ్య తీవ్ర భావోద్వేగానికి లోనైంది. ఇలా నేను గ్రాండ్ మాస్టర్ అవుతానని అసలు ఊహించ లేదు. ఈ విజయం నాకు ఎంతో విలువైనది. నా విధిరాతలో ఇది ఉంది. ఈ టోర్నమెంట్ ఆరంభానికి ముందు నాకు ఈ హోదా లేదు. ఇంకా నేను సాధించాల్సినవి చాలానే ఉన్నాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే అంటూ దివ్య ఎమోషనల్ అయింది.

## ఇక మీనాక్షి పాదయాత్ర

>> ఐదు గంటలకు పాదయాత్ర అక్కడ రాత్రి బస, తెల్లవారి ఆగస్టు2న ఉదయం 11గంటలకు శ్రమదానం మధ్యాహ్నం 3గంటలకు కార్యకర్తలతో సమావేశమౌతారు. ఆగస్టు2 సాయత్రం ఐదు గంటలకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పాదయాత్ర, ఆగస్టు 3న శ్రమదానం, కార్యర్తలతోమీటింగ్‌లో పాల్గొంటారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో ఆగస్టు 2 సాయంత్రం ఐదు గంటలకు పాదయాత్ర అక్కడే రాత్రిబస, ఆగస్టు4న శ్రమదానం కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఆగస్టు 4చొప్పదండి నియోజకవర్గంలో పాదయాత్ర, రాత్రి బస తెల్లవారి ఆగస్టు5న శ్రమదానం మధ్యాహ్నం 3గంటలకు కార్యకర్తలతో సమావేశం, ఆగస్టు5 సాయంత్రం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో సాయంత్రం ఐదుగంటలకు శ్రమదానం ఆగస్టు 6న శ్రమదానం కార్యకర్తలతో సమావేశం జరుపుతారు. 810 కిలోమీటర్ల దూరం కవర్ చేస్తూ, వారం రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో మమేకం కావడం, పార్టీలో కొత్త, పాత నాయకుల మధ్య సమన్వయాన్ని కల్పించడం ప్రభుత్వ విధానాలు, పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ పాదయాత్ర సాగనుందని తెలుస్తోంది. మీనాక్షి నటరాజన్ పర్యటనకు సమన్వయకర్తలుగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఆఫీసు కోర్డినేటర్లు కొత్తూరి వెంకటేశ్, జూరాల దనలక్ష్మీ, డా.పుల్ల అనిల్‌కుమార్ ఉంటారు.

**స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై సమాలోచనలు..**


కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై మీనాక్షి నటరాజన్ స్థానిక కార్యకర్తలతో చర్చిస్తారని పరిగి ఎమ్మెల్యే రామోహ్మన్‌రెడ్డి తెలిపారు. పరిగి రంగాపూర్‌లో సాయంత్రం ఐదుగంటలకు పాదయాత్ర చేస్తారని తెలిపారు. రంగాపూర్‌లో ఉదయం శ్రమదానం మధ్యాహ్నం కార్యకర్తలతో సమావేశం అవుతారని తెలిపారు. దశలవారిగా రాష్ట్రంలో ఆమె పాదయాత్ర, శ్రదానం ఉంటుందనితెలిపారు. గాంధీభవన్‌లోఈమేరకు ఆయన విలేఖరులతో మాట్లాడినారు.

## 'సృష్టి' మోసాలపై హెచ్‌ఆర్‌సి ఆగ్రహం

>> అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విశాఖపట్నం, విజయవాడతో పాటు సికింద్రాబాద్, కూకట్‌పల్లి, కొండాపూర్‌లో బ్రాంచ్‌లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిల్లో తనిఖీలు నిర్వహించి గతంలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సంతానం కోసం చికిత్స తీసుకున్న వారి వివరాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించే ప్రక్రియ కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే వారికి ఫోన్ చేస్తే తమ తప్పిదాలు కూడా ఎక్కడ భయటపడతాయోననే భయంతో వారు సరైన సమాధానం ఇవ్వడం లేదని సమాచారం. మరికొందరు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

**నవజాత శిశువుల విక్రయాల ముఠా..**

డాక్టర్ నమ్రతను ఆశ్రయించిన దంపతుల్లో చాలామందికి సరోగసీ నిర్వహించకుండానే నవజాత శిశువులను కొనుగోలు చేసి వారికి అందించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు మొత్తం ఎంతమంది దంపతులకు సరోగసీ నిర్వహించింది.. అసలు సరోగసీ నిర్వహించిందా? లేక అందరినీ ఇలానే మోసం చేసి నవజాత శిశువులను కొనుగోలు వారికి అప్పగించిందా? వీటన్నింటిపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నట్లు సమాచారం. అలాగే నవజాత శిశువులను కొనుగోలు చేయడానికి మరెవరైనా సహకరించారా అనే కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. త్వరలోనే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన సరోగసీ, నవజాత శిశువుల విక్రయాల తతంగాన్ని చేధిస్తామని పోలీసు వర్గాలు వెల్లడించాయి.



పార్లమెంట్ ఆవరణలో సోమవారం కేంద్ర మంత్రి పియూష్ గోయల్, డిఎంకె ఎంపి తిరుచ్చి శివతో మాట్లాడుతున్న మక్కల్ నీధి మైయం ఎంపి కమల్ హాసన్

## అద్దె భవనంలోనే 'ఉన్నత విద్య'

>> ఉన్నత విద్యా మండలి అధికారులు తెలిపారు. అయితే దీంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు 2014 జూన్ వరకు అద్దెను చెల్లిస్తూ ఉన్నత విద్యా మండలి కొనసాగింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏపి ఉన్నత విద్యా మండలి కాస్త తెలంగాణ ఉన్నత విద్యా మండలిగా ఏర్పడటంతో.. అప్పటి వరకు చెల్లిస్తూ వస్తున్న అద్దెను చెల్లించడం ఆపేశారు. అప్పటి నుంచి ఉన్నత విద్యా మండలి కొనసాగుతున్న భవనానికి వస్తున్న విద్యుత్ బిల్లులతోపాటు వాటర్ బిల్లులను చెలిస్తుంది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి భవనంలోనే తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టిఏఎఫ్ఆర్‌సి) ఆఫీస్ కూడా కొనసాగుతోంది. 1988లో ఏర్పడిన ఉన్నత విద్యా మండలి.. ఆ మరుసటి సంవత్సరం నుంచే ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలను నిర్వహించడం ప్రారంభించింది. 1989 నుంచే ఎంసెట్ పరీక్షను నిర్వహిస్తూ వస్తోంది. గతంలో ఒక్కో ఏడాది ఒక్కో యూనివర్సిటీ ఎంసెట్‌ను నిర్వహించేలా ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకుంటూ వస్తోంది. 2005 నుంచి జేఎన్‌టియు హైదరాబాద్ వారే ఎంసెట్(ప్రస్తుత ఎప్ సెట్)ను నిర్వహిస్తున్నారు. 1989 తరువాత ఒక్కో ఏడాది ఒక్కో సెట్‌ను నిర్వహిస్తూ వస్తోంది. గతంలో ఎంబిఏలో వేరుగా, ఎంసిఏ వేరుగా అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు జరిగేవి. ఇప్పుడు అదికాస్త ఐ సెట్‌గా మారి రెండింటికి ఒకటే కామన్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎప్ సెట్, ఐ సెట్, లా సెట్, పిజి లాసెట్, ఈ సెట్, పిజి ఈ సెట్, ఎడ్ సెట్, పిఈ సెట్‌తోపాటు కామన్ పిజి ఎంట్రన్స్ నిర్వహణ బాధ్యతలను కూడా ఉన్నత విద్యా మండలే నిర్వహిస్తోంది. వీటన్నింటినీ ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ వస్తోంది. దీంతోపాటే 2016 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలను నిర్వహించడానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)ను నిర్వహిస్తూ వస్తోంది. ఇలా ప్రవేశ పరీక్షలను నిర్వహించడమే కాకుండా యూనివర్సిటీలను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ వస్తున్న సంస్థ తెలంగాణ ఉన్నత విద్యా మండలి. అటువంటి ఉన్నత విద్యా మండలికి సొంత భవనం లేదు. తమకు సొంత భవనం ఉండాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో 2023లో ప్రస్తుతం ఉన్నత విద్యా మండలి కొనసాగుతున్న స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏ అండ్ఎఫ్ఏయు) కాదని సాంకేతిక విద్యా శాఖకు చెందిన స్థలమని.. దానిని ఉన్నత విద్యా మండలి తీసుకోవడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలుపుతూ రూ. 6.65 కోట్లను జేఎన్ఏ అండ్ ఎఫ్ఏయుకి చెల్లించాలని సూచిస్తూ ఉన్నత విద్యామండలి కార్యదర్శికి లేఖ రాశారు. ఆ తరువాత కాస్త యూనివర్సిటీ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించడంతో కథ మళ్లీ మొదటి కొచ్చింది. దీంతో మరోసారి ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి లేఖ రాసింది. ఉన్నత విద్యా మండలికి భవనాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం కొన్ని భవనాలను పరిశీలించాలని సూచించింది. వాటిల్లో బషీర్ బాగ్‌లోని ఎస్‌సిఈఆర్‌టి ఆఫీసులో, రాణిగంజ్‌లోని బుద్ధభవన్‌లో, మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న పురపాలకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో కొన్ని అంత స్తులను అధికారులు పరిశీలించారు. రీసెంట్‌గా సైఫాబాద్‌లోని హెర్మిటేజీ భవనంలో ఒక అంతస్తును పరిశీలించారు. ఎక్కడైనా తమకు పార్కింగ్‌కి ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా ఉండే భవనాన్ని కేటాయించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కార్యదర్శితోపాటు ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

## ఇంజినీరింగ్ ఫీజుల కమిటీ నేడు భేటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 28:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులను నిర్ణయించడానికి ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ నేడు(మంగళవారం) సమావేశం కానుంది. సచివాలయంలో మొదటి సమావేశాన్ని నిర్వహించనున్నారు. కమిటీలో వచ్చే ప్రతిపాదనల మేరకు కమిటీ తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ జివో ఎంఎస్ నంబర్ 29ని ప్రభుత్వం జారీ చేసిన విషయంతెలిసిందే. 2025-28 బ్లాక్ పిరియడ్‌కి సంబంధించి ప్రైవేటు ఇంజనీరింగ్‌తోపాటు ఎంబిఏ, ఎంసిఏ, బిఈడి, ఎంఈడి, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ తదితర వృత్తివిద్య కోర్సులను అందిస్తున్న కాలేజీల్లో ట్యూషన్ ఫీజును నిర్దారణ చేయడం కోసం ప్రభుత్వం కమిటీని నియమించిన విషయం తెలిసిందే. తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఏఎఫ్ఆర్‌సి) 2025-28 బ్లాక్ పీరియడ్ కోసం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ కాలేజీలు ఏఎఫ్ఆర్‌సికి సమర్పించిన ఫీజు ప్రతిపాదనలు.. సంబంధిత సుప్రీంకోర్టు, హైకోర్టుల పారామీటర్స్, నిబంధనలు, షరతులకు భిన్నంగా ఉన్నాయని ఈ నేపథ్యంలో ప్రైవేటు కాలేజీల్లో ఫీజు నిర్ధారణ కోసం పారామీటర్లను పరిశీలించి ప్రతిపాదనలు, సూచనలను చేయడానికి కమిటీని వేయాలని కోరగా.. ప్రభుత్వం 10 మందితో కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బలకిష్టారెడ్డి ఛైర్‌పర్సన్‌గా, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ మెంబర్ సెక్రటరీగా ఉన్నారు.



# జలాభిషేకం కోసం తొక్కిసలాట

## కోతుల గుంపు నిర్వాకంతో విద్యుదాఘాతం

### ఇద్దరు మృతి, 40 మందికి తీవ్రగాయాలు

**లక్నో, జూలై 28:** పవిత్ర శ్రావణ మాసంలో సోమవారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి జరిగిన తొక్కిసలాటలో సుమారు 40 మంది తీవ్ర గాయాలపాలుకాగా ఇద్దరు మరణించారు. బారాబంకిలోని ఔసానేశ్వర్ మహాదేవ్ దేవాలయంలో భక్తులు ఒక్కసారిగా తరలి రావడంతోజరిగిన తొక్కిసలాటలో ఈ ఘోరం జరిగింది. లక్నోకు 90 కిలోమీటర్లదూరంలో ఈ ప్రాంతం ఉంది. కారణం దేవాలయ ఆవరణలో ఆకస్మిక విద్యుదాఘాతం కారణమని చెపుతున్నారు. తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది. వేలాదిగా భక్తులు దేవాలయంలో పూజలకోసం బారులు తీరారు. జలాభిషేకం కోసం హైదర్‌బాగ్‌లో ఉన్న ఈ దేవాలయంలో గుమికూడారు. శ్రావణ మాసంలో మహాశివునికి జలాభిషేకం చేసుకుంటారు. అందుకోసమే తండోప తండాలుగా తరలివచ్చారు. బారాబంకి జిల్లా మేజిస్ట్రేట్ శశాంక్ త్రిపాఠి మాట్లాడుతూ ఒక కోతుల గుంపు ఓవర్‌హెడ్‌పై ఉన్న హైటెన్షన్ వైరుపైకి దూకాయని దీనితో ఆ వైరు తెగి కిందపడిందని, ఒక డబ్బారేకుల షెడ్‌పై పడి విద్యుదాఘాతానికి దారితీసింది. దీనితో అక్కడే ఉన్న భక్తులమధ్య తొక్కిసలాటజరిగి మరణాలు, తీవ్రగాయాలు పాలయిన సంఘటనకు దారితీసింది. మృతులు ఇదనదరూ కూడా 35ఏళ్ల రమేష్‌కుమార్, 16 ఏళ్లప్రశాంత్‌కుమార్‌గా గుర్తించినట్లు చెప్పారు. సంఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. మృతుల కుటుంబాలకు యుపిసీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఐదులక్షల రూపాయలు చొప్పున పరిహారం కూడా ప్రకటించారు. అలాగే గాయాలపాలయినవారికి సత్వర చికిత్సను అందించాలని కోరారు.

# తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా సుప్రీంకోర్టులో వాదనలు

### ఎజి సుదర్శన్‌రెడ్డితో మంత్రి దామోదర్ రాజనర్సింహా భేటీ

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందిన విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు హైటెక్ సిటీలోని ఏజీ సుదర్శన్ రెడ్డి నివాసానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ వెళ్లి..ఎంబీబీఎస్ కౌన్సిలింగ్‌కు సంబంధించిన స్థానికత అంశంపై చర్చించారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు పాల్గొన్నారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా కోర్టులో వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి మంత్రి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టులో వాదనల కోసం, అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసుకోవాలని మంత్రి ఏజీకి సూచించారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా, స్థానికులకే మెడికల్ సీట్లు దక్కేలా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం జీవో 33 తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణ స్థానిక కోటాలో తమకు కూడా సీట్లు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించిన ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఇందుకు సంబంధించిన వాదనలు సుప్రీం కోర్టులో కొనసాగుతున్నాయి. తదుపరి విచారణ ఆగస్టు 5న సుప్రీంకోర్టులో కొనసాగనుంది.

# ఎంబిబిఎస్ సీట్ల స్థానికతపై హైకోర్టు తీర్పు

### తుదితీర్పు వచ్చేదాకా రిజిస్ట్రేషన్‌లో చేర్చాలని ఆదేశం

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంబిబిఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ కౌన్సిలింగ్ దరఖాస్తుదారులను స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశించింది. తుది తీర్పు వచ్చే వరకు రిజిస్ట్రేషన్‌లో చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. గత ఏడాది ఇచ్చిన హైకోర్టు తీర్పును ఫాలో కావాలని ఆదేశించింది. శాశ్వత నివాసంతోనూ స్థానికత మంజూరు చేయాలని అభిప్రాయపడింది.

హైకోర్టు తీర్పుతో సుమారు 100 మంది అభ్యర్థులకు తాత్కాలిక ఊరట లభించనుంది. ఈ నెల 15న కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన ప్రాస్పెక్టస్, నోటిఫికేషన్‌పై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నోటిఫికేషన్‌లోని రూల్ 3లో ఏళ్ల చదువు, నివాస నింబంధనపై అభ్యతరాలు వ్యక్తం చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన హైకోర్టు తీర్పు వెలువరించింది.

# హైదరాబాద్ అంగట్లో నకిలీ ఐఫోన్‌ల అమ్మకాలు

### ముగ్గురు నిందితుల అరెస్ట్

### రూ. 3 కోట్ల విలువైన యాక్ససరీస్ స్వాధీనం



**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ అంగట్లో నకిలీ ఐఫోన్ (యాపిల్) ప్రొడక్ట్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారు. వినియోగదారులకు అనుమానం కలగకుండా సేమ్ టు సేమ్ యాపిల్ ఒరిజనల్ మాదిరిగానే నకిలీ వాటిని తీర్చిదిద్ది కస్టమర్లను నిండా ముంచుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం ఐఫోన్ ప్రతినిధులతో కలిసి సోమవారం మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీరాలం మండీ ప్రాంతంలో సోదాలు నిర్వహించి నకిలీ ఐఫోన్ యాక్ససరీస్ విక్రయాలు జరుపుతున్న మహమ్మద్ షాహిద్ అలీ, ఇర్ఫాన్ అలీ, సంతోష్ రాజ్ పురోహిత్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 3 కోట్ల విలువైన నకిలీ ఐఫోన్ యాక్ససరీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. పట్టుబడిన ముగ్గురు నిందితులు సెల్‌ఫోన్లు వాటికి సంబంధించిన యాక్ససరిస్ అమ్మకాలలో అనుభవం ఉన్న వ్యక్తులు. ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ముంబైలోని మార్కెటింగ్ ఏజెంట్ల నుంచి డూప్లికేట్ యాపిల్ గాడ్జెట్లు కొనుగోలు చేసి వాటికి ఒరిజనల్ మాదిరిగా కనిపించేందుకు యాపిల్ లోగో, స్టిక్కర్లు, సీల్‌లతో నకిలీ ప్యాకేజింగ్ చేస్తున్నారు. వీటిని అసలైనవిగా నమ్మించి కస్టమర్లను మోసం చేస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి భారీగా యాపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్స్, పవర్‌బ్యాంకులు, కేబుల్స్ ఇలా మొత్తం రూ. 3 కోట్ల విలువైన 2,761 నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించినట్లు డీసీపీ సుధీంద్ర తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణకు సిఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి

### కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులు ప్రారంభించండి

### కేంద్రమంత్రి గడ్కరీని కోరిన బండి సంజయ్

### కమిటీ నివేదిక రాగానే పనులు ప్రారంభిస్తామని గడ్కరీ హామీ



**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సిఆర్ఐఎఫ్) నిధులను విడుదల చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. సోమవారం న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అందులో భాగంగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సిఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట-ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి-పోతూర్ రోడ్డు విస్తరణ పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయని, అదేవిధంగా కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయని బండి సంజయ్ వివరించారు. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సిఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. గత ఎన్నికలకు ముందే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం కేంద్రం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం పొందడంతోపాటు టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్ జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

# బిసిలకు పెద్దపీట వేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** దేశంలో చిత్తశుద్ధితో బిసిల సంక్షేమం కోసం పనిచేస్తున్నది ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వమే అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అన్నారు. మోడీ ప్రభుత్వం కేబినెట్లో 27 మంది బిసి మంత్రులు ఉన్నారని తెలిపారు. బిసిలకు పెద్దపీట వేసింది... బిసి కమిషన్‌ను తీసుకువచ్చింది కూడా మోడీ అని, రాహుల్ గాంధీ మాత్రం బిసిని అవమానపరిచేలా కన్వర్టెడ్ బిసి అంటూ విమర్శించడం దారుణం అన్నారు. బిసి జాబితాలు రాష్ట్రానికొకటిగా ఉండవని, రాష్ట్రాన్నిబట్టి జాబితాలు మారుతాయి. ఉదాహరణకు లంబాడాలు మన రాష్ట్రంలో ఎస్టీలు.. కానీ మహారాష్ట్రలో బిసిలు...నేను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కెసిఆర్ ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, దానికి అవసరమైన నిధులు మాత్రం కేటాయించలేదు. కమిషన్‌కు కేవలం హోదా ఇచ్చారు గానీ, పనితీరుకు అవసరమైన ఆర్థిక మద్దతు కల్పించలేదన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన విషయానికొస్తే, అది రాజ్యాంగబద్ధంగా జరిగిన ప్రక్రియ కాదు, ఆ గణన కేవలం గణాంకాల సేకరణ మాత్రమే. ఎందుకంటే, ఇది రాజ్యాంగబద్ధమైన సంస్థల ద్వారా కాకుండా, ప్రభుత్వమే స్వయంగా నిర్వహించిన ప్రక్రియ. కులగణనకు సంబంధించి వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ బయట పెట్టకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలాల స్థాయిలో కులగణన చేయలేదని అనేకమంది టీచర్లు చెబుతున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ వివరాలను బయట పెట్టే ఉద్దేశం కనబడడం లేదు. కులగణనను అధికారికంగా చేయాలంటే, అది రాజ్యాంగ బద్ధమైన సంస్థలతో, సరైన డేటా ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. భారతీయ జనతా పార్టీ కులగణనకు వ్యతిరేకం కాదన్నారు. విశ్వకర్మ యోజన, ముద్రా రుణాలు, స్టార్టప్ ఇండియా వంటి వివిధ పథకాలలో అధికంగా లబ్దిదారులు బిసిలే కావడం స్పష్టంగా కనిపిస్తుం దన్నారు. ఈ వాస్తవం మోడీ ప్రభుత్వం బిసిల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్న విషయాన్ని నిరూపిస్తుందన్నారు. భారతీయ జనతా పార్టీ ఓబిసిల సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధతతో ముందుకెళ్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఓబిసిలు భారతీయ జనతా పార్టీతో ఉన్నారు.

# బిఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరగలేదు

### కాంగ్రెస్ సర్కారు విచ్చలవిడిగా ట్యాపింగ్ చేస్తోంది

### ఈ కేసులో ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ యూటర్న్

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి విశ్రాంత పోలీసు అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ యుటర్న్ తీసుకున్నారు. బిఆర్ఎస్ హయాంలో తన ఫోన్‌ను నాటి సర్కారు ట్యాపింగ్ చేయిస్తోందని దాఖలు చేసిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌పై సోమవారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరైన సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

పోలీసు అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేశాక బిఎస్‌పిలో చేరిన ఆయన అప్పట్లో రాష్ట్రంలో ప్రచారంలో వుండగా తన ఫోన్‌ను సర్కారు ట్యాపింగ్ చేస్తోందని, డిజిపితో పాటు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై వాంగ్మూలం ఇవ్వాలని ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేస్తున్న సిట్ అధికారులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు రెండుసార్లు నోటీసులు జారీ చేయగా ఆయన తాజాగా విచారణకు హాజరయ్యారు. సిట్ విచారణకు హాజరైన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌పై అనూహ్య వ్యాఖ్యలు చేస్తూ బిఆర్ఎస్ హయాంలో అసలు ఫోన్ ట్యాపింగ్ జరగలేదని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గతంలో తన ఫోన్ హ్యాక్ అయినట్లు యాపిల్ సంస్థ నుంచి మెసేజ్ వచ్చిందని, దీనిపై తాను అప్పట్లో పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని ఆయన అన్నారు. అయితే బిఆర్ఎస్ హయాంలో ఎక్కడా ఫోన్ ట్యాపింగ్ జరగలేదని, దీనిపై నాటి సర్కారు రాజ కీయంగా వాడుకోలేదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్ ట్యాపిం గ్‌కు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. డార్క్ వెబ్ సైట్ ద్వారా మంత్రులతో పాటు ఇతర ప్రముఖుల ఫోన్‌లను, ఆఖరుకు తన ఫోన్‌ను కూడా ఏకంగా సిఎం రేవంత్ రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపిం చారు. ఇందుకోసం అధునాతన ఉపకరణాలను వాడి ప్రైవేటు వ్యక్తుల చేత ఈ గోల్‌మాల్ చేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కేన్సర్ కణాలకు ఒకే డోసులో చికిత్స!

### ఇంకా పరిశోధనల్లోనే ఉన్నట్లు వెల్లడి

**బోస్టన్, జూలై 28:** శరీరంలోని కణాల అసాధారణ పెరుగుదల పలు రకాల కేన్సర్లకు దారితీస్తోంది. వాటిల్లో ఒకటి బ్రెయిన్ కేన్సర్ అత్యంత ప్రమాదకరంగా మారింది. బోస్టన్‌లోని మాస జనరల్ కేన్సర్ సెంటర్‌లోజరిగిన క్లినికల్ ట్రయల్‌లో గ్లియోబ్లాస్టోమాతో బాధపడుతున్న ముగ్గురు రోగల ట్యూమర్లు ఒకే డోసు ప్రయోగాత్మక సెల్ తెరపీ తీసుకున్న తర్వాత గణనీయంగా కుచించుకుపోయాయి. వాటిలో కొన్ని ట్యూమర్లు కేవలం కొన్నిరోజుల్లోనే తగ్గినట్లు పరీక్షల్లో తేలింది. సిఎఆర్-టి థెరపీలో ఒక విధానంగా చెపుతున్నారు. ఈ చికిత్సలో రోగి స్వంత రోగనిరోధక కణాలను ఉపయోగిస్తుంది. వీటిని కేన్సర్ మరింత మర్థవంతంగా గుర్తించి దాడి చేయడానికి మళ్లీప్రోగ్రామ్‌చేస్తారు. ఈ క్లినికల్‌ట్రయల్స్‌లో ఒకరోగి ట్యూమర్ దాదాపు పూర్తిగా మాయం అయింది. మరొకరి ట్యూమర్ 60శాతంకంటే ఎక్కువగా కుదించి ఆస్థితిలోనే ఆరు నెలలకుపైగా కొనసాగింది. కొత్తబ్రెయిన్‌క్యాన్సర్ చికిత్స ఒకే డోసుతో ప్రాణాంతకమైన మెదడు ట్యూమర్‌ను కొన్నిరోజుల్లోనే తగ్గించినట్లు శాస్త్రవేత్తలుతేల్చారు. ఇదే కొనసాగితే రానున్న కాలంలో ఒకే ఒక్కడోసుతో మెదడులో పెరుగుతున్నకేన్సర్ కణజాలాన్ని సమూలంగా నిర్మూలించే ఔషధం రానున్నట్లు భావించవచ్చు. ప్రాథమికంగా మెదడు కణితులు మెదడులోనే పుట్టుకొస్తాయి. ద్వితీయయకణితులు శరీరంలోని ఇతరభాగాలనుంచి మెదడుకు వస్తాయని చెపుతున్నారు. బ్రెయిన్ కేన్సర్‌కు గురైన వ్యక్తుల్లో తలనొప్పి, మూర్ఛలు, దృష్టి సమస్యలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం, గందరగోళం, వికారం, వాంతులు వంటి లక్షణాలుంటాయి. ఇందుకు సంబంధించి వచ్చే కొత్త చికిత్స అమలుకువస్తే కేన్సర్‌రోగులకు విస్తృత ప్రయోజనాలు తచేకూరగలవని అంచనా.

# రేవ్ పార్టీ కేసులో కొత్త కోణం

### కారుపై ఎపి ఎంపి స్టిక్కర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూలై 28, ప్రభాతవార్త :** సంచలనంగా మారిన కొండాపూర్ రేవ్ పార్టీ కేసులో కొత్తకోణం వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్ నుండి బడాబాబులను తీసుకువచ్చి ఇక్కడ పార్టీలు ఏర్పాటు చేసి మందు, విందులతో ఖుషీ చేస్తున్న గ్యాంగ్ భాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. శనివారం రాత్రి కొండాపూర్‌లోని ఎస్వీ సర్వీస్ అపార్ట్మెంట్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తుండగా ఎక్సైజ్ స్పెషల్ టాస్కోర్స్ పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీగా గంజాయి, డ్రగ్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కారుపై ఏపీకి సంబంధించిన ఓ ఎంపీ స్టిక్కర్ దర్శనమిచ్చింది. ఇక రేవ్ పార్టీ నిర్వహించిన అశోక్ నాయుడును ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ రేవ్ పార్టీలో అశోక్ కీలక నిందితుడిగా ఉన్నారు. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం నాయుడు కొంతమంది అమ్మాయిలను తీసుకువచ్చి యువకులతో ఎంజాయ్ చేయిస్తున్నట్లు గుర్తించారు. వీకెండ్ సందర్భంగా రేవ్ పార్టీని నిర్వహించింది అశోక్ నాయుడు అని పోలీసులు తేల్చారు. రేవ్ పార్టీ సందర్భంగా రెండు కార్లను సీజ్ చేసిన పోలీసులు అందులో ఒక ఫార్చ్యూనర్ కారుకు లోక్‌సభ ఎంపీ స్టిక్కర్ ఉండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కారుపై ఎంపీ స్టిక్కర్ కనిపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ కారులో ఎవరు వచ్చారు. ఆ ఎంపీ పేరేంటి. ఆయనే వచ్చారా లేక ఆ కారులో ఆయన బంధువులెవరైనా వచ్చారా. అన్న అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అశోక్ నాయుడికి రాజకీయ నేతలతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు, కారు



# టివికె సారథి విజయ్ ఇంటికి బాంబు బెదరింపు

**చెన్నై, జూలై 28:** తమిళ వెట్రి కజగం వ్యవస్థాప కుడు తమిళ అగ్రశ్రేణి నటుడు విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు వచ్చిం ది. తూర్పుతీర రోడ్డులోని నీలంకరాయ్‌లో ఉన్న విజయ్‌నివాసానికి వచ్చిన ఈ బాంబు బెదరింపులు సమగ్ర సోదాల తర్వాత బూటక మని తేలింది. చెన్నై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఉదయం 5.20 గంటలప్రాంతంలో ఒక కాల్ వచ్చిందని తెలుస్తోంది. ఈస్ట్‌కోస్ట్ రోడ్‌లోని నీలంక రాయ్‌లోని విజయ్ ఇంట్లో బాంబు పెట్టామని కాల్‌చేసిన వ్యక్తి పేర్కొన్నాడు.

బాంబు నిర్వీర్య దళంతోపాటు ముగ్గురుసభ్యుడు, ఒక స్నిఫర్‌డాగ్‌ను నటుడి నివాసానికి పంపించారు. దాదాపు గంటసేపు ఆప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీచేసారు. సోదాల తర్వాత బాంబు స్క్వాడ్ ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించి బాంబు బెదిరింపు భూటకమని ప్రకటించింది. అయితే ఈ ఘటనపై నీలంకరై పోలీసులు కేసు నమోదు చేసారు. నకిలీకాల్‌మూలాన్ని తెలుసుకోవడానికి ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది.

# షటిల్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలి యువకుడు మృతి



రాజేష్ (ఫైల్)

**హైదరాబాద్ (నాచారం), జూలై 28, ప్రభాతవార్త :** షటిల్ ఆడుతూ గుండె పోటుతో కుప్పకూలిన యువకుడు మృతి అందరని కలచివేసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడు గుండ్ల రాకేష్ (25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉప్పల్ భగాయత్‌లో ఉన్న ఎలైట్ బ్యాట్మింటన్ అకాడమిలో మిత్రులతో కలిసి షటిల్ ఆడడానికి వెళ్లాడు. షటిల్ ఆడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. రాకేష్‌ను వెంటనే తోటి స్నేహితులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణించాడని తెలిపారు. కాగా ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువైపోయాయి. వయసుతో సంబంధం లేకుండా అందరినీ గుండెపోట్లు బలి తీసుకుంటున్నాయి. ఆరోగ్యంగా ఉండి నవ్వుతూ, తుళ్లుతూ తిరిగే వారు కూడా ఉన్నట్టుండి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా 25 ఏళ్ల ఓ యువకుడు రాకేష్ గుండెపోటు కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడు. షటిల్ ఆడుతూ ఉన్నట్టుండి నేలపై పడిపోయాడు. అక్కడికక్కడే షటిల్ కోర్టులోనే ప్రాణం విడిచాడు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governerpet, Vijayawada – 520002 (A.P.)

**E-Procurement Tender Notice**

NIT No. 66/MAU61-USI0HB(BG)/2/2025-HB, Dt.28.07.2025

**Name of Work:** APCRDA - "RFP for Engagement of Project Management Consultant (PMC) for "Completion of balance works of multi-storied Quarters of 18 towers of (S+12) Floors Pattern for Hon'ble MLAs & Hon'ble MLCs and All India Services officers, 71 Bungalows of (G+1) floors for Hon'ble Ministers & Hon'ble Judges and 115 Bungalows of (G+1) floors for AIS Principal Secretaries and AIS Secretaries and Completion of balance works in External Infra Development for multi-storied apartment quarters in 14 towers of (S+12) floors pattern buildings for Gazetted Officers Type-I & Type-II and Group-D officials", in Amaravati Govt. Complex Village, Amaravati, Andhra Pradesh including DLP of 2 Years".

The bid can be downloaded on AP e-procurement portal from **30.07.2025** to **14.08.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **14.08.2025** up to **15.00 Hrs**, Technical bid opening **14.08.2025 @16.00Hrs**. For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**.

Sd/-Commissioner, APCRDA, Vijayawada



**తెలంగాణ ప్రభుత్వం**
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ, సర్కిల్ హైదరాబాద్**

టెండర్ ప్రకటన నం: T2/MB/శ్రీశైలం SEG/O&M 2025-26/ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్‌లు/2025/1, తేది: 26.07.2025

పని పేరు: "శ్రీశైలం సెగ్మెంట్ యొక్క O&M యొక్క ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్‌లకు సంబంధించి, 1వ ఏప్రిల్ 2025 నుండి 31వ మార్చి 2026కు ఆ కాలానికి ఇంటిగ్రేటెడ్ CPWS పథకాలు మరియు WQMS ల్యాబ్‌లు కలిపి తెలంగాణ త్రాగునీటి సరఫరా ప్రాజెక్ట్ (TDWSP) క్రింద శ్రీశైలం రిజర్వాయర్ నుండి రంగారెడ్డిలో చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూర్ మరియు మహేశ్వరం నియోజకవర్గాలకు త్రాగునీటి ఏర్పాటు కొరకు ఆపరేషన్ & నిర్వహణ" పని యొక్క 2025-26 O&M. 1) ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో టెండర్ డాక్యుమెంట్‌లు అందుబాటులో ఉన్నాయి. 31.07.2025 నుండి 07.08.2025 మ.03.00 గం. వరకు. 2) టెండర్ స్వీకరణ: 07.08.2025 మ.03.30 గం. వరకు. 3) టెక్నికల్ బిడ్ తెరచు తేది: 07.08.2025 సా.04.00 గం. వరకు. 4) ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 12.08.2025 మ.12.00 గం. వద్ద. 5) కాల్ నం.: 1 పిలుపు. 6) సంబంధిత అధికారి: సూపరింటెండింగ్ ఇంజనీర్, MB సర్కిల్, హైదరాబాద్. 7) కాంటాక్ట్ నం.9100121084

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ సర్కిల్, హైదరాబాద్.

DIPR.No.5689-PP/CL/Advt/1/2025-26, తేది: 28.07.2025



**DEBTS RECOVERY TRIBUNAL-II, HYDERABAD (DRT-II)**
**1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001**

**Case No. OA/213/2025**

**Summons under Sub-Section (4) of Section 19 of the Act, read with Sub-Rule (2A) of Rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993**

**Between:**

**Canara Bank** is a body corporate constituted under the Banking Companies (Acquisition & Transfer of Undertakings) Act, 1970 and having its Head Office at No. 112, J C Road, Bengaluru-560002, Branch Office at Vengal Rao Nagar, SR Nagar, Hyderabad, Rep. by its Branch Manager Nalligari Vijay Kumar S/o N Prakash, Aged about 44 yrs, Mail ID: cb6108@canarabank.com ...**Applicant**

**And**

**Mr. Sayyed Kausar Basha S/o.M Maqbool Basha**, Aged about 45 years, Occ: Private Service, Male, R/o. Flat No.303, Amrutha Residency, Brahmanwadi, 4th Line, Begumpet, Hyderabad-500016, **Also:** R/o. Flat No.401, 4 Floor, D.No.1-10-231/B/1/401, Agrasen Pride, Begumpet, Hyderabad-500016. ...**Defendants**

**SUMMONS**

WHEREAS **OA/213/2025** was listed before the **Hon'ble Presiding Officer on 10-06-2025.** WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 1,50,17,959/-** only application along with copies of documents etc., annexed).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-

**(i)** To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.

**(ii)** To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.

**(iii)** You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.

**(iv)** You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.

**(V)** You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank of financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before registrar officer, **DRT-II, Hyderabad on 01-09-2025 at 10:30 AM** failing which the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date **24-07-2025.**

**Sd/- Registrar**
**DEBTS RECOVERY TRIBUNAL-II, Hyderabad**

వార్త

చాలా మంది తమ అంతరాత్మలోకి వచ్చే గొప్ప ఆలోచనల్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ అవే ఆలోచనలు ఎదుటి వారిలో చూసి అంతగొప్ప ఆలోచన వచ్చినందుకు ఆశ్చర్యపోతారు.

-సోమర్‌సెట్ మామ్

# సుప్రీం తీర్పుతో కనువిప్పు కలిగేనా?

మేధస్సును పంచేవారు మనిషి. మనస్సును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు. మన విద్యాలయాల్లో అంతోఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనస్సును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావిభారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్థాంతరంగా బలవర్మణాలకు పాల్పడుతున్నారు. తాజాగావిద్యార్థుల మానసిక ఆరోగ్యం పట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వారి మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలని, ఒత్తిడికిలోనై బలవన్మరణాలకు పాల్పడకుండా నివారించాలని ఆదేశాలు జారీ చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 21కల్పించే 'జీవించే హక్కు'లో మానసిక ఆరోగ్యం అంతర్భాగమని స్పష్టంచేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగంలోని అధికరణ 32 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి విద్యార్థుల ప్రాథమిక హక్కుల అమలు కోసం ఉత్తర్వులు జారీచేస్తున్నట్లు శుక్రవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించింది. ఈ తీర్పును న్యాయస్థానం ప్రకటించిన చట్టంగా పరిగణించి అమలు చేయాలని ఆదేశించింది. ప్రభు త్వం దీనిపై ప్రత్యేక చట్టం కానీ, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ జారీ చేసేవరకు ఇవే అమలులో ఉంటాయని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. నీట్ శిక్షణకోసం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చి విశాఖపట్నంలో హాస్టల్‌లో ఉంటున్న ఒక విద్యార్థిని 2023 జూలై 14 తేదీ రాత్రి మూడో అంతస్తు నుంచి పడిపోయి తీవ్ర గాయాలపాలైంది. ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మరో కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. దీనిపై అప్పట్లోనే విశాఖపట్నంలో కేసు నమోదైంది. విద్యార్థిని తండ్రి విజ్ఞప్తి మేరకు హాస్టల్, ఆస్పత్రుల నుంచి సిసిటీ ఫుటేజీలను, ఇతర సాక్ష్యాధారాలను సేకరించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే అంతకు ముందే మృతురాలి తండ్రి కోల్‌కతాలోని నేతాజీ నగర్ పోలీసుస్టేషన్‌లో కోచింగ్ ఇన్స్టిట్యూట్, హాస్టల్, ఆస్పత్రులపైన కేసు పెట్టారు. విశాఖపట్నంలో నమోదైన కేసులో పోలీసులు దర్యాప్తు చేపట్టి నలుగురిని నిందితులుగా గుర్తించారు. ఫోర్సెనిక్ నమూనాల విశ్లేషణలో అధికారులు విఫలమయ్యారని అనుమానాస్పద మృతిని ఆత్మహత్యగా ప్రకటించడం చట్టవిరుద్ధమంటూ విద్యార్థిని తండ్రి సెప్టెంబరు 2023లో ఎపి హైకోర్టులో రిట్ వేస్తూ కేసును సిబిఐకి అప్పగించాలని కోరారు. విచారించిన హైకోర్టు మృతురాలి ఫోర్సెనిక్ నమూనాలను ఢిల్లీలోని నిమ్స్‌కు పంపి మరణానికి కారణాలను నిర్ధారించాలని ఆదేశించింది. అయితే ఈ మరణంపై ఎపి, పశ్చిమ బెంగాల్‌లో వేర్వేరుగా ఎఫ్ఐఆర్ నమోదైనందున కేసును సిబిఐ విచారణకు ఆదేశించడం తమ పరిధిలో లేదని విచారణ ముగించింది. మృతురాలి తండ్రి ఈ దశలో సుప్రీంకోర్టును ఆశ్రయించగా వెంటనే సిబిఐకి అప్పగించాలని సిబిఐ డైరెక్టర్ దీనిపై తక్షణం కేసు నమోదు చేసి ఎస్పి స్థాయి అధికారి పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం పదిహేను అంశాలతో మార్గదర్శకాలను జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, కోచింగ్ సెంటర్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, హాస్టళ్లకు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అంతేకాదు దీనిపై కేంద్రప్రభుత్వం తొంభై రోజుల్లోపు తీసుకున్న చర్యలు నివేదికను సమర్పించాలని నిర్దేశించింది. పిల్లలు పరీక్షల ఒత్తిడికి లోనుకాకుండా చూడడానికి మానసిక కౌన్సిలర్లకు బాధ్యత అప్పగించాలని, ర్యాగింగ్, లైంగిక దాడులు, వేధింపులపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించి బాధితులకు అండగా నిలబడేందుకు అన్ని విద్యాసంస్థలు పటిష్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆ నిబంధనలో స్పష్టం చేసింది. ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం చేసింది. జైపూర్, కోటా, సిఖా, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, ముంబాయి నగరాలతోపాటు పోటీ పరీక్షలకు సమాయత్తం కావడానికి శిక్షణకోసంవిద్యార్థులు పెద్దఎత్తున తరలివెళ్లే ప్రాంతాల్లో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని అలాంటి చోట్ల ప్రత్యేకదృష్టి పెట్టాలని సుప్రీంకోర్టు నిబంధనల్లో పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఆదేశాలను పలువురు విద్యావేత్తలు, ప్రజాస్వామ్యవాదులు ఆహ్వానిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడితే కొంతలో కొంతవరకైనా ఈ ఆత్మహత్యల పరంపర ఆగే అవకాశం ఉంది. తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తూ కుటుంబంలో కాంతులు వెదజల్లే దీపాల్లాంటివారు దేశ భవిష్యత్‌లో భాగస్వామ్యం కావాల్సిన దివ్వెలు అర్థాంత రంగా ఆకస్మికంగా ఆరిపోతున్నారు. భారత్‌లో 1995- 2019వరకు మధ్యకాలంలో వివిధ కారణాలతో లక్షా డెబ్బైరెండువేల అరవై రెండు మంది బలవన్మరణాలకు పాల్పడినట్లు జాతీయ నేరగణాంకాల విభాగం (ఎన్‌సి ఆర్‌బి) స్పష్టం చేసింది. ప్రతిష్టాకరమైన ఐఐటిల్లో సీటు వచ్చిందని ఆనందంగా చేరిన విద్యార్థులు కూడా అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. గత నాలుగు రోజుల్లో ఖరగ్‌పూర్ ఐఐటిలో మెరికల్లాంటి ఇద్దరు విద్యార్థులు అర్థాంతరంగా తనువు చాలించారు. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి విద్యార్థిలోకాన్ని ఈ బల వంతపు చావుల నుండి బయటపడేసేందుకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు. తక్కినవారు వారిని అనుసరిస్తూ ఉంటారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్

ఖూనీ కోరులో కూడా పరిశుద్ధాత్మ మరణించదు. అది అతడి పొరపాటు. దాన్ని వ్యక్తం చేయలేక అతడు అది కప్పి పుచ్చుతాడు.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టాలి

ఇటీవల కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో పాఠశాలలు, కళాశాలలస్థాయిలో మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం చాలా హర్షణీయమైన విషయం. ఈకమిటీలు విద్యార్థుల్లో అవగాహన కల్పించడం, వారికి ధైర్యం చెప్పడం, అవసరమైన సహాయం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా మంచి మార్పుకు దారితీస్తాయి. ఈ రోజు యువత మత్తుపదార్థాల వలలో చిక్కుకునే ప్రమాదం తీవ్రమవుతోంది. దీనికి ప్రధాన కారణం సరైన సమయంలో సరైన దారి చూపే చర్యలు లేకపోవడమే. పాఠశాల స్థాయిలోనే ఈ సమస్యను అర్థంచేసుకునేలా చేయడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్యులు, పోలీసు అధికారులు కలిసి పనిచేసే విధంగా వ్యవస్థను రూపొందించడం చాలా అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్నవాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధానకారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్రముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాల పాటుధ్యానంచేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరుఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తిపలకాలి. భక్తి,భుక్తి మితంగాఉండాలి. అప్పుడు వృత్తిలో కూడా ఎదగడానికి ఆస్కారం ఎంతో ఉంది.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## మొబైల్ న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయాలి

గ్రామాలలో మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధరాకాలుగా కులం, భార్య భర్తల కొట్లాటలు, పొలం గట్టు అల్లర్లు గొడవలతో ప్రజలు ప్రతినిత్యం పంచాయతీ పెద్దమనుషులు కలుస్తున్నారు. కులం పెద్దలని ఊరు, వార్డు పెద్దమనుషలని పంచాయతీలు చేసే న్యాయకులమణి పంచాయతీలకు ఇరువైపులా నుండి డబ్బులు వసూలు చేసి దండుగలు కట్టిస్తున్నారు. రాజ్యాంగంప్రకారం గ్రామీణన్యాయ వ్యవస్థనులేదా మొబైల్ న్యాయవ్యవస్థను ఏర్పాటు చెయ్యాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

## పి4 రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక అసమానతలు తొలగించడం కోసం పి4 అనే కొత్తఅంశాన్ని తీసుకుని రావడం జరిగింది. ఈపథకంలో ఉపాధ్యాయులను వాలంటీర్ గా మార్గదర్శులుగా పి4లో రిజిస్టర్ అవ్వొచ్చు అని ప్రభుత్వం చెప్పడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అధికారులు ఉపాధ్యాయులను మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలని మెసేజులు, సర్క్యులర్లను పంపుతూ బలవంతం చేస్తున్నారు. ఉపాధ్యాయులు తమ ఇష్టపూర్వకంగా రిజిస్టర్ అయితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, కానీ ఇప్పటికే అనేక బోధనేతర పనులు, ఉపాధ్యాయుల కొరత ఉన్న సమయంలో పి4 కార్యక్రమంలో బలవతంగా ఉపాధ్యాయులను ప్రభుత్వం రిజిస్టర్‌చేయించడం సరికాదు. ప్రభుత్వం ఉపాధ్యాయులచే చేయిస్తున్న రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## తల్లిదండ్రులను గౌరవించండి

తమ జీవితాంతం పిల్లల కోసం బతికిన తల్లిదండ్రులనుచివరకు వృద్ధాశ్రమంలో, రోడ్లపైనా వదిలేస్తున్నారు కొందరు. తల్లిగా ప్రేమను పంచిన అమ్మ, కష్టపడి సంపాదించి చదువు చెప్పించి బిడ్డల ఉన్నతికి కారణమైన తండ్రి, రోడ్డుపై , వృద్ధాశ్రమంలో జీవిత చరమాంకంలో ఒంటరిగా, అనాథలా కాలం గడపాల్సి వస్తుంది. అదెంత బాధాకరం అనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. రేపు తమ బిడ్డలు కూడా అలాగే చేస్తే అని ఒక్కసారి ఊహించుకుంటే ఇంకెప్పుడు అలాంటి తప్పు చెయ్యరు. పిల్లలు వృద్ధతల్లిదండ్రులకు అండగా ఉంటే, సమాజం మరింత సంతోషకరంగా మారుతుంది. కాబట్టి తల్లిదండ్రులను గౌరవించండి.

-ఎన్. కృష్ణ,హైదరాబాద్

## రైతులకు తోడ్పాటు అందించాలి

భారత దేశం వ్యవసాయ ఆధారితం అని మనకు తెలుసు కోవిడ్ పుణ్యమాని వ్యవసాయ రంగం లోని కార్మికుల సంఖ్య పెరుగుతూఉందని ఇటీవల ఆర్థికగణాంకాలుస్పష్టం చేస్తున్నాయి. ఇవ్వాళ చాలామంది ఆర్థిక వేత్తలు అదే విషయం చెపుతున్నారు. దానికి ప్రధానకారణం నీటిని ఒడిసిపట్టడంతో పాటు కేంద్రంప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి కృషిసించాయ్ యోజన లాంటి పథకాల ద్వారా రైతుకు అవసరమైన పరికరాలు అందించడం మూలంగా రైతులకు తోడ్పాటును అందిస్తున్నాయి. పథకాల ద్వారా బహువిధాలుగా వ్యవసాయం విస్తరిస్తుంది.

- భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలే శరణ్యం!

**ఇప్పటివరకు మన ఉభయ తెలుగురాష్ట్రాలలో నామమాత్రం అధికారులు మాత్రమే బదలాయించి మిగతా అధికారాలు అన్ని రాష్ట్రప్రభుత్వాలే తమ వద్ద ఉంచుకున్నాయి. 'ఇంటిముందు పాలన కంటి ముందు ప్రభుత్వం' అనే నినాదంతో స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య కొందరు మాజీ సర్పంచులు స్థానిక ప్రభుత్వాల సాధికారత పట్ల ఉన్న స్వచ్ఛంద సంస్థలు వ్యక్తుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ప్రారంభించింది. అధికార కేంద్రీకరణ అవసరం కానీ అది అవినీతి వికేంద్రీకరణగా మారకూడదన్నది కూడా సమాఖ్య ఉద్దేశం. వెంటనే రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పంచాయితీ మండల జిల్లా పరిషత్ అంచెలలోని మూడు స్థాయిలోని స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అలాగే వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తిచేసుకుని తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనించాలని స్థానిక ప్రభుత్వాలకు పూర్తి అధికారాలు బదలాయించాలని ఈ సమాఖ్య కోరుతుంది. స్థానిక ప్రభుత్వాల సాధికారత వేదిక పార్టీలకు కులాలకు ప్రాంతాలకు పదవులకు అతీతంగా పనిచేస్తుంది.**



బండారు రామ్మోహనరావు

తెలంగాణ 2024 జనవరి 31 నాటికి గ్రామపంచాయతీల సర్పంచులు వార్డు మెంబర్ల పదవీకాలం ముగిసింది. గత 18 నెలలుగా గ్రామ పంచాయతీలలో అధికారుల ఆధ్వర్యంలో పర్సన్ ఇన్చార్జిల పాలన కొనసాగుతుంది. ఇక 2024 జూన్ చివరికి ఎంపీటీసీలు ,జెడ్ పిటిసిలు, మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ల పదవీకాలం కూడా పూర్తయింది. 2025 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 169 మున్సిపాలిటీలలో సింహభాగం పదవీకాలం కూడా పూర్తయింది. అలాగే గ్రేటర్‌హైదరాబాద్ మినహాయించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మిగతా నగర పాలక సంస్థల పదవీకాలం కూడా 2025 మార్చిలో పూర్తయింది. ప్రస్తుతం తెలంగాణలో స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. పంచాయతీ ఎన్నికలకు కులగణన సాకుగా చూపిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ స్థానికప్రభుత్వాల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావడం లేదు. పదవీకాలం పూర్తయిన పంచాయతీలు మండల జిల్లా పరిషత్ ఎన్నికలు జరపడానికి రాష్ట్రప్రభుత్వం ఒక షరతు పెట్టింది. రాష్ట్రంలో కులగణన జరిగిన తర్వాత మాత్రమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కులగణన కోసం కమిషన్ ఏర్పాటుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కులగణన నిర్వహించి కూడా సుమారు 10 నెలలు కావస్తోంది. అధిగమించి చివరకు అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్ని పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. అలాగే 2018 పంచాయతీ రాజ్ చట్టానికి ఒకటి రెండు సవరణలు చేసి ఒక ఆర్డినెన్స్ తీసుకురావడానికి కూడా రాష్ట్రప్రభుత్వం ప్రయత్నించింది. ఇప్పటికే ఆర్డినెన్స్ జారీకి అవసరమైన పత్రాలు రాష్ట్ర గవర్నర్‌కి పంపించింది. ఆర్డినెన్స్ విషయంలో గవర్నర్ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో 42శాతం బీసీల రిజర్వేషన్లు అమలులో చేయడం రాష్ట్ర ప్రభుత్వం ముందు మూడు మార్గాలు ఉన్నాయి. విద్యా ఉద్యోగాలతో సహా స్థానిక ప్రభుత్వాలలో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడానికి అవసరమైన కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న మూడో ఆప్షన్ పంచాయతీ నుండి మొదలుకొని జిల్లా పరిషత్ వరకు వచ్చే ఎన్నికల్లో పార్టీ పరంగా 42రిజర్వేషన్ ఇవ్వడం తుది పరిష్కారం. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతామన్న కామారెడ్డి డిక్లరేషన్‌పై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. 73,74 వ రాజ్యాంగ సవరణల ప్రకారం ఆయా రాష్ట్రాలకు స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు జరపడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్లు ఏర్పాటైనాయి. స్థానిక ప్రభుత్వ పదవీకాలం పూర్తి కాకముందేమూడు నెలల ముందుగా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ చట్టబద్ధంగా ప్రారంభించవచ్చు. స్థానిక ప్రభుత్వాల నియోజకవర్గాల పునర్విభజన డిలిమిటేషన్ తోపాటు ఆయా కులాలకు వర్గాలకు రిజర్వేషన్ల ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉన్నందున ఆ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కమిషన్‌కి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేయాలి. 2025 సెప్టెంబర్ 30లోపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయితీల ఎన్నికలు జరిపించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు గడువు విధించి మొదటి నెలపూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం



కోరిన నెల రోజుల సమయం జూలై 31తో ముగుస్తుంది. అటుపై ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు నిర్వహించడానికి అడిగిన గడువు మరో రెండు నెలలు ఉంది. పంచాయతీలు మొదలుకొని నగర కార్పొరేషన్ల వరకు అన్ని స్థాయిల్లో స్థానిక ప్రభుత్వాలు అన్నిటికీ కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి బీసీ కులగణన తర్వాత రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నికల నిర్వహణకు అడ్డం వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఒక వెసులుబాటు కూడా ఉంది. ఇప్పటికే అనేక కొత్త జిల్లాలు రెవిన్యూ డివిజన్లు మండలాలు ఏర్పడి ఉన్నాయి. అలాగే స్థానిక ప్రభుత్వాల రిజర్వేషన్లను రెండవసారి అవే రిజర్వేషన్లు కొనసాగుతాయని అప్పటి కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకొని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా రాజకీయ నిర్ణయం తీసుకొని చట్టం చేసి ఒక జీవో జారీ చేసింది. కనుక ప్రస్తుతం రెండవసారి ఈ ఆయా స్థానిక ప్రభుత్వాలు నియోజకవర్గాలకు రిజర్వేషన్లు మళ్లీ కొత్తగా నిర్ణయించాల్సిన అవసరం లేదు. అవే రిజర్వేషన్లు కొనసాగుతాయి. కనుక రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఈవిధమైన ఇబ్బందులేవీ ప్రస్తుతం లేవు. కనుక పంచాయతీ స్థాయి నుంచి జిల్లా పరిషత్ వరకు మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ల వరకు ఈ ఎన్నికలు జరపడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి వెసులుబాటు ఏర్పడింది. ఈ దశలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు చేసిన ప్రత్యక్ష ఎన్నికలవిధానాన్ని తీసుకురావాల్సిన చారిత్రక అవసరం ఈనాడు ఏర్పడింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే గ్రామపంచాయతీ సర్పంచులతో పాటే మండల పరిషత్ అధ్యక్షులకి జిల్లా పరిషత్ అధ్యక్షులకు కూడా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తే అప్పుడు ఈ అవిశ్వాస తీర్మానాలకు ఆస్కారం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈ ఆయారాం గయారాం వ్యవస్థ ఉండదు. స్థానిక ప్రభుత్వాలు మరింత పటిష్టం కావడానికి ప్రత్యక్ష ఎన్నికలే ప్రామాణికం అవుతాయి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయాలని స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య వేదిక కోరుతుంది. స్థానిక ప్రభుత్వాలు పటిష్టంగా ఉంటే గ్రామాలు,పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయి. 'తుమ్మితే ఊడిపోయే ముక్కు' లాగా స్థానిక ప్రభుత్వాలు ఉన్నంతకాలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి మీద పెత్తనం చెలాయిస్తాయి. ప్రతిరోజు పరగడుపులాగా స్థానిక ప్రభుత్వాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లమీద, భిక్ష మీద ఆధారపడి నడిస్తే స్థానిక ప్రభుత్వాలకు స్థానికంగా ఆర్థిక సాధికారత లభించదు. ప్రతిరోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎంగిలి మెతుకుల విదిలింపుపై స్థానిక ప్రభుత్వాలు ఆధారపడితే వాటికి స్వాతంత్ర్యం ఉండదు. ప్రస్తుతం దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ కొన్ని రాష్ట్రాలను మినహాయిస్తే ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎమ్మెల్యేల రాజ్యం, ఎంపీల రాజ్యమే నడుస్తుంది. గ్రామాలలో లబ్ధిదారులు ఎంపిక నుంచి మొదలుకొని అంగన్వాడి ఆయాటీచర్ల నియామకం, ఆశావర్గాల నియామకం రేషన్ షాపు డీలర్ల నియామకం వరకు అన్ని స్థాయిలలో ఎమ్మెల్యేల పెత్తనం కొనసాగుతుంది. ఇది మారాలంటే స్థానిక ప్రభుత్వాలకు చట్టబద్ధ అధికారాలు ముఖ్యంగా 73,74 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు 29అంశాలు అధికారాలు మున్సిపాలిటీలకు కేటాయించవలసిన 18 అంశాలు అధికారాలు పూర్తిగా బదలాయించినప్పుడే స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలు ఇచ్చినట్టు లెక్క. ఇప్పటివరకు మన ఉభయ తెలుగురాష్ట్రాలలో నామమాత్రం అధికారులు మాత్రమే బదలాయించి మిగతా అధికారాలు అన్ని రాష్ట్రప్రభుత్వాలే తమ వద్ద ఉంచుకున్నాయి. 'ఇంటిముందు పాలన కంటి ముందు ప్రభుత్వం' అనే నినాదంతో స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య కొందరు మాజీ సర్పంచులు స్థానిక ప్రభుత్వాల సాధికారత పట్ల ఉన్న స్వచ్ఛంద సంస్థలు వ్యక్తుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ప్రారంభించింది. అధికార కేంద్రీకరణ అవసరం కానీ అది అవినీతి వికేంద్రీకరణగా మారకూడదన్నది కూడా సమాఖ్య ఉద్దేశం. వెంటనే రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పంచాయితీ మండల జిల్లా పరిషత్ అంచెలలోని మూడు స్థాయిలోని స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అలాగే వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తిచేసుకుని తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనించాలని స్థానిక ప్రభుత్వాలకు పూర్తి అధికారాలు బదలాయించాలని ఈ సమాఖ్య కోరుతుంది. స్థానిక ప్రభుత్వాల సాధికారత వేదిక పార్టీలకు కులాలకు ప్రాంతాలకు పదవులకు అతీతంగా పనిచేస్తుంది. ●

# పులుల సంఖ్య తగ్గడం జీవ వైవిధ్యానికి ప్రమాదకరం!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి


వన్యప్రాణుల్లో రాజసం, ఆహార్యంలో హుందాతనం, అమాయకత్వం, ఠీవి, నడకలో గాంభీర్యం, పరుగులో వాయు వేగం, శరీరంలో శక్తి ఊట, దినచర్యలో చురుకుదనం లాంటి ప్రత్యేక లక్షణాలకు పర్యాయపదంగా పులి జాతి నిలుస్తున్నది. అడవికి రాజు సింహమే అయినప్పటికీ వేగంగా పరుగెత్తడంలో రారాజుగా పులి ముందున్నది. వన్యప్రాణులతో మమేకం అవుతూ, సహజీవనం చేస్తున్న పులి జాతిని అంబరిల్లా స్పీసీస్ లేదా గొడుగు జాతిగా కూడా పిలుస్తారు. అడవుల్లో శాకాహార జంతువులను తన ఆహారం కోసం వేటాడుతూ, ఆ జంతువుల జనాభాను పెరగకుండా చూస్తూ, హరిత వనాలను రక్షించే పరోక్ష విధులను పులులు నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏటఆ 2జూలై రోజున అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే పాటించడం 2010 నుంచి ఆనవాయితీగా మారింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025అంతర్జాతీయ పులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం" అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణబాధ్యతలను వివరిం చడం జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 13 దేశాల్లోనే పులులు ఉన్నాయి. ఇండియా (3,682 పులుల జనాభా), రష్యా (750), ఇండోనేషియా (400), నేపాల్ (355), థాయిలాండ్ (189), భూటాన్ (151), మలేషియా (150), బంగ్లాదేశ్ (146), మయన్మార్ (22), చైనా (20), వియత్నామ్(05),లావోస్ (02పులులు) అనబడే దేశాల్లోనే పులులు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధిక పులుల జనాభా భారత్‌లో ఉన్నందున మన 'జాతీయ జంతువు'గా 'రాయల్ టైగర్'ను నిర్ణయించారు. భారత ప్రభుత్వ చొరవతో పులుల జాతిని సంరక్షించడానికి 1973లో 'ప్రాజెక్ట్ టైగర్' 2006లో జాతీయ పులుల సంరక్షణ అథారిటీలను స్థాపించడంతో పాటు 58 టైగర్ రిజర్వులను నిర్వహించడం జరుగుతోంది. భారత్‌లో 2014లో 2,236 పులులు, 2018లో 2,967 పులులు ఉండగా, 2022లో 3,682 పులుల జనాభా ఉన్నది. ప్రపంచ పులుల జనాభాలో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల సంఖ్య వృద్ధిరేటు 6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులుల సంఖ్య నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. చర్మం,గోళ్లు, దంతాలు,మాంసం, ఎముకలు, జుట్టు లాంటి అవయవాల కోసం పులులను అక్రమంగా వేటాడి చంపడం జరుగుతోంది. సగటున 15 ఏండ్లు బతికే పులుల బరువు 600 పౌండ్ల వరకు ఉంటుంది. నీటిలో ఈదగలిగే సామర్థ్యం కలిగిన పులులు ఒక పూట 88పౌండ్ల మాంసం తినగలుగు తాయి. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తున్న నవ్య మానవాళి, అవి మానవ ఆవాసాల్లోకి రావడం, సాధు జంతువులపై దాడి చేయడం, మానవులపై సైతం దాడి చేయడంతో నేడు తగిన మూల్యం చెల్లించుకుంటున్నాం. ●



# బీసీ రిజర్వేషన్లు సామాజిక న్యాయదిశగా జరిగేనా?

శ్రీనివాస్ గుండోజు

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒకదాని తరువాత ఒకటిగా అమలు చేసుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలోనే బీసీలకు రిజర్వేషన్‌పై ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతోంది. అయితే రిజర్వేషన్ల కల్పన అనేది కేంద్రం పరిధిలోనిది కావడంతో ఆలస్యం అవడమో, తిరస్కరణకు గురి కావడమో జరిగే అవకాశాలు ఉన్నందున కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్రంలో బీసీ బిల్లు ఆమోదం జరిగినా జరగకపోయినా రాష్ట్రంలో ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ముందుకు సాగుతోంది. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనే ప్రతిపాదన సామాజిక న్యాయం దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు. ఈ లక్ష్యసాధనకోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం ద్వారా ఈ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికలలో అమలు చేయాలని యోచిస్తోంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, రిజర్వేషన్లు 50 శాతం సీలింగ్‌ను మించకూడదనే నిబంధన ఉంది. ఈ సీలింగ్‌ను దాటడానికి అసాధారణ పరిస్థితులు కలిగి ఉండాలి. ఆధారాలతోకూడిన డేటా అవసరం. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఆర్డినెన్స్ ద్వారా అమలు చేయాలని ప్రతిపాదించినప్పటికీ, ఈ ఆర్డినెన్స్ చట్టబద్ధంగా నిలబడాలంటే సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్' పాటించాల్సిన అవసరం ఉంటుంది. ఈ టెస్ట్‌లో మూడు విధానాలలో ఈ రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భిన్నంగా ఉన్నాయా లేవా అనేది నిర్ధారిస్తారు. ట్రిపుల్ టెస్టులో మొదటిది డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు. బీసీ జనాభా, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయడానికి ఒక స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలి. రెండవది కులాలవారీ గణాంకాలు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ కోటాను నిర్ధారించడానికి సమగ్ర డేటా సేకరించాల్సిన అవసరం ఉంటుంది. ఇక మూడవ టెస్టు 50శాతం సీలింగ్ పాటించడం. రిజర్వేషన్ల మొత్తం శాతం 50 శాతాన్ని మించకూడదు, లేదా దీనికి ఆమోదయోగ్యమైన కారణాలు ఉండాలి. ఇవి మొత్తం ట్రిపుల్ టెస్ట్‌లో భాగమైన పరిశీలనలు. ఈ క్రమంలో ఇంకో విషయాన్ని సైతం పరిగణలోకి తీసుకోవాలి. మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి తెలంగాణలో ఈ ట్రిపుల్ టెస్ట్ పాసైతేనే 42 శాతం రిజర్వేషన్ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఆర్డినెన్స్ ద్వారా ఈ కోటాను అమలు చేయడం న్యాయపరంగా కష్టమని, పార్లమెంట్ ఆమోదం లేకుండా ఇది సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 213(1)(ఎ) ప్రకారం, రాష్ట్రపతి ఆమోదం అవసరమైన బిల్లులపై గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం లేదని స్పష్టంగా పేర్కొనబడింది. బీసీ రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగ సవరణ లేదాకేంద్ర ప్రభుత్వ ఆమోదం అవసరమయ్యే అంశం కాబట్టి, ఆర్డినెన్స్ ద్వారా దీనిని అమలు చేయడం చట్టపరంగా నిలబడకపోవచ్చుననే వాదనలు న్యాయ నిపుణుల నుంచి వెలువడుతున్నాయి. ఈ విషయంలో గవర్నర్ ఆర్డినెన్స్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపారని, న్యాయపరమైన సలహాల కోసం ఈచర్య తీసుకున్నారని సమాచారం. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్డినెన్స్‌పై రాజకీయ విమర్శలు సైతం భారీగానే వెల్లువెత్తుతున్నాయి. కొందరు రాజకీయ నాయకులతో పాటు బీసీ హక్కుల ఉద్యమకారులు సైతం ఈ ఆర్డినెన్స్‌ను 'మోసం' గా అభివర్ణిస్తున్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆర్డినెన్స్ న్యాయపరంగా నిలబడదని విమర్శించారు. అలాగే, బీఆర్ఎస్ నాయకులు గతంలో తాము 61.19 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు హైకోర్టులో కేసులు వేసి దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇక బిజెపి రాష్ట్ర నాయకులు సైతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. బీసీ రిజర్వేషన్ల అంశానికి న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని, కాంగ్రెస్ ఇచ్చినహామీని నిలబెట్టుకునే బాధ్యత సైతంకాంగ్రెస్ ప్రభుత్వానిదే అని చేతులు దులుపుకునేలా వ్యాఖ్యలు చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు కావాలంటే, పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొంది, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సి ఉంటుంది. ఇది రాష్ట్రప్రభుత్వం చేతిలో లేనిఅంశం. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించకపోతే, దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని పీసీసీ చీఫ్ హెచ్చరించారు. అయితే, కేంద్ర మంత్రులు ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉన్నారని, బీజేపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శలు వస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లను నిర్ధారించడానికి కులగణన ఒక కీలకమైన అంశం. తెలంగాణలో ఇటీవల జరిగిన కులగణన సర్వే ఆధారంగా ఈ 42 శాతం కోటాను బీసీలకు ప్రతిపాదించినట్లు ముఖ్యమంత్రితెలిపారు. అయితే, ఈ సర్వే ఎలా జరిగింది, దాని ఆధారంగా రిజర్వేషన్ కోటాను ఎలా నిర్ధారించారనే విషయంపై పారదర్శకత అవసరమని న్యాయ నిపుణులతోపాటు పలు బీసీ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం జనాభా గణనతో పాటు కులగణన చేపడతామని ప్రకటించింది. మొత్తం మీద ఆర్డినెన్స్ ద్వారా 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయడం చట్ట పరంగా సంక్లిష్టమైన అంశంగానే భావించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రాజ్యాంగ నిబంధనలు, పార్లమెంట్ ఆమోదం లేకుండా ఆర్డినెన్స్ న్యాయపరంగా నిలబడకపోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే ఆధారంగా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినప్పటికీ, దీనికి కేంద్రప్రభుత్వ ఆమోదంతోపాటు ట్రిపుల్ టెస్ట్ సమగ్ర డేటా సేకరణ అవసరం. బీసీ రిజర్వేషన్ల అమలు సామాజిక న్యాయం దిశగా ఒక ముఖ్యమైన అడుగు అయినప్పటికీ, దీనిని చట్టబద్ధంగా, పారదర్శకంగా అమలు చేయడం అనేది తప్పనిసరి. ●



# పహల్గాం బాధితులకు 'సిందూర్'తో న్యాయం

## మన సైనికుల సత్తా పరీక్షించడం సబబు కాదు..

### లోక్‌సభలో రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్



**న్యూఢిల్లీ,జూలై 28:** పహల్గాం దాడిలో ప్రియమైన వారిని కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. పాక్ పీచమణిచే కార్యాచరణని వచ్చేట్లు చేశామని లోక్‌సభలో జరిగిన చర్చలో తెల్పివెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా రాజకీయ, సైనిక లక్ష్యాలను నెరవేరయని వివరించారు. యుద్ధం ప్రారంభించడం తమ లక్ష్యం కాదని తెల్పివెప్పారు. మన దేశానికి చెందిన ఎన్ని విమానాలు కూలాయనే ప్రశ్నల నేపథ్యంలో దేశ భద్రత విషయంలో చిన్న చిన్న విషయాలకు అంత ప్రాధాన్యత ఉండదని స్పష్టంచేశారు. మన సైనికుల సత్తాను ప్రశ్నించడం విపక్షాలకు సరికాదు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నా. ఈ ఆపరేషన్ తర్వాత పాక్ సైన్యం మనపై దాడికి దిగింది. పాక్ దాడులను మన సమర్థంగా తిప్పి కొట్టాం. పాక్‌పై మనసైనికులు వీరోచితంగా విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో పాకిస్తాన్‌లోని మిస్సైల్ లాంచింగ్ స్టేషన్ ధ్వంసమైంది. అనంతరం పాక్ మనపై జరిపిన దాడులను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది.

**దాయాది దేశం దాడులను మనం సమర్థంగా అడ్డుకున్నాం: రాజ్‌నాథ్ సింగ్**

రక్షణ శాఖ మంత్రి ఈ సందర్భంగా భారత వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందని భారత సైన్యాన్ని అభినందించారు. "మన త్రివిధ దళాలు కలిసి పాక్ దాడులను తిప్పికొట్టాయి. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మన సైనికులు పాక్‌పై దాడులు జరిపారు. అత్యంత కచ్చితత్వంతో ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం. ఉగ్రవాదులపై మనం చేసిన దాడులను అనేక దేశాలు సమర్థించాయి. సరిహద్దులను దాటి వెళ్లడం ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడం, ఉగ్రవాదులను బుద్ధి చెప్పడమే మా లక్ష్యం. భారత దాడులతో ఉక్కిరిబిక్కిరైన దాయాది దేశం దాడులను వెంటనే ఆపాలని పాక్ అధికారులు విజ్ఞప్తి చేశారు" అని మంత్రి పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సైన్యానికి మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి బదులుగా ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనిక ఆపరేషన్ చేపట్టామన్నారు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత ఆయన అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాది హేయమైన చర్య అని అభివర్ణించారు. ఉగ్రవాదులు పర్యాటకుల్ని మతం పేరు అడిగి మరీ కాల్చి చంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆపరేషన్ సిందూర్‌కు ముందు సైనికులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. పాకిస్తాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సైన్యం దాడులు జరిపిందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో వందకు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టామని తెలిపారు. మే 7 రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయన్నారు. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిందన్నారు. మన సైనికులు ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశాయని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ కేవలం 22 నిమిషాల్లో పూర్తి చేశారని తెలిపారు.



# సరిహద్దు భద్రతకోసం బిఎస్ఎఫ్ దళాలకు బాడీ కెమేరాలు

**న్యూఢిల్లీ,జూలై 28:** భారత సరిహద్దుల భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా భారత సరిహద్దు భద్రతా దళం బిఎస్ఎఫ్ ఒక కీలకమైన ముందడుగు వేసింది. దేశంలోని అత్యంత సున్నితమైన భారత-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సైనికులకు 5,000కు పైగా అత్యాధునిక బాడీవోర్న్ కెమెరాలు, బయోమెట్రిక్ డేటాను సేకరించే పరికరాలను అందజేసింది. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం సరిహద్దుల్లో అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడంలో, మరింత పారదర్శకతతో కూడిన నిఘాను నిర్వహించడంలో బిఎస్ఎఫ్‌కు గణనీయంగా తోడ్పడుతుంది. ఈ బాడీ కెమెరాల ప్రధాన ఉద్దేశ్యం సరిహద్దుల్లో జరిగే ప్రతి సంఘటనను వీడియో రూపంలో రికార్డు చేయడం. ఈమధ్య కాలంలో బంగ్లాదేశీయుల దేశంలోకి అక్రమంగా చొరబడుతున్నారు. అంతేకాకుండా భారత సైన్యంపైనే దాడులు చేస్తున్నారు. వీటిని అందరి కళ్లకు కట్టినట్లు చూపించాలనే ఉద్దేశంతోనే బిఎస్ఎఫ్ ఈనిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చొరబాటును గుర్తించినప్పుడు వారిని వెనక్కి పంపే ప్రక్రియకు సంబంధించి దృశ్య ఆధారాలను సేకరించడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. అంతేకాకుండా అక్రమ రవాణా, మానవ అక్రమరవాణా వంటి సరిహద్దు నేరాలకు సంబంధించిన సాక్ష్యాలను నమోదు చేయడంలో, నేరాళ్ల భద్రతా సిబ్బందిపై దాడి చేసిన సందర్భాలను డాక్యుమెంట్ చేయడంలో ఈకెమెరాలు ఎంతగానో ఉపయోగ పడనున్నాయి. అయితే ఈ బాడీ కెమెరాలు రాత్రిపూట కూడా స్పష్టంగా రికార్డుచేసే నైట్‌విజన్‌సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. 12 నుండి 14 గంటల పాటు నిరంతరంగా వీడియోలను రికార్డు చేసే బ్యాటరీసామర్థ్యంకూడా ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. బిఎస్ఎఫ్ అతిగా బలప్రయోగం చేసిందన్న ఆరోపణలువచ్చినప్పుడు వాటిని ఎదుర్కో వడానికికూడా ఈ వీడియో ఆధారాలు ఉపయోగపడనున్నాయి. బాడీకెమెరాలతో పాటు బయోమెట్రిక్ డేటాను సేకరించే పరికరా లను కూడాకొన్ని సరిహద్దుపోస్టులలో ఏర్పాటుచేశారు.

## బ్యాంకాక్‌లో కాల్పుల కలకలం

### ఆరుగురి మృతి



**బ్యాంకాక్, జూలై 28:** థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అనంతరం దుండగుడు తనుకుతాను కాల్చుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. స్థానిక మీడియా సంస్థలు వెల్లడించిన వివరాల ప్రకారం.. బ్యాంకాక్‌లోని ఓర్ టు కో మార్కెట్‌లోకి చొరబడిన సాయుధుడు జరిపిన కాల్పుల్లో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఓ మహిళ మృతి చెందారు. ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన చతుచక్ మార్కెట్ సమీపంలో ఈ ఘటన జరగడంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. దాడి వెనుక కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ కాల్పులకు థాయ్‌లాండ్-కంబోడియా సరిహద్దుల వద్ద జరుగుతున్న ఘర్షణలతో ఏమైనా సంబంధముందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా బ్యాంకాక్‌లో దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. ఇటీవలే మే నెలలో కూడా థాంగ్ జిల్లాలోని ఓ పాఠశాల సమీపంలో దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.



## ఏప్రిల్ 22నుంచి జూన్17వరకూ ట్రంప్, మోడీలమధ్య ఎలాంటి చర్చల్లేవ్!

### పార్లమెంటులో విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, జూలై 28:** పహల్గాంవ్ దాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన తరుణంలో కాల్పులు తానే విరమింపచేసానన్న ట్రంప్ వ్యాఖ్యలపై పార్లమెంటులో విదేశాంగ మంత్రి జైశంకర్ సమాధానం ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానిమోడీలమధ్య ఏప్రిల్ 22వ తేదీనుంచి జూన్ 17వ తేదీ మద్యలో ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని ఆయన ప్రకటించారు. జూన్17వ తేదీ కాల్పుల విరమణ రోజువరకూ కూడా ఎలాంటి సంభాషణలు లేవని, పార్లమెంటులో విదేశాంగ మంత్రి ప్రకటించారు. వివాదాన్ని ముగించాలని, కాల్పులు నిలిపి వేయాలని తాను స్వయంగా పాకిస్తాన్, భారత్‌లను కోరానని అందువల్లనే అతి పెద్ద అణుయుద్ధం నిలిచిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.ట్రంప్ మొదటిసారిగా ప్రకటించినప్పటినుంచి కూడా భారత్ పదేపదే ఖండిస్తూవచ్చింది. ఎలాంటి మధ్యవర్తిత్వ సంప్రదింపులను కూడా తాము కోరుకోవడం లేదని తెగేసి చెప్పిందని జైశంకర్‌స్పష్టంచేసారు. వాస్తవానికి ప్రధాన మంత్రి మోడీ స్వయంగా ఈ సందేశం అమెరికా అద్యక్షుడితో జూన్ మధ్యకాలంలో చెప్పారని కూడా అన్నారు.కాల్పుల విరమణకు, అమెరికా వాణిజ్య ఒప్పందానికి ట్రంప్ లింకుపెట్టడాన్ని కూడా భారత్ తీవ్రంగావ్యతిరేకించింది. అణు క్షిపణుల క్రయవిక్రయాలు మానేద్దామని కూడా చెప్పానని యుద్ధంనిలిపివేస్తేనే వాణిజ్యచర్చలుంటాయని చెప్పడంతో కాల్పులునిలిచిపోయాయన్నారు.

## చైనా రేడియో వ్యవస్థను వాడుకున్న ఉగ్రవాదులు

### పక్షంరోజులనుంచి అనుమానాస్పద సంభాషణల గుర్తింపు

**శ్రీనగర్,జూలై 28:** పహల్గాం దాడిలోపాల్గొని అప్పటినుంచి పాకిస్థాన్‌కు పోకుండా మరింతగా ఉగ్రకార్యకలాపాలు కొనసాగించేందుకు పథక రచనలుచేస్తున్న ఉగ్రవాదులకాలం మూడింది. వారి పాపం పండింది. యుద్ధంలో ఆరితేరిన యోధులుగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణపొంది మరీ వచ్చి మన అమాయక పర్యాటకులను కాల్చివేసారు. దట్టమైన అటవీప్రాంతంలో చైనా రేడియో తరంగాలు యాక్టివ్‌గా ఉన్నట్లు భారత సైన్యం గుర్తించింది. దట్టమైన అటవీప్రాంతంలో ఈ సంకేతాలను తర్జుమాచేసుకుంటూ అనుమానాస్పద సంభాషణలు కొనసాగుతున్నట్లుగుర్తించారు. అంతేకాకుండా ఆప్రాంతంలో తిరుగాడే సంచార జాతులను కూడా దారిలోకి తెచ్చుకుని వారినుంచి కూడా సమాచారంసేకరించిన సైన్యం జాయింట్‌ఆపరేషన్‌ను నిర్వహించింది. ఆపరేషన్‌మహదేవ్‌కుముందు ఉగ్రవాదులు స్థానికుల సాయంతో అన్ని వసతులు పొందుతున్నట్లుగుర్తించారు. నిఘా సంస్థ లన్నీ ఒక్కసారిగా పంజా విసిరాయి. వారికి సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్న ఇద్దరిని అరెస్టుచేసి మొత్తం ఆరాతీసారు. 14రోజులనుంచి సందేహాస్పద చిట్‌చాట్‌జరుగుతున్నట్లుసైన్యం కనిపెట్టింది.

# ఔట్‌హౌస్‌లో నగదు లభిస్తే అది జడ్జిదేనని ఎలా భావిస్తారు?



## సుప్రీంలో విచారణజరుగుతుంటే అభిశంసన చర్చను ఎలా ప్రవేశపెడతారు?

### జస్టిస్ వర్మ కేసులో కపిల్ సిబాల్ వాదనలు

**న్యూఢిల్లీ,జూలై 28:** జడ్జి ఇంటి ఆవరణలోని ఔట్‌హౌస్‌లో నగదు లభిస్తే అది జడ్జికే చెందినదని ఎలా భావిస్తారని జస్టిస్ వర్మ కేసులో న్యాయవాది కపిల్‌సిబాల్‌ప్రశ్నించారు. ఒకవ్యక్తి తప్పుచేసినట్లు నిరూపితం కాకుండానే ఆయనపై పార్లమెంటులో ఎలాచర్చకు ప్రవేశపెడతారని కపిల్ తన వాదనలు వినిపించడంతో జస్టిస్ వర్మ కేసులో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేస్తుందని అందరూ భావిస్తారు. కానీ, ఢిల్లీలోని ఓ హైకోర్టు జడ్జి నివాసంలో భారీ మొత్తంలో నగదు లభ్యమైన ఘటన కేసు తీర్పు మాత్రం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈ కేసులో జస్టిస్ యశ్వంత్ వర్మా సుప్రీంకోర్టు చర్యలను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో, ఆయన నివాసంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈసందర్భంగా ఆయన ఇంటిలో భారీమొత్తంలో నగదు లభ్యమైంది. ఈ ఘటన అనేక అనుమానాలకు, అవినీతి ఆరోపణలకు దారితీసింది. దీని పర్యవసానంగా, జస్టిస్‌వర్మనుఢిల్లీ హైకోర్టునుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఈ ఆరోపణలను పరిశీలించడానికి ముగ్గురు న్యాయమూర్తులతో ఒకప్యానెల్‌ను ఏర్పాటుచేశారు. ఈ ప్యానెల్ నివేదిక ఆధారంగా జస్టిస్ వర్మాను తొలగించాలని సిఫార్సు చేశారు. జస్టిస్ వర్మ ఈ సిఫార్సును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో భారతదేశ సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదులుగా చేర్చారు. అయితే, సుప్రీంకోర్టు ఈ పిటిషన్ దాఖలు చేసిన తీరును తప్పుబట్టింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన బెంచ్ ఈ పిటిషన్ దాఖలు చేయకూడదని తెలిపింది. మీ ప్రధాన సమస్య సుప్రీంకోర్టుతోనే ఉందని తెలిపింది. అలాగే, ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ నివేదికను పిటిషన్‌తో జతచేయకపోవడంపై కూడా జస్టిస్ దత్తా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసులో జస్టిస్ వర్మా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. రాజ్యాంగంలో న్యాయమూర్తిని తొలగించేందుకు స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, ఆ నిబంధనల ప్రకారం న్యాయమూర్తి తప్పిదం నిరూపితం కాకముందే ఆయనపై చర్చ జరపడం సరికాదని వాదించారు. రాజ్యాంగం ప్రకారం, న్యాయమూర్తి తప్పిదం నిరూపితం కాకుండా పార్లమెంటులో కూడా చర్చించడం నిషేధమన్నారు. రాజ్యాంగ విరుద్ధమని అలాంటప్పుడు, ఈ విధంగా బహిరంగంగా చర్చలు, మీడియా ఆరోపణలు, న్యాయమూర్తులపై విమర్శలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని సిబల్ పేర్కొన్నారు. అలాగే, నగదు జస్టిస్ వర్మ ఇంటిలోని అవుట్ హౌస్‌లో లభ్యమైందని, అది జడ్జికి చెందినదని ఎలా నిర్ధారించగలమనిప్రశ్నించారు. దీనికి జస్టిస్ దత్తా, పోలీసులు, ఎఫ్ఐఆర్, సిబ్బంది అంతా అక్కడఉన్నారు, నగదు లభ్యమైందని సమాధాన మిచ్చారు. సిబల్ మాత్రం, జడ్జి సిబ్బంది అక్కడ లేరని, ప్యానెల్ నివేదిక విశ్వసనీయం కాదని వాదించారు. జస్టిస్ వర్మ తన పిటిషన్‌లో సుప్రీంకోర్టు ప్యానెల్ తన వాదనను సరిగ్గా వినలేదని పేర్కొన్నారు. న్యాయమూర్తిని తొలగించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని, సుప్రీంకోర్టు ఈ విషయంలో సిఫార్సు చేయడం రాజ్యాంగంలోని అధికార విభజన సూత్రాన్ని ఉల్లంఘించడమేనని ఆయన వాదించారు. న్యాయవ్యవస్థ పార్లమెంటు అధికారాలను స్వాధీనం చేసుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని ఆయన తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. ఈ కేసు తదుపరివిచారణ బుధవారంజరగనుంది. ఈ వ్యవహారం భవిష్యత్తులో న్యాయవ్యవస్థపై ప్రజలవిశ్వాసాన్ని, రాజ్యాంగ సమతుల్యతను ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి మరి.

## భద్రతాలోపాల నిందను ఎల్జీపై నెట్టేయడం సరికాదు:

### లోక్‌సభలో విపక్ష నాయకుడు గౌరవ్ గగోయ్

**న్యూఢిల్లీ,జూలై 28:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. తొలుత కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక చర్యలో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ చర్చలో పాల్గొంటూ, జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో భద్రతా లోపాలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బాధ్యత తీసుకోవాలన్నారు. భత్రలా లోపాల నిందను లెఫ్టినెంట్ గవర్నర్‌పై నెట్టేయడం సరికాదని పేర్కొన్నారు.
టెర్రరిస్టులను ఇంతవరకూ ఎందుకు పట్టుకోలేదు పహల్గాం ఉగ్రదాడి జరిగి 100 రోజులైన తర్వాత కూడా ఆ దాడిలో పాల్గొన్న ఐదుగురు ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర వైఫల్యాన్ని గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు. మీ దగ్గర డ్రోన్లు, పెగాసస్‌లు, శాటిలైట్లు ఉన్నాయి. కానీ ఉగ్రవాదులను పట్టుకోలేకపోయరు అని నిలదీశారు. పాక్‌నుంచి ఎలా పహల్గాం చేరారు ఆపరేషన్ సిందూర్‌పై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రకటనలో జమ్మూకశ్మీర్‌లో ఇటీవలజరిగిన పహల్గాం ఉగ్ర దాడికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో విఫలమయ్యారని గొగోయ్ విమర్శించారు.

## ఆపరేషన్ తందూర్ కోరుకున్నాం.. సిందూర్ కాదు!



### లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపి రామశంకర్ రాజ్‌భర్

**న్యూఢిల్లీ, జూలై 28:** ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం లోక్‌సభలో చర్చ జరిగింది. ఆ చర్చలో సమాజ్‌వాదీ పార్టీ నేత, ఎంపి రామశంకర్ రాజ్‌భర్ మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దేశం ఆపరేషన్ తందూర్ కోరుకుందన్నారు. ఆ దాడికి కారణమైన ఉగ్రవాదులను రోస్ట్ చేయాలని దేశ ప్రజలు కోరుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆశించలేదన్నారు. ప్రభుత్వం సరైన రీతిలో చర్యలు తీసుకునేందుకు విఫలం అయిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో జరిగిన జాప్యాన్ని ఆయన ప్రశ్నించారు. మూడు రోజుల్లో చేపట్టాల్సిన మిషన్‌ను ఎందుకు 17 రోజులు ఆలస్యంగా చేపట్టినట్లు అని ఆయన నిలదీశారు. పహల్గామ్ అటాక్ పట్ల దేశ ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, ఆపరేషన్ సిందూర్ కాదు.. ఆపరేషన్ తందూర్ కోసం ప్రజలు ఎదురుచూశారన్నారు. సిందూర్ సమయంలో చనిపోయిన వంద మంది ఉగ్రవాదుల్లో.. పహల్గామ్ ఉగ్రదాడి నిందితులు ఉన్నారా అని ఆయన పశ్నించారు.
శివసేన (యుబిటి) ఎంపి అరవింద్ సావంత్ మాట్లాడుతూ.. ఎన్నికలు జరగనున్న బీహార్‌కు వెళ్లారని, కానీ పహల్గామ్‌కు ఎందుకు వెళ్లలేదని ప్రధాని మోడీని ఆయన ప్రశ్నించారు. మణిపూర్‌కు కూడా ఇంతవరకు ఎందుకు వెళ్లలేదన్నారు. దీని పట్ల మీరేమైనా సిగ్గుపడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పట్ల అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని ఎందుకు ఎక్స్‌లో పోస్టు చేయడం లేదని ప్రధాని మోడీని అడిగారు. అమెరికా అధ్యక్షుడి ముందు మీరు నిలబడినప్పుడు మీ ఎత్తు 5 అడుగులకు తగ్గుతుందని, మీ ఛాతి 56 ఇంచుల నుంచి 36 ఇంచులకు కుంచించుకుపోతుందని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడంటే మీరెందుకు అంత భయపడుతున్నారని కల్యాణ్ బెనర్జి అడిగారు.స్వతంత్ర ఎంపి పప్పూయాదవ్ మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాదులను ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. నెల రోజులు దాటినా వాళ్లను పట్టుకోలేదంటే, అప్పుడు దేశం సురక్షితమైన చేతుల్లోలేదని అర్థంఅవుతోందన్నారు. కాంగ్రెస్ ఎంపి మనీశ్‌తివారీ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ఐక్యంగా ఉందని, మే 7 నుంచి 10వ తేదీ మధ్య జరి గిన ఆపరేషన్‌తో పాక్ ఉగ్రవాదాన్ని ఎంతవరకు కట్టడి చేయగలిగామని ఆయన ప్రశ్నించారు.
ఆపరేషన్ సిందూర్‌తో ఏం సాధించామో ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేకపోయిందని కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ మసూద్ అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు బతికున్నారా లేక హతమయ్యారా అని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఏంసాధించామో ప్రధానిమోడీ స్వయంగాపార్లమెంట్‌లో వెల్లడించాలన్నారు.

## గబ్బిలాల మాంసంతో చిల్లీచికెన్ అంటూ విక్రయాలు!

**చెన్నై,జూలై 28:** గబ్బిలాలతో తయారు చేసిన చిల్లీ చికెన్‌ను అమ్ముతున్న వైనం తమిళనాడులో వెలుగులోకి వచ్చింది. సేలంజిల్లా ఓమలూరు సమీపంలోని డానిష్‌పేట అటవీ ప్రాంతంలో గబ్బిలాలను చంపి ఆ తర్వాత వాటిని వండి చిల్లీ చికెన్‌గా అమ్ముతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పాపం ఇది నిజమైన చికెన్ అనుకుని అక్కడి స్థానిక ప్రజలు తింటున్నారని పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. డానిష్‌పేట పరిధిలోని తోప్పూర్ రామ స్వామి కొండ ప్రాంతంలో తరచుగా తుపాకీకాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని డానిష్‌పేట అటవీ కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో ఫారెస్ట్ రేంజర్ విమల్‌కుమార్ నేతృత్వంలోని అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో గస్తీనిర్వహించారు.. నిజంగానే అక్కడ తుపాకీ కాల్పుల శబ్దాలు వారికి వినిపించాయి. దీంతో ఏంటనివారు అటవీ ప్రాంతాన్ని మొత్తంగాలించారు. ఈ క్రమంలోనే వారికి కమల్,సెల్వం అనే ఇద్దరు వ్యక్తులు కన్పించారు.వెంటనే అటవీశాఖ అధికారులు వారి ఇద్దరిని పట్టుకుని తుపాకీ స్వాధీనంచేసుకున్నారు. ఆ తర్వాత వారిని విచారించగా వారు ఎలాంటి విషయాలు చెప్పలేదు. కాకపోతే వారిద్దరూ ఓహోటల్ నిర్వహిస్తూ చికెన్‌అమ్ముతున్నారు. దీంతో వారు గబ్బిలాల మాంసంతోనే చికెన్ చేస్తున్నట్లు అనుమానించిన స్థానికులు అదే నిజమై ఉంటుందని పోలీసులకు చెప్పారు. ఇలా పెద్ద ఎత్తున ఆరోపణలు రాగా పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేశారు. అయితే ప్రస్తుతం వారు నోరు మెదపడం లేదని, తాముఎలాంటి తప్పు చేయడంలేదనిమాత్రమే చెబుతున్నారని పోలీసులు వివరించారు. ఈకేసును మరింతలోతుగా దర్యాప్తుచేసినతర్వాతే అసలువిషయాలు తెలుస్తాయని అంటున్నారు.

# సంక్షిప్తంగా..

## గాజాలో పాక్షిక కాల్పుల విరమణ



**డెయిర్ అల్-బలా, జూలై 28:** గాజాలో ఆకలి మరణాలతో ఇజ్రాయెల్ కొంత దిగివచ్చింది. జనాభా అధికంగా ఉన్న మూడు ప్రాంతాల్లో రోజుకు 10 గంటలపాటు కాల్పుల విరమణను అమలు చేయాలని నిర్ణయించింది. దీనిని ఆదివారం నుంచే అమలులోకి తెచ్చింది. గాజా సిటీ, డెయిర్ అల్-బలా, ముమాసీ ప్రాంతాల్లో ఈ కాల్పుల విరమణను స్థానిక కాలమానం ప్రకారం.. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అమలు చేస్తున్నామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. దీని వల్ల ఆహారం అందడానికి మార్గం సుగమం అవుతుందని పేర్కొంది. ఇజ్రాయెల్ పాక్షిక కాల్పుల విరమణను ఐక్యరాజ్య సమితి ఆహార సంస్థ స్వాగతించింది. కానీ అవసరమైన వారందరికీ ఆహారం అందాలంటే విస్తృత కాల్పుల విరమణ అవసరమని అభిప్రాయపడింది. హమాస్‌కు వ్యతిరేకంగా గాజాలోని మిగిలిన ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయని ఇజ్రాయెల్ వెల్లడించింది.

## విమానం గాల్లో ఉండగా.. పేల్చేస్తానంటూ కేకలు

**స్కాట్లాండ్, జూలై 28:** విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడు అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. తన వద్ద బాంబు ఉందని, దాన్ని పేల్చేస్తాననంటూ కేకలు వేశాడు. యుకెలోని స్కాట్లాండ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లుటన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈజీజెట్ విమానం ఆదివారం సాయంత్రం గ్లాస్గోకు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటి తరువాత ప్రయాణికుడు తన సీట్లో నుంచి లేచి గట్టిగట్టిగా కేకలు వేయడం మొదలుపెట్టాడు. 'నా దగ్గర బాంబు ఉంది. ఈ విమానాన్ని పేల్చేస్తా. అమెరికాకు చావు.. ట్రంప్‌నకు మరణం' అంటూ అరిచాడు. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది అతడిని పట్టుకొని బంధించారు. సమీపంలోని ఎయిర్‌పోర్టులో విమానాన్ని అత్యవసరంగా దించేశారు. ల్యాండ్ అవగానే నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

## అత్యధిక కాలం యుపి సిఎంగా యోగి ఆదిత్యనాథ్

**లక్నో,జూలై 28:** ఉత్తరప్రదేశ్‌కు వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా యోగి ఆదిత్యనాథ్ గుర్తింపు పొందారు. యుపికి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఇప్పటివరకు మాజీ సిఎం గోవింద్ వల్లభ్ పంత్ ఉన్నారు. ఇప్పుడు ఆయన రికార్డును యోగి ఆదిత్యనాథ్ బద్దలుకొట్టారు. గోవింద్ వల్లభ్ పంత్ వరుసగా 8 సంవత్సరాల 127 రోజులు ముఖ్యమంత్రిగా కొనసాగి, రాష్ట్రానికి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. సోమవారంతో కలిపి యోగి ఆదిత్యనాథ్ వరుసగా 8 సంవత్సరాల 4 నెలల 10 రోజులు యూపి సిఎంగా కొనసాగారు. దాంతో గోవింద్ వల్లభ్ పంత్ రికార్డు బద్దలైంది. ఈ విషయాన్ని యుపి సిఎంవో వెల్లడించింది.

## అందుకే మీరు మరో 20 యేళ్లు ప్రతిపక్షంలోనే ఉంటారు!



**న్యూఢిల్లీ,జూలై 28:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో కోపంతో ఊగిపోయారు. విదే శాంగ మంత్రి ఎస్ జైశంకర్ లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్ గురించి వివరణాత్మక సమాచారం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు ఆయన ప్రసంగానికి అడ్డుతగులుతున్న తరుణంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేచి నిలబడి ప్రతిపక్ష సభ్యులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అమిత్ షా మాట్లాడుతూ ప్రతిపక్షాలు భారత విదేశాంగ మంత్రిని నమ్మకుండా వేరే దేశాన్ని నమ్ముతా యనే వాస్తవాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. వారి (కాంగ్రెస్) పార్టీలో విదేశీయుల ప్రాముఖ్యతను నేను అర్థం చేసుకోగలను కానీ వారి పార్టీకి సంబంధించిన అన్ని విషయాలను ఇక్కడ సభలో రుద్దకూడదు. అందుకే మీరు మరో 20 ఏళ్లు ప్రతిపక్షంలోనే ఉంటారు. వారు మాట్లాడుతున్నప్పుడు, మేం ఓపికగా వింటున్నాం. నిన్న ఎన్ని అబద్ధాలు చెప్పారో నేను మీకు చెబుతాను. అయినప్పటికీ, విషం అనుకుని మేం అబద్ధాలు తాగాము. ఇప్పుడు మనం నిజం వినలేకపోతున్నాం. ఇంత తీవ్రమైన అంశం చర్చిస్తున్నప్పుడు, విదేశాంగ మంత్రి మాట్లాడుతున్నప్పుడు, ప్రతిపక్షం అంతరాయం కలిగించడం సముచితమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పులను సరిచేస్తున్నాం

## గిరిజన సంక్షేమ సలహా మండలి సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దు తున్నామని పంచాయతీరాజ్, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమ వారం మాసబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీ వయ్య సంక్షేమ భవన్‌లో 7వ గిరిజన సంక్షేమ సలహా మండలి సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి సీతక్క మాట్లా దుతూ..గత ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, వంతెనలు అవసం మని అన్నారు. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో చాలామంది గర్భిణులు ప్రసవ వేదనను అనుభవించారన్నారు. ఏ ప్రభుత్వ మైనా నిధులను పక్కదారి పట్టించవద్దని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులను పక్కదారిపట్టిస్తే ఏజెన్సీ ఏరియాలు వెనకబాటుతో మగ్గిపోతాయని, అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారి అభివృద్ధికే ఖర్చు చేయాలన్నారు. గిరిజనుల్లో అనేక మందికి ఉండేందుకు ఇళ్లు కూడా లేవని అందుకే వారి ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్‌లో నిధులు పెంచే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లా దుతూ.. రాష్ట్రంలో గిరిజన సంక్షేమం విష యంలో లోపాలు ఉన్నాయని, ఐదేళ్ల తర్వాత గిరిజన సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం చెప్పి ఈ సమావేశాన్ని పూరిగా విస్మరిం చిందన్నారు. ఎస్టీల కష్టసుఖాలన చర్చించడానికి ఈ సమావేశాన్ని నిర్వహిసు_న్నామన్నారు. గిరిజనుల సంక్షేమానికి అందరూ తమ సలహాలు,సూచనలు ఇవ్వాలని కోరారు. అన్నింటిని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసు కెళతామన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వారికి మాత్రమే ఖర్చు చేయాలని, గిరిజన ప్రాంతాలో అభివృది కోసం చేసే పనులకు బిల్లులను సకాలంలో చెల్లిస్తామన్నారు. గత ప్రభుత్వ తప్పి దాలను ఎట్టి పరిస్థితుల్లో పునరావృతం కాని వ్వమని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రామ చంద్రూనాయక్, ఎంపీ గోడెం నగేష్, ఆదివాసి గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్,స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, గిరిజన శాఖ కార్యదర్శి శరత్, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 29, 30న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటన

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఈనెల 29, 30 తేదీల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ (మానుకోట) జిల్లాల్లో పర్యటించనున్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. జూలై 29వ తేది (మంగళ వారం) ఉదయం ఖమ్మం జిల్లా నుంచిపర్యటన ప్రారంభించనున్నారని తెలి పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, హామీల అమలులో తీవ్ర వైఫల్యం, పాలనలో కనపడుతున్న అసమర్థత వల్ల ప్రజల్లో తీవ్రనిరాశ, ఆగ్రహం పెరిగి పోయిం దని, ఈ పరిస్థితుల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ప్రజలకు భరోసా కల్పించేలా నేరుగా ముఖాముఖీగా భేటీ అయ్యి, వారి సమస్యలు, జీవన స్థితిగతులను అడిగి తెలుసుకోనున్నారని ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో పార్టీ కార్యకర్తల సమ్మేళనాలు, స్థానిక ప్రముఖులతో సమావేశాలు నిర్వహించనున్న ఆయన, బూత్ స్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపేలా దిశానిర్దేశం చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బిజెపి శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. ఈ సందర్భంగా బిజెపి రథసారథి ఎన్.రాంచందర్‌రావు పర్యటనను దిగ్విజయం చేయాలని కోరుతున్నామని ఆయన అన్నారు.

# తెలుగుజాతి కీర్తిపతాక బాలమురళీకృష్ణ

## 95వ జయంతి ఉత్సవంలో శ్లాఘించిన ఎంపి ఈటల

## బాలమురళి వ్యక్తి కాదు దివ్యశక్తి : డా. కె.వి.రమణాచారి



సంగీత విద్వాంసులను ఘనంగా సత్కరిస్తున్న ఎంపి ఈటల రాజేందర్, రమణాచారి, జస్టిస్ రాధారాణి, చెన్నారావు తదితరులు

హైదరాబాద్ (నాంపల్లి), జూలై 28, ప్రభాతవార్త : బాల మురళీకృష్ణ తెలుగుబిడ్డగా ఇక్కడ పుట్టి మన ఖ్యాతిని, భారతదేశ, తెలుగుజాతి కీర్తిని తన కీర్తనలు, పాటలు, సంగీత కచేరిల ద్వారా ఆకాశానికి ఎగురవేసి విశ్వవ్యాప్తం కావించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు, బహురంగాల్లో నిష్ణాతుడని పార్లమెంటు సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశవిదేశాల్లో 25వేలకుపైగా కచేరీలుచేసి భారతదేశం, తెలుగుజాతి వైశిష్ట్యాన్ని దశదిశలా చాటిచెప్పారని కొనియాడారు. అలనాటి సినిమాలు మానవ సమాజానికి గొప్ప సందేశాత్మకంగా, కుటుంబ బంధాలకు సందేశం అందిస్తూ కుటుంబ సమేతంగా కలసి చూసేవిధంగా ఉండేవని, నేడు ఆపరిస్థితేలేదని వాపోయారు. ఈనాటి పిల్లలకు సెల్‌ఫోన్లతో మరేవిటితో సంబంధం లేకుండా పోయిందన్నారు. సాంకేతికత పెరిగిందని సంతోషపడే సమయంలో ఎంతగా మానవ సంబంధాలు, జీవితంలో ఎంతో విధ్వంసంచేసి అసలు మనం మనుషులమేనా అనే ఆలోచన రేకెత్తిస్తుందని చెప్పారు. ఏదో కలియుగమంటే ఇట్లవుంటరి అనుకోలే... పరాకాష్టగా ఉందని ఆవేదన వ్యక్తపరిచారు. చివరిగా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ చరిత్ర లేకుండా వర్తమానంలేదు, వర్తమానం లేకుండా భవిష్యత్తులేదని, దాచేస్తే దాగని సత్యాలను వెలికితీసే పనిలో నిమగ్నం బతికించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం కళావేదికలో సంస్థ అధ్యక్షుడు ఎల్.వి.చెన్నారావు నిర్వహణలో, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతి మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్లమెంటు సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి ఈటల రాజేందర్ విశిష్ట అతిథి తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి తదితరులు పాల్గొని ప్రఖ్యాత సంగీత గురువులు కళారత్న డి.వి.మోహనకృష్ణ, మైథిలి కిడాంబి, జి.తిరుపతిరావు, హైదరాబాద్ బ్రదర్స్ దరూరి రాఘవాచారి, హైదరాబాద్ సిస్టర్స్ హరిప్రియలను తదితరులను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో బాలమురళీకృష్ణ ఒక వ్యక్తికాదు దివ్యశకినఅన్నారు. ఆయన సంగీతఝరి అనంతం, అద్భుతం, అనితరసాధ్యమన్నారు. కళ భగవత్‌దత్తం... గాంధర్వ అంశముంటేతప్ప కళ అబ్బదు... బాలమురళీకృష్ణతోపాటు నేటి సంగీత విద్యాంసులంతా ఆ కళామతల్లి ముద్దుబిడ్డలేనని, బాలమురళీకృష్ణ శిష్యుడైన మోహనకృష్ణ అపర బాలమురళీకృష్ణ అంటూ ప్రశంసించారు. చివరిగా బాలమురళీకృష్ణతో తనకున్న అనుబంధాన్ని సవివరపరిచారు. జస్టిస్ రాధారాణి బాలమురళీకృష్ణ ఆలపించిన కీర్తనలు, పాటలు, కొత్తరాగాల సృష్టి, చేసిన సంగీత కచేరీలు ఎన్నటికీ మరువలేనివన్నారు. సభకుముందు, సభానంతరం డి.వి.మోహనకృష్ణ, బృందంచే కచేరి; మైథిలీ కిడాంబి, మహతి వీణా విద్యాలయ శిష్యబృందంతో వీణావాయిద్య కచేరీ, జి.తిరుపతిరావు, బృందంచే నాదస్వర కచేరీలు ఆహుతులకు వీనులవిందుతో తన్మయుల్నిచేసి సంగీతలోకంలో విహరింపజేశాయి.

## కులగణనతో దేశానికి ఐకాన్‌గా తెలంగాణ

### రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: కులగణనతో దేశానికి తెలంగాణ ఐకాన్‌గా మారిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించే మంచి కార్యక్రమం పాదయాత్ర శ్రమదానం అని ఆయన తెలిపారు. .పాదయాత్ర, రాత్రులు బస, శ్రమదానం, ముఖ్య నేతల సమావేశాలు నిర్వహించాలని టిపిసిసి నిర్ణయం తీసుకుంది.ఈ యాత్రలో మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొంటారు..గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా,ఇచ్చిన హామీ లు అమలు చేస్తున్నామని అన్నారు. మీనాక్షి నటరాజన్ వెంట పాదయాత్రశ్రమదానంలో తొలి ఆరు రోజులు అవకాశం కల్పించడం నాకు గొప్ప అదృష్టమని ఆయన అన్నారు.



సమావేశంలో ఆర్టీసీ ఇడి మునిశేఖర్, బిఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు తదితరులు

## తెలంగాణ ఆర్టీసీ బస్సు సేవల్లో 'భారతీయ ప్రమాణాల'పై చర్చ

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్ల నిర్వహణ, నిబంధనలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రూపొందించిన భారతీయ ప్రమాణాలపై 'మానక్ మంథన్' పేరిట టీజీఎస్ఆర్టీసీ, బీఐఎస్ (హైదరాబాద్) శాఖలు సంయుక్తంగా చర్చ చేపట్టింది. సోమవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఇడి మునిశేఖర్, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరుతో పాటు బృందం పాల్గొన్నారు. ముఖ్యంగా ఫీడర్ సర్వీసులు, టెర్మినల్స్ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు, ఇంటెలిజెంట్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్స్, వినియోగం, ఇతర మాస్ ట్రాన్స్‌పోర్ట్ విధానాల సమీకరణ, ఈబస్సుల నిర్వహణ, స్థిరమైన పట్టణ రవాణాను ప్రోత్సహించే అంశాలు ప్రస్తావించారు. ఇక ఈబస్సుల నిర్వహణకు ప్రత్యేక ప్రమాణాలు డ్రైవర్లు, సిబ్బంది శిక్షణలను వివరించారు.ఈ క్రమంలో భారతీయ ప్రమాణాల అమలులో మెరుగు, లోపాలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు పలు సలహా,సూచనలు చేశారు. మెంబర్ సెక్రటరీ శివం సోని, ఎస్పీజ అభిసాయి, టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రూ.1,200 కోట్ల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను తక్షణమే విడుదల చేయాలి

### మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎంజిఎన్ఆర్ ఈజిఎస్(మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్) నిధులు రూ, 1200 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా నెలరోజుల నుంచి ఆపిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాం డ్ చేశారు. సోమవారం ఆయన ఈ మేరకు రాష్ట్ర ఉపాధిహామీ జాయింట్ కమిషనర్ ఎం. శేషు కుమార్,రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన నిధులను నెల రోజుల క్రితమే విడుదల చేసిందని,వీటిని రెండు, మూడు రోజుల్లో గ్రామ పంచాయతీలకు జమ చేసేలా చూడాలన్నారు. అంతే కాకుండా సోమవారం జరగనున్న క్యాబినెట్ మీటింగ్‌లో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల అంశాన్ని కూడా చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 21 నెలలు అవుతున్నా, సర్పంచులు పదవి కాలం అయిపోయి 19 నెలలు అవుతున్నా పెండింగ్ బిల్లులు మాత్రం అంతే ఉన్నాయనన్నారు.స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించే ముందు పెండింగ్ బిల్లులు చెల్లించి,సర్పంచ్‌ల ఆత్మహత్యలు నివారించాలన్నారు. వెంటనే తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి న్యాయం చేయాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# పాలిసెట్ ఫైనల్ ఫేజ్‌లో 18,267 సీట్ల కేటాయింపు

## 115 కాలేజీల్లో 62 శాతం కేటాయింపు..

## 30లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజి నీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2025 ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు సోమవారం చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 18,267 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకట నలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 29 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి.. 30లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచిం చారు. అయితే ఫైనల్ ఫేజ్‌లో మొదటి విడతలో కంటే తక్కువ సీట్ల కేటాయింపు చేశారు. మొదటి విడతలో 18,984 సీట్ల కేటాయింపు చేయగా.. ఫైనల్ ఫేజ్‌లో 18,267 సీట్లను కేటాయించారు. మొదటి విడత కంటే 717 సీట్ల తక్కువ కేటాయింపు చేశారు. మొత్తం సీట్లలో కేవలం 62 శాతం సీట్లు మాత్రమే కేటాయిం చారు. ఈ నెల 23 నుంచి ఫైనల్ ఫేజ్ కౌన్సె లింగ్‌ను చేపట్టగా.. 23న స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

ఈ నెల 24న సర్టిఫికెట్ వెరిఫి కేషన్‌ను నిర్వహించగా.. 24, 25 తేదిల్లో వెబ్ ఆప్షన్లకి అవకాశమిచ్చారు. సోమవారం సీట్ల కేటాయింపు చేశారు. పాలిసెట్-2025 కౌన్సెలింగ్ ఫైనల్ ఫేజ్‌లో 18,267 మందికి సీట్ల కేటా యింపు చేశారు. పాలీ సెట్-2025లో 80,949 మంది అర్హత సాధించగా వారిలో మొదటి విడతలో 20,811 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు.. ఫైనల్ ఫేజ్‌లో 9828 ఆప్షన్లు ఇచ్చారు. 18,267 మంది (62శాతం)కి సీట్లను కేటాయించగా మరో 11,182 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 115 ప్రభుత్వ, ప్రైవేట్ డిప్లమా కాలేజీల్లో 29,449 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం సీట్లలో మొదటి విడతలో 62 శాతం సీట్లు కేటాయించారు.

59 ప్రభుత్వ కాలేజీల్లో 14,209 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 11,455 సీట్లను (82శాతం) కేటాయిం చారు. 56 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 15,240 సీట్లు అందు బాటులో ఉంటే .. వాటిలో 7188 సీట్లను(47.1 శాతం) కేటాయిం చారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 728 సీట్లను కేటాయించారు. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా సీటు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వడానికి ఈ నెల 30వరకు అవకాశం కల్పించారు.

## రాష్ట్రంలో వందేళ్ల విధ్వంసం పదేళ్లకే!

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: బిఆర్ఎస్ పదేళ్లలో చేయని అరాచకాలు లేవు, అనేకమంది జీవితాలతో ఆడుకున్నారు. వందేళ్ల విధ్వంసాన్ని కేవలం పదేళ్లలోనే సృష్టించారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపిం చారు. సోమవారం సిఎల్‌పిలో మాట్లాడుతూ బిఆర్ఎస్‌తోనే బిసిలకు న్యా యం జరుగుతుందని కెసిఆర్ బొంకుతున్నారని విమర్శించారు. 10 యేళ్ల పాటు అధికారంలో ఉన్న కెసిఆర్ ఏనాడైనా బిసిల గురించి మాట్లాడాడా చేపలు, గొర్రెల గురించి తప్ప బిసి రిజర్వేషన్ల గురించి నోరువిప్పాడా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కెటిఆర్ తట్టుకోలేకపోతున్నాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి వెంట బిసిలు నడుస్తారన్న భయంతో కెటిఆర్ నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నాడని విమర్శించారు. బిసి ల గురించి అంత చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం పైన ఎందుకు పోరాటం చేయడం లేదు?కేంద్రాన్ని నిలదీయడానికి మాతో కలిసి ఎందుకు రావడం లేదు? అని నిలదీశారు. సంక్షేమ హాస్టళ్లపైన బిఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు, కెటిఆర్ ముసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.డైట్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని తెలిపారు.

## బిసిల సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: ప్రపంచ చరిత్రలో సాంస్కృతిక ఉద్యమం లేకుండా ఏఉద్యమం విజయవంతం కాలేదని, నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి నేటి తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమం వరకు కవులు కళాకారులు రచయితలు సాంస్కృతిక సేనగా ఏర్పడి ఉద్యమిస్తేనే ఉద్యమాలు విజయం సాధించాయని, ఇప్పుడు తెలంగాణలో జరిగే బీసీల రాజకీయ పోరాటానికి సాంస్కృతిక ఉద్యమం తోడు అయితే ఇక వచ్చేది బీసీల రాజ్యమేనని ఇది ఎవరు ఆపలేరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో "బీసీ కళాకారుల ఆత్మీయ కలయిక "పేరుతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు, ఈ ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కవులు కళాకారులు తరలివచ్చి ..బిసి కల్చరల్ ఫోరం.. వేదికను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్, మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవులు పాల్గొన్నారు. సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలోని బిసి కళాకారులు కవులు సామాజిక దోపిడీ అసమాన తలపై, అలాగే ప్రాంతీయ వివక్ష పై తమ కలం ద్వారా, గలం ద్వారా పోరాడారని దీనితో తెలంగాణలో సామాజిక రాజకీయ చైతన్యంతో పాటు ప్రత్యేక రాష్ట్ర సాధన కూడా జరిగిందని, ఇప్పుడు తెలంగాణలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై, అలాగే బీసీలకు రాజకీయ అధికారంకి కవులు కళాకారులు తమ కళాలను గలాలను ఓటు ఓటు చైతన్యంతో బీసీలను రాజకీయ చైతన్యంగా మార్చి రేపటి బీసీల రాజకీయ అధికారానికి బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్ కుమార్ మాట్లాడుతూ బీసీ కళాకారులు ఏకం కావడం చాలా అభినందనీ య మని, దేశ వ్యాప్తంగా కూడా బీసీల వాణి బలంగా వినపడుతున్న ఈ క్రమంలో దీనికి తోడు బీసీ కళాకారులు ఒక్కటే తమ రచనల ద్వారా పాటల ద్వారా ధూంధాంల ద్వారా బీసీల రాజకీయ చైత న్యాన్ని రగిలించాలని పిలుపునిచ్చారు.

## గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలి

### మాజీ ఎంపి సీతారాంనాయక్

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన తెగల సంఖ్య 34 కాగా, అందులో 32 తెగలు తెలంగాణలో ఉన్నాయని, కెసిఆర్ ప్రభుత్వం చేసిన ఇంటింటి కుటుంబ సర్వేలో గిరిజనుల జనాభా 10శాతంగా గుర్తించబడిందని కానీ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల జనాభాను 11శాతంగా ప్రకటించడం ఒక ఆస్కార్ స్థాయి రాజకీయ డ్రామా అని మాజీ ఎంపి సీతారాం నాయక్ అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని గిరిజన తెగల జనాభాను రాజ్యాంగ ప్రాతిపదికన గుర్తించి, వారికి రావలసిన హక్కులు పూర్తిగా కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం మేము చెప్పే అంశాలపై స్పందిస్తుందన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలన్న మా డిమాండ్‌పై కేంద్రం సానుకూలంగా స్పందిం చిందని, తాజాగా రాజకీయ కుట్రల్లో భాగంగా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న దుష్ప్రచారం ప్రారంభమైందన్నారు.



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాబిషేకం నిర్వహిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు

## బిసిల సంక్షేమానికి ఆరాటపడుతున్న రాహుల్‌గాంధీ అభినవ పూలే

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: బిసిల సంక్షేమం కోసం ఆరాటపడే రాహుల్ గాంధీ అభినవ పూలే అని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు పేర్కొన్నారు. జ్యోతిరావు బాపూలే అడుగుజాడల్లో నడుస్తున్న రాహుల్ గాంధీ 21 శతాబ్దపు అభినవ పూలే అని కొనియాడుతూ సోమవారం హైదరాబాద్ అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహం ప్రాంగణంలో రాహుల్ గాంధీ ఫ్లెక్సీకి 21 శతాబ్దపు అభినవ పూలే అంటూ 21 బిందెలతో పాలాభిషేకం చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన విధానంతో సీఎం రేవంత్ రెడ్డి 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కృషి చేశాడని, రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## కుటుంబ వివాదాలతో అత్తను హత్యచేసిన అల్లుడు, అతని తమ్ముడు

### మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు

చేర్యాల (మద్దూరు),జూలై 28,ప్రభాతవార్త: కుటుంబవివాదాల కారణంగా అత్తను అల్లుడు అతని తమ్ముడు కత్తులతో పొడిచి చంపిన దారుణమైన సం ఘటన మర్మాముల శివారులోని బంజరలో చోటుచేసుకుంది. స్థానికుల వివ రాల ప్రకారం.. మద్దూరు మండలం మర్మాముల గ్రామ శివారు బంజరకు చెందిన జంగిలి వజ్రమ్మ(55) కూతురు భవానిని ఇదే మండలం ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల మహేష్‌కు పది సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం చేయగా వారు బతుకుదెరువు కొరకు హైద్రాబాద్‌లో నివాసం ఉంటున్నారు.అయితే గత కొద్ది రోజులుగా కూతురు అల్లుడి మధ్య గొడవలు జరగుతుండటంతో సుమారు ఐదు రోజుల క్రితం మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో అల్లుడిపై ఫిర్యాదు చేసి పెద్ద మనుష్యుల సమక్షంలో మాట్లాడి రాజీ కుదిర్చుకుని ఆదివారం తన అత్తగారింటికి పంపింది. సోమవారం అల్లుడు జక్కుల మహేష్ తన తమ్ముడు హరీష్‌లు ఇద్దరు బంజరులోని తన అత్తగారింటికి వచ్చి అత్త వజ్రమ్మతో గొడవపడటంతో మాటా మాట పెరిగి విషయం పెద్దదిగా దారితీసింది.దీంతో ఆవేశానికి గురైన అల్లుడు అతని తమ్ముడు కత్తులతో దాడి చేసి హత్య చేసి మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పాలన నిజస్వరూపాలుగా అవినీతి, డ్రగ్స్, కల్తీపదార్థాలు

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త: తెలంగాణలో అవినీతి, డ్రగ్స్, కల్తీ పదార్థాలు కాంగ్రెస్ పాలన నిజ స్వరూపాలుగా మారాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న పాలనా తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతి వారం రాష్ట్రంలో ఏదో ఒక ఆశ్రమ పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రుల పాలవుతున్న దుస్థితి దారుణమన్నారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పదేపదే జరుగు తున్నా యని, విద్యాశాఖ తీవ్రనిరక్ష ్యం వహిస్తుంద న్నారు. అసలు రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నాడా? విద్యాశాఖ మంత్రిగా బాధ్యత వహించే వారు ఉన్నారా? అనే సందేహం ప్రజల్లో పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఔషధాల నుంచి నూనెల వరకు, ఆహార పదార్థాల నుంచి విద్యా కేంద్రాల వరకు, ప్రతి దాంట్లోనూ కల్తీ రాజ్యమేలుతుందని అన్నారు. విజిలెన్స్ శాఖ ఏం చేస్తోంది? దాని స్థితిగతులు ఎవరికీ అర్థం కావడం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఏ మాత్రం ఆసక్తి లేకుండా, ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్యపానమే ఆదాయ వనరుగా మలు చుకుంటుందని ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం బెల్ట్ షాపులను తొలగిస్తామని ప్రకటిం చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం శాసనసభలో బెల్ట్ షాపులే లేవని ఘనంగా ప్రకటించడం విడ్డూరమని మండిపడ్డారు. కానీ ప్రతి వైన్‌షాప్ చుట్టూ పదికి పది బెల్ట్ షాపులు ఉన్నాయన్నారు. గత ఆరు నెలల్లో ఒక వైన్ షాప్‌కు వచ్చిన ఆదాయం రెట్టింపైన విషయాన్ని ప్రస్తావిస్తూ, మద్యం అమ్మకాలే ఇందుకు కారణమని చెప్పారు. భూములు అమ్మడం, మద్యం అమ్మడం, ప్రజల జీవన విలువలను తాకట్టుపెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని తీవ్రంగా విమర్శిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, వాగ్దానాలు అమలు కావడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యం తీవ్రంగా ప్రమాదంలో పడుతుండగా, విద్యార్థుల ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మత్తు వ్యాపారానికి, కల్తీ పాలనకు ఒకే ఒక పరిష్కారం ఉందని, అందుకు బిజెపియే విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా ప్రజల ముందుకు వస్తుందని స్పష్టంగా తెలిపారు. తెలంగాణలో ఇటీవల ఫుడ్ పాయిజనింగ్ ఘటనల నేపథ్యంలో రాష్ట్రంలో పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో పాలనా వ్యవస్థ నియంత్రణ కోల్పోయిందని, విజిలెన్స్ శాఖ నామమాత్రంగా మాత్రమే మిగిలిందని మండిపడ్డారు. పరిపాలన మొత్తం అవినీతిమయం అయిందని విమర్శించారు. అధికార పార్టీ నేతలతో పిచ్చాపాటి మాట్లాడినా ఢిల్లీకి కూడా కట్టాలి కద బ్బా అనే మాటలు వినిపిస్తున్నాయంటే.. పరిపాలన ఎంత కలుషితమైందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

## రోస్టర్ పాయింట్లు సవరించే వరకు నోటిఫికేషన్లు నిలిపివేయాలి

### మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 28, ప్రభాతవార్త: ఎస్సీ కులాల రోస్టర్ పాయిం ట్లు సవరించేంతవరకు ఉద్యోగ నోటిఫికేషన్‌లు నిలిపివేయాలని మాల మహా నాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సూచనలను పాటించకుండా ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆయన ఆరోపిం చారు. గ్రూప్-3లో మాలలతో మరో 25 కులాలకు అన్యాయం చేసేలా ప్రభుత్వం రూపొందించిన రోస్టర్ విధానాన్ని సవరించి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్‌ల కేటాయింపులో మాలలకు జరుగు తున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళేందుకు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమానికి మాల మహానాడు జాతీయ కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా జి.చెన్నయ్య సోమ వారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసి మీడియాతో మాట్లాడుతూ మాల, మాల అనుబంధ కులాలకు 5 శాతం అవకాశాలు దక్కేలా రోస్టర్ పాయింట్‌లు సవరించేంతవరకు నోటిఫికేషన్‌లను విడుదల చేయరాదని డిమాండ్ చేశారు.



# రెండు వారాల్లో శాంతి ఒప్పందానికి రావాలి!

## పుతిన్‌కు ట్రంప్ ఫైనల్ వార్నింగ్

**వాషింగ్టన్, జూలై 28:** ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పరిపరి విధాల ప్రయత్నిస్తున్నారు. కానీ పుతిన్ పెడచెవినపెడుతూనే ఉన్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఉక్రెయిన్‌యుద్ధంపై పలుదఫాలుగా పుతిన్‌తో చర్చించినా ఫలితాలురాలేదు. ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం, భారత్ పాక్ యుద్ధాలను వద్దవద్దే ఆపానని చెప్పే ట్రంప్ తాజాగాథాయిలాండ్ కాంబోడియా మధ్యకూడా యుద్ధం ఆపానని ప్రకటించారు. కాని రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని మాత్రం ఆపలేకపోయారు. ఉక్రెయిన్ కాల్పుల విరమణకు ముందుకొస్తుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్ ముందుకు రావడంలేదు. దీనిపై ట్రంప్ తీవ్ర కోపంతో రగిలిపోతున్నారు. శాంతి ఒప్పందం, కాల్పుల విరమణకోసం గతంలో 50 రోజులు సమయం ఇచ్చిన ట్రంప్ ఆసమయాన్ని సోమవారం తగ్గించేశారు. 10-12 రోజుల్లో ఒప్పందానికి వచ్చి తీరాల్సిందేనని పుతిన్‌కు హెచ్చరికలు పంపించారు. సుమారు 4 ఏళ్లనుంచి ఉక్రెయిన్‌రష్యామధ్య యుద్ధం సాగుతోంది. ఇరుదేశాలు యుద్ధం కారణంగా ఎంతోనష్టపోయాయి. అయితే ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక సౌదీ అరేబియా వేదికగా రష్యాతో అమెరికా చర్చలుజరిపింది. కానీ ఫలితంచలేదు. దీనితో విసుగుచెందిన ట్రంప్ రష్యాను దెబ్బకొట్టేందుకు ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరాచేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా 100 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరించారు.

# హెచ్‌సిఎ అక్రమాలపై హైకోర్టులో విచారణ మూడు వారాలు వాయిదా

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాలపై సిబిఐ చేత విచారణ చేయించాలని సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం జరిగిన విచారణ మూడు వారాలకు వాయిదా పడింది. హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్ మో హన్ రావు, కోశాధికారి శ్రీనివాస్‌రావు, సిఇఒ సునీల్, కార్యదర్శి దేవరాజ్, వీరి సన్నిహితులు శ్రీచక్ర క్లబ్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి రాజేంద ర్ యాదవ్‌లను గోల్‌మాల్ వ్యవహారాల కేసులో సిఐడి అరెస్టు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్‌సిఎ అక్రమాలపై సిఐడి విచారణ సరిపోదని, సిబిఐచేత లోతుగా విచారించి ఏళ్ల తరబడి ఇందులో సాగిన అక్రమాలను వెలికితీసి, దోషులను కఠినంగా శిక్షించాలని సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే.

ఈ పిటిషన్ దాఖలైన రోజునే హెచ్‌సిఎ పర్యవేక్షకుడుగా విశ్రాంత జడ్జి జస్టిస్ నవీన్‌రావును హై కోర్టు నియమించింది. సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ నెల 19న హెచ్‌సిఎ నిర్వ హించిన వార్షిక సమావేశం చెల్లదని ప్రకటించాలని సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ నిర్వాహకులు హైకోర్టును కోరారు. దీనిపై విచారించిన హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.



# పత్తి రైతు పెండింగ్ బిల్లులు నెలలోగా చెల్లించండి

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** పత్తి రైతులకు సంబంధించి గద్వాల జిల్లా పెండింగ్‌లో ఉన్న బిల్లులను నెలలోగా చెల్లించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మాట్లాడుతూ గద్వాల జిల్లా రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను సాగు చేశారన్నారు. నెలల గడిచినా ఇప్పటి వరకు వారికి సంబంధిత కంపెనీలు చెల్లింపులు చేయలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్ని కంపెనీలు కలిపి సుమారు రూ.700 కోట్లు రైతులకు బకాయిలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని, వారికి ఎలాంటి అసౌకర్యం కలిగినా సహించేది లేదని తెలిపారు.పత్తి విత్తనాల ఉత్పత్తిలో గద్వాల జిల్లా దేశంలోనే అగ్ర స్థానంలో ఉండి తలమానికంగా నిలిచిందన్నారు. విత్తన ఉత్పత్తి చేసి కంపెనీలకు అందిస్తే అవి రైతులకు ఇప్పటి వరకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. తక్షణమే స్పందించి నెలరోజుల్లోగా ఉన్న బకాయిలను రైతులకు చెల్లించాలని సంబంధిత కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తన సంస్థ చెర్మన్ అన్వేష్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపితో పాటు, పలు సీడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాధారణ సగటుకంటే 7% ఎక్కువ వర్షపాతం

## వాతావరణ శాఖ అంచనా

**న్యూఢిల్లీ, జూలై 28:** దేశంలో రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి సాధారణం కంటే 7 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదు అయినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా వర్షాలు పడితే, మరికొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యిందని పేర్కొంది. రుతుపవనాలు మొదలైనప్పటి నుంచి దేశంలో 447.8 మి.మీ వర్షం కురిసిందని చెప్పింది. వాస్తవానికి మన దేశంలో సాధారణ వర్షపాతం 418.9 మి.మీ ఉంటుంది. రాజస్థాన్, లద్దాఖ్, నాగాలాండ్, మణిపూర్, సిక్కింలలో చాలా ఎక్కువగా వర్షాలు పడ్డాయి.సాధారణంగా రాజస్థాన్‌లో 220.4 మి.మీ వర్షపాతం ఉంటుంది. కాని ఈసారి 92 శాతం అధికంగా 384.7 మి.మీ మేర వర్షపాతం నమోదు అయ్యింది. సాధారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే లద్దాఖ్‌లో ఈసారి 10.7 మి.మీకి బదులుగా 30 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 181 శాతం ఎక్కువ ఇక్కడ వర్షాలు పడ్డాయి. నాగాలాండ్‌లో 514.5 మి.మీ, మణిపూర్‌లో 557.9 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణంగానూ ఇక్కడ ఇదే రేంజ్‌లో వర్షం పడుతూ ఉంటుంది. అయితే సిక్కింలో 598.4 మి.మీ వర్షం పడింది. ఇది సాధారణం కంటే 78 శాతం ఎక్కువ. అధిక వర్షపాతం (2059 శాతం ఎక్కువగా) వర్షపాతం నమోదైన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మధ్యప్రదేశ్, గుజరాత్, దాద్రా నగర్ హవేలీ, డమన్ డీవులు, ఝార్ఖండ్, అసోంలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో 418.4 మి.మీలకు బదులుగా 645.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 54 శాతం ఎక్కువ.గుజరాత్‌లో 463.2 మి.మీ (35 శాతం ఎక్కువ) వర్షాలుపడ్డాయి. కేంద్రపాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ, డమన్ డీవుల్లో 1153.8 మి.మీలకు బదులుగా 1466.1 మి.మీ వర్షం కురిసింది. ఇది సాధారణం కంటే 27 శాతం ఎక్కువ. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, గోవా, త్రిపుర, మిజోరం, బంగాల్, జమ్మూకశ్మీర్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి సహా అండమాన్, నికోబార్ దీవుల్లో సాధారణ వర్షపాతం నమోదు అయ్యింది. ఐఎండీ గణాంకాల ప్రకారం ఈ ప్రాంతాల్లో సగటున 19 శాతం లోపు వర్షపాతం నమోదైంది. అరుణాచల్‌ప్రదేశ్, అసోం, బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, లక్షద్వీప్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇది సాధారణం కంటే (20 నుంచి 59 శాతం మేర) తక్కువ వర్షపాతం నమోదైంది. సాధారణంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో 942.2 మి.మీ వర్షం పడుతూ ఉంటుంది. కానీ ఈసారి 521.8 మి.మీ మేర (45 శాతం తక్కువ) వర్షపాతం నమోదైంది.బీహార్‌లో ఈసారి 272 మి.మీ వర్షం పడింది. ఇది సాధారణ వర్షపాతం 474.2 మి.మీ కంటే 43 శాతం తక్కువ. జూన్-సెప్టెంబర్ రుతుపవనాల కాలంలో భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెం.మీ కంటే 106 శాతం ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని మే నెలలో ఐఎండీ అంచనా వేసింది. ఈ 50 ఏళ్లలో మన దేశంలో సగటు వర్షపాతం 96 శాతం 104 శాతం మధ్య నమోదు కావడాన్ని సాధారణంగా పరిగణిస్తుంది ఐఎండీ.లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఈశాన్య ప్రాంతాలు, బీహార్, ఝార్ఖండ్, బంగాల్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు మినహా, దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే



అవకాశం ఉంది. పంజాబ్, హరియాణా, కేరళ, తమిళనాడులోని కొన్ని (ఐసొలేటెడ్ ఏరియా) ప్రాంతాల్లో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. భారతదేశ వ్యవసాయ రంగానికి ఈ రుతుపవనాలు చాలా ముఖ్యమైనవి. ఇది మన దేశ జనాభాలో దాదాపు 42 శాతం మంది జీవనోపాధికి మద్దతు ఇస్తుంది. అలాగే జీడీపీకి 18.2 శాతం మేర దోహదం చేస్తుంది. తాగునీరు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలాశయాలను తిరిగి నింపడంలోనూ ఈ రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

# శ్రీశైలం నుంచి రెండులక్షల క్యూసెక్కులు విడుదల

## మూడు గేట్లు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల

## జూరాల లక్షా 34వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 12 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 28, ప్రభాతవార్త:** జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణ పూర్ జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. 12 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 1,34,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.400 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 27,775క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1,20,504క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెం పాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాలువకు 500 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,51,122 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

### 202 టిఎంసిలకు శ్రీశైలం డ్యాం

**మూడుగేట్ల ద్వారా సాగర్‌కు నీటి విడుదల**

శ్రీశైలం జలాశయానికి వరద పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 29,540 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 98,580 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 94,445 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 2,22,565 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.50 అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 202.0439 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66411 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు ఎక్కడ?

## బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ప్రకటించిన ఎస్సీ,ఎస్టీ ట్రైబల్ డిక్లరేషన్ ఇప్పటికీ అమలులోకి రాలేదని బిజెపి తెలంగాణ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 18 నెలలు పూర్తవుతున్నా, గిరిజనుల కోసం ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల ముందు ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ డిక్లరేషన్ ఎక్కడా అంటూ ప్రశ్నించారు. ఇది గిరిజనుల మీద జరిగిన తీరని మోసం అన్నారు. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాతినిధ్యం లేకుండా రాజకీయంగా అణచివేయాలని కుట్ర జరుగుతుందని, ఇది రాజ్యాంగ విరుద్ధం అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా కాగితాలకే పరిమితమైపోయాయని అన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన వేల కోట్లు ఎక్కడికి పోయాయో ప్రభుత్వమే చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే, అసైన్డ్ భూములకు, పోడు భూములకు పటాలు ఇస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు.

ఎస్టీ కార్పొరేషన్, బంజారా కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ వంటి సంస్థలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్లు కేటాయిస్తామని చెప్పి పైసా ఇవ్వలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఐటిడిఏలు పూర్తిగా విస్మరించబడ్డాయన్నారు. అమరాబాద్, ములుగు, కొత్తగూడెం, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో నిధులు రాకుండా, ఏ అభివృద్ధి కార్యక్రమాలూ నిర్వహించలేని పరిస్థితి నెలకొందని, సమ్మక్కసారక్క గ్రామీణ అభివృద్ధి పథకం పేరు పెట్టి, గ్రామపంచాయతీలకు రూ.25 లక్షలు ఇస్తామని చెప్పిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ములుగు జిల్లాలో గూడెంలకు రోడ్లు వేసిన దాఖలాలు లేవు. గిరిజనుల భూములు, హక్కులు, అభివృద్ధి, పథకాలను విస్మరించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టడానికే పరిమితమయ్యారు. అభివృద్ధి కేవలం ప్రచార పరంగా మాత్రమే ఉంది. గిరిజనుల హక్కులు, అభివృద్ధి కోసం ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

# దండకారణ్యంలో ప్రారంభమైన వారోత్సవాలు

## హైఅలర్ట్.. అడుగడుగునా నిఘా

## ఆర్.కొత్తగూడెంలో వెలసిన మావోయిస్టు అమరవీరుల పోస్టర్లు

**చర్ల, జులై 28, ప్రభాతవార్త:** మావోయిస్టు అమర వీరుల సంస్మరణ వారోత్స వాలు సోమవారం నుండి దండకారణ్యంలో ప్రారంభం అయ్యాయి. మావోయిస్టు పార్టీ నిర్మాతలైన చారు మజుందార్ కన్హైవ్ ఛటర్జీ స్మరిస్తూ ప్రతి ఏడాది సంస్మరణ వారోత్స వాలు నిర్వహించడం పరిపాటే.ఏడాది కాలంగా పార్టీలో జరిగిన లోటుపాట్లు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలు రిక్రూట్ మెంట్ తదితర విషయాలపై సుదీర్ఘ చర్చ జరుగుతుంది. గడిచిన ఏడాదిన్న కాలంలో దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ పై తీవ్ర నిర్బంధం ఉంది. 2026 మార్చి 31 కళ్లా మావోయిస్టు లేని భారత్ ను చూస్తారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించిన విధంగా ప్రస్తుతం మావోల ఏరివేత జరుగుతుంది. ఇప్పటికే మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు తోపాటు మావోయిస్టు అగ్రనేతలు వివిధ ఎన్ కౌంటర్లలో మృతిచెందిన సంఘటనల నేపథ్యంలో పార్టీ ఒకింత అలజడి నెలకొంది.వర్షకాలం మావోయిస్టు పార్టీ కి ఎటువంటి ధోకా ఉండదని భావించిన వారికి అనుకోని విధంగా ఆటం కాలు ఎదురౌ తున్నాయి. వర్షాకాలంలో కూడా కూబింగ్ జరగడంతో ఏం చెయ్యాలో అన్న అలోచన వారిలో నెలకొంది. ఎన్ని ఆటం కాలు ఎదురైనా వారోత్స వాలను విజయవంతం చేసేందుకు మావోలు సన్నద్ధం అయ్యారు. ఇప్పటికే వారోత్స వాల విజయ వంతానికి విశృత ప్రచారం నిర్వహించారు. దండకారణ్యంలో రహస్య ప్రాంతంలో వారోత్స వాలను విజయవంతం చెయ్యడానికి అన్నీ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. వారోత్స వాల సందర్భంగా అలజడులు జరిగే ఆస్కారం ఉందన్న నిఘా వర్గాల సమాచారం మేరకు మావోయిస్టు ప్రభావిత జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం ములుగు భూపాలపల్లి జిల్లాలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు.ఇప్పటికే అనుమానిత ప్రాంతాలలో గస్తీని ముమ్మరం చేసారు.ప్రధాన రహదారులపై వాహనాల తణికీలు చేపట్టారు. అటవి ప్రాంతాల గ్రామాల నుండి వచ్చే ఆదివాసీలను అరా తీస్తున్నారు.వారోత్స ల విజయవంతానికి మావోలు వాటిని సమర్ధవంతంగా తిప్పికొట్టేందుకు భద్రతా బలగాలు నిఘాను కట్టుదిట్టం చేసారు. ఏ క్షణంలో ఏం జరుగుతుంది అన్న అందోళన ఏజన్సీ గ్రామాలలో నెలకొంది.కాగా చర్ల మండలం దానవాయిపేటలో వారోత్స వాలను విజయవంతం చెయ్యాలని మావోయిస్టు వాల్ పోస్టర్లు బ్యానర్లు వెలిసాయి.ఈ నేపథ్యంలో పోలీసులు గస్తీని మరింత ముమ్మరం చేసారు.సిఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్.ఐ లు నర్సి రెడ్డి కేశవ్ లు రాత్రి సమయంలో వాహనాల తణికీలు చేపట్టారు.

# ఆదర్శనీయుడు జైపాల్‌రెడ్డి: మండలి చైర్మన్ గుత్తా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై28:** కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్ రెడ్డి నేటి తరానికి ఆదర్శనీయుడని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు మార్గ్ లోని జైపాల్ రెడ్డి ఘాట్ వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డి వివిధ హోదాల్లో పని చేసి ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, సేవాతత్వం కలిగిన నేత జైపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం పోరాడరన్నారు. అప్పటి నేతలకు ఆయనే మార్గ నిర్దేశకులుగా ఉన్నట్లు చెప్పారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పదానికి నిదర్శనం స్వర్గీయ జైపాల్ రెడ్డి అని ఆయన పేర్కొన్నారు.

# చెస్ గ్రాండ్‌మాస్టర్ దివ్యదేశ్‌ముఖ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 28:** అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడిఇ) మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో విజయం సాధించి గ్రాండ్‌మాస్టర్‌గా అరుదైన రికార్డును కైవసం చేసుకున్న దివ్య దేశ్‌ముఖ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఫిడే ప్రపంచ కప్ ఫైనల్‌లో దేశానికి చెందిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపితో తలపడి టైటిల్ సాధించగా, వీరిద్దరూ ఫైనల్స్‌కు చేరడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్‌లో సెమీ ఫైనల్‌లో ప్రపంచ దిగ్గజాలతో తలపడి ఫైనల్‌కు చేరిన వీరిద్దరు దేశ ప్రతిష్టను మరింత పెంచారని కొనియాదారు. అవకాశాలు లభిస్తే మహిళలు ఏదైనా సాధించగలరని దివ్య, హంపి ఉదాహరణ అని అన్నారు. ప్రపంచ స్థాయిలో ఇటువంటి విజయాలు మహిళలకు మార్గదర్శిగా నిలుస్తాయని తెలిపారు. ఇప్పటివరకు ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్‌లో భారత్‌కు చెందిన మహిళా క్రీడాకారిణులు ఎవరూ సెమీఫైనల్స్‌కు కూడా చేరుకోలేదు. అయితే, ఈసారి ఏకంగా ఇద్దరు భారత మహిళ ప్లేయర్లు ఫైనల్‌కు చేరుకోవడం గర్వకారణమని ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్తులో వారిద్దరూ మెరుగైన విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఖరీఫ్‌కు పుష్కలంగా విద్యుత్

## విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత వర్షా కాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు, గృహ వినియోగంలో కూడా భారీగా విద్యుత్ వినియోగం నమోదవుతోందని చెప్పారు. దీనికి తోడు, వ్యవసాయానికి విద్యుత్ అందుబాటులో ఉండటంతో లక్షలాది మోటర్లు నిరంతరాయంగా నడుస్తున్నాయని వెల్లడించారు. ఫలితంగా ఈ వానాకాలంలో కూడా భారీగా డిమాండ్ నమోదవుతోందని పేర్కొన్నారు. గతేడాది జులై 31 న 13541 మెగావాట్లుగా నమోదయిన గరిష్ట డిమాండ్, ఈ నెల 16న 14.05 శాతం పెరుగుదలతో 15443 మెగావాట్లుగా నమోదయ్యిందన్నారు. వరి నాట్లు జోరందుకోవడంతో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ మరింతగా పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీఎండీ స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా వుంటూ ఎలాంటి అవాంతరాలు రాకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఈ వర్షాల సీజన్ లో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వుంటూ తమ కార్యాలయాల్లో అందుబాటులో వుంటూ సరఫరా పర్యవేక్షి ంచాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్ లో ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ, డైరెక్టర్లు నర్సి ంహులు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# సంగీత దర్శకుడు ఇళయారాజా పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు!



**న్యూఢిల్లీ, జూలై 28:** ప్రముఖ సంగీతదర్శకుడు ఇళయరాజాకు సుప్రీం కోర్టులో నిరాశ ఎదురయింది. ఆయన సంగీతం అందించిన 500కిపైగా పాటలకు సంబంధించిన కాపీరైట్ వివాదాన్ని బాంబే హైకోర్టునుంచి మద్రాస్ హైకోర్టుకు బదలీచేయాలనికోరుతూ ఇళయరాజా సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి, న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్వీ అంజరియాలతోకూడినధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. కాపీరైట్స్‌కు సంబంధించి మద్రాస్ హైకోర్టులో ఎటువంటి పెండింగ్‌కేసులు లేవని సోని మ్యూజక్ ఎంటర్‌టైన్‌మెంట్ తరపు న్యాయవాది త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అలాంటి తరుణంలో ఈకేసును మద్రాసు హైకోర్టుకు బదిలీచేయమని కోరడంలోసరైన కారణం కనిపించడంలేదని వాదించారు. సోనీ తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం కేసును బదలిచేసేందుకు నిరాకరించింది. ఇళయరాజా మ్యూజిక్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్‌లిమిటెడ్‌సంస్థ తమకు చెందిన 536 పాటలను ఉపయోగించకుండా నిరోధించాలనికోరుతూ సోనీ సంస్థ 2022లో బాంబే హైకోర్టులో కేసు దాఖలుచేసింది. ఆ పాటలకు సంబంధించిన హక్కులను తాము ఓ రియింటల్ రికార్డ్స్ అండ్ ఇకో రికార్డింగ్స్‌నుంచి కొనుగోలుచేసామని సోనీ సంస్థ పిటిషన్‌లో వెల్లడించింది. అయితే ఓరియంటల్ రికార్డ్స్, ఇళయా రాజా మధ్య ఈ పాటలకు సంబంధించి వివాదం నడుస్తోంది. కాపీరైట్స్ చట్టం ప్రకారం తాను సమకూర్చిన స్వరాలపై తనకే హక్కులు ఉంటాయని ఇళయరాజా, ఎకోరికార్డింగ్స్‌కు వ్యతిరేకంగా 2014లో మద్రాస్ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై ఇళయరాజాకే అనుకూలంగా మద్రాస్ హైకోర్టు తీర్పు వచ్చింది.

# పంచాయతీ సిబ్బందికి ఫొటో కష్టాలు

## రూల్స్ మార్చాలని వేడుకోలు

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిధుల విడుదల కోసం రూఫ్ లెవెల్ ఫోటోలు తప్పనిసరి కావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రాణాలు పణంగా పెడుతున్నారు. కింద నుంచి తీసిన ఫోటోలు అప్‌లోడ్ కాకపోవడంతో.. భద్రతా పరికరాలు లేకుండానే ఇళ్లపైకి ఎక్కి, నిచ్చెనల సాయంతో ఫోటోలు తీస్తున్నారు. అది రిస్కుతో కూడుకున్నదని.. అధికారులు ఫోటో అప్‌లోడ్ విధానాల్లో మార్పులు, డ్రోన్ల వినియోగానికి అనుమతి ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింది ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం నాలుగు విడతల్లో చేస్తున్నారు. అయితే లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే క్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఊహించని సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయిన వివిధ దశలను ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉండగా.. ముఖ్యంగా రూఫ్ లెవెల్ (పైకప్పు స్థాయి) ఫోటో తప్పనిసరి కావడంతో సిబ్బంది ప్రాణాలను పణంగా పెడుతున్నారు.నిబంధనల ప్రకారం.. ఇంటి నిర్మాణం ఒక్కో దశ పూర్తయిన తర్వాత ఆ దశకు సంబంధించిన ఫోటోలను అప్‌లోడ్ చేస్తేనే లబ్ధిదారుల ఖాతాల్లో రూ. లక్ష చొప్పున నిధులు జమ అవుతాయి. అయితే, రూఫ్ లెవెల్ ఫోటో కింద నుండి తీస్తే అప్‌లోడ్ కావడం లేదని సిబ్బంది వాపోతున్నారు. దీంతో ఫోటోలు తీయడం కోసం భద్రతా పరికరాలు లేకుండానే పక్కనున్న పాత ఇళ్లపైకి ఎక్కడం, నిచ్చెన సాయంతో, లేదా ఆటోలపై ఎక్కి సాహసాలు చేయడం నిత్య దృశ్యాలుగా మారాయి.తాజాగా, ఒక గ్రామ పంచాయతీ సిబ్బంది భద్రతా పరికరాలు లేకుండానే నిర్మాణంలో ఉన్న ఇంటి పైకప్పు మీద నిలబడి ఫోన్ ద్వారా ఇంటి పై భాగాన్ని ఫోటో తీయడం చర్చనీయాంశంగా మారింది. ఫోటో క్యాప్చర్ అయితేనే లబ్ధిదారునికి డబ్బులు వస్తాయంటున్నారు. కానీ కింద నుండి ఫోటో తీస్తే అప్‌లోడ్ అవ్వడం లేదు. పైకెక్కకుండా మరొక మార్గం లేదు. మా భద్రత ఎవరిది? అంటూ పంచాయతీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణతో పనిచేసే సిబ్బంది తమ ప్రాణాలను తెగించి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరంగా మారింది.ఈ నేపథ్యంలో.. రూఫ్ లెవెల్ ఫోటో పద్ధతుల్లో మార్పులు చేయాలని, ఫోటో అప్‌లోడ్ ప్రక్రియలో మరింత ఫ్లెక్సిబిలిటీ ఇవ్వాలని స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులను కోరుతున్నారు. అవసరమైతే డ్రోన్ల వాడకానికి అవకాశం కల్పించాలని కూడా వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను బట్టి మార్గదర్శకాలను సవరించాలని, తద్వారా సిబ్బంది భద్రతకు భరోసా కల్పించాలని డిమాండ్ మొదలైంది. ఉన్నతాధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బంది ఆశిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఆర్థిక సహాయం

**ఇందిరమ్మ ఇళ్లకు రూ.2 లక్షలు లోన్**

రాష్ట్రంలోని నిరుపేదలెవరూ గూడు లేకుండా ఉండవద్దనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ పథకానికి శ్రీకారం చుటింది. ఇప్పటికే నియోజకవరానికి 3,500 చొప్పున తొలి విడతలో 4,16,500 ఇదిరమ్మ ఇళను మంజూరు చేశారు. ఈ పథకంలో ముందుగా పూరిగుడిసెలు, అద్దె ఇళ్లలో జీవనం సాగిసున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. అదేవిధంగా సొంత సలం ఉన్న వారికి తొలి దశలో ప్రాధాన్యం కల్పిసున్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా పనుల పురోగతిని అప్డేట్ చేస్తుండగా ఏఐ టెక్నాలజీతో అక్రమాలను గుర్తించి, చర్యలు తీసుకుంటున్నారు.కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దశల వారీగా రూ.5 లక్షలను సర్కార్ లబ్దిదారుల బ్యాంకులో ఖాతాల్లో జమ చేస్తోంది. పునాది వరకు నిర్మిస్తేనే తొలి విడత సాయంగా రూ.లక్ష జమ చేస్తున్నారు. కానీ, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోన్న కొందరు పథకానికి అర్హులైనా.. పునాదిని కూడా నిర్మించలేని స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం లబ్దిదారులకు తీపికబురు చెప్పింది. అలాంటి వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాల్లో ఇప్పటికే సభ్యులుగా ఉంటే వారికి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం అందించనున్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఎలాంటి అప్పులు లేని సభ్యులు బ్యాంక్ లింకేజ్,సిఐఎఫ్, శ్రీ నిధి ద్వారా రుణాన్ని పొందవచ్చు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు రుణాలు కూడా మంజూరు అయ్యాయి.

# తెర

## మనం చేసే తప్పుల్నే చూపిస్తున్నాం




మైథలాజికల్, సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌గా యముడు అనే చిత్రాన్ని జగన్నాథ పిక్చర్స్ పతాకంపై జగదీష్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు ధర్మో రక్షతి రక్షి తః అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఇది వరకే ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అన్నీ కూడా సినిమా మీద అంచనాల్ని పెంచేశాయి. తాజాగా యముడు ఆడియో లాంచ్ ఈవెంట్‌ను సోమ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మొదటి పాటను ప్రియాంక, మల్లిక లాంచ్ చేశారు. రెండో పాటను బెక్కెం వేణు గోపాల్ రిలీజ్ చేశారు.

మూడో పాటను కే మ్యూజిక్ సీఈవో ప్రియాంక, యముడు నాలుగో పాటను మల్లిక రిలీజ్ చేశారు. అనంతరం బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది వందల చిత్రాలు వస్తుంటాయి.

అందులో కొంత మందికి మాత్రమే సక్సెస్ వస్తుంది. చిన్న చిత్రాలు ఈ మధ్య వండర్లు క్రియేట్ చేస్తున్నాయి. చిన్న ప్రయత్నాలే పెద్ద విజయాల్ని సాధిస్తున్నాయి. అలా ఈ యముడు చిత్రం పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. జగదీష్ ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా మారి సినిమాను తీశారు. మొదటి చిత్రాన్నే ఇంత ప్రయోగాత్మకంగా తీయడం గొప్ప విషయం అని అన్నారు. జగదీష్ ఆమంచి మాట్లాడుతూ మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో పుట్టి సినిమా మీద మక్కువతో ఇండస్ట్రీలోకి వచ్చి ఈ రోజు యముడు సినిమాతో ఇక్కడి వరకు వచ్చాను. ప్రస్తుతం ఎక్కడ చూసినా కుట్రలు, హత్యలు, అక్రమ సంబంధాలకు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఆ పాయింట్‌లతోనే ఈ చిత్రాన్ని తీశాం. అందరినీ ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది అని అన్నారు. శ్రీ మల్లిక మాట్లాడుతూ మా యముడు సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని నమ్ముతున్నాను. చాలా డిఫరెంట్ కథతో ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. మా మూవీని అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరుతున్నాను అని అన్నారు. శ్రావణి శెట్టి మాట్లాడుతూ మన జీవితంలో జరిగే ఘటనల్నే, చేసే తప్పుల్నే ఇందులో చూపించబోతోన్నారు. ఆకాష్ మాట్లాడుతూ జగదీష్ ఈ చిత్రానికి మెయిన్ పిల్లర్ అన్నారు. భవానీ రాకేష్, స్క్రీన్ ప్లే రైటర్ శివ, కెమెరామెన్ విష్ణు మాట్లాడారు.

## శాంతను కాంతను చేసి..



మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ కొత్త ప్రాజెక్ట్ కాంత నుంచి అప్డేట్ వచ్చింది. సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా మూవీ టీజర్ విడుదల చేశారు. 1950 కాలం నాటి బ్యాక్ డ్రాప్ ఒక హీరో, డైరెక్టర్ మధ్య జరిగే ఘర్షణ ఇతివృత్తంగా సాగిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళ తెలుగు ద్విభాషా చిత్రంలో ప్రముఖ నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషిస్తుండగా, దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. వెర్సటైల్ యాక్టర్ చంద్రన్‌కు వెటరన్ డైరెక్టర్‌గా మారిని రైటర్ డైరెక్టర్‌కు కెరీర్ ఆరంభంలో ఇద్దరి మధ్య ఆత్మీయత ఉండేది. క్రమంగా పేరు, ప్రఖ్యాతి వచ్చేకొద్దీ చీలిపోయింది. డైరెక్టర్ తన మొదటి హర్రర్ చిత్రం శాంతను శక్తివంతమైన కథానాయిక చుట్టూ రూపొందిస్తారు. స్టార్ అయిన చంద్రన్ క్రమంగా ఆ ప్రాజెక్ట్‌ను తన చేతుల్లోకి తీసుకుంటాడు. అతను తన ఇమేజ్‌కు అనుగుణంగా స్క్రిప్ట్‌ను మార్చి.. అలాగే టైటిల్‌ను కూడా కాంతగా మార్చేస్తాడు. 1950ల మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ థ్రిల్లర్ ఎమోషనల్ ఇంటెన్సిటీతో కట్టిపడేసింది. సెట్స్, కాస్ట్యూమ్స్ అన్నీ అప్పటి కాలంను గుర్తు తెస్తాయి. డైరెక్టర్ సెల్వమణి సెల్వరాజ్ కథను అద్భుతంగా డిజైన్ చేశాడు. దుల్కర్ సల్మాన్ తన కమాండింగ్ స్క్రీన్ ప్రజెన్స్‌తో ఆకట్టుకున్నారు. సముద్రఖని ఒక వెటరన్ ఫిల్మ్ మేకర్‌గా ఒదిగిపోయారు. భాగ్యశ్రీ బోర్సే తనదైన ముద్ర వేసింది. డాని సాంచెజ్ లోపెజ్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, తమిళ్ ప్రభ అదనపు స్క్రీన్‌ప్లే అందించారు. లెవెలిన్ ఆంథోనీ గోన్సాల్వ్స్ ఎడిటింగ్ ఎంగేజింగ్‌గా వుంది. టీజర్ హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 12న రాబోతున్న కాంతపై అంచనాలను పెంచింది.

## ఓటీటీలో రికార్డ్..




స్టార్ హీరోలు, భారీ బడ్జెట్, హీరోకు ఎలివేషన్స్ ఉన్న సినిమాలు మాత్రమే రికార్డులు సృష్టిస్తాయనుకుంటే అనుకుంటే పొరపాటే! ఇది ఒక్కప్పటి ట్రెండ్.. ఇప్పుడు ప్రేక్షకులు సినిమా చూసే విధానం పూర్తిగా మారింది. పెద్ద సినిమా అయినా, చిన్న సినిమా అయినా కంటెంట్ ఉంటేనే ఆదరిస్తున్నారు! అలాంటి సినిమానే చౌర్య పాఠం. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం థియేటర్స్ పెద్దగా సందడి చేయకపోయినా.. ఓటీటీలో మాత్రం బ్రహ్మరథం పడుతున్నారు ప్రేక్షకులు. ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లోకి వచ్చిన ఈ సినిమా రికార్డు వ్యూస్ తో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా 200 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ మైలురాయిని దాటి సరికొత్త రికార్డును సృష్టించింది. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ, హిందీ అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కామెడీ, క్రైమ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని కథను అందించగా.. నిఖిల్ గొల్లమారి డైరెక్ట్ చేశారు. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లుగా నటించారు. ఇందులో కొత్త నటుడు హీరో ఇంద్ర రామ్ తన నటనతో ప్రేక్షకులను మెప్పించాడు. తన పాత్రలో ఒదిగిపోయి విమర్శకుల ప్రశంసలు పొందాడు.

## ఎంత అడిగితే అంత!



రామ్ చరణ్, జాన్వీ జంటగా వస్తున్న పెద్ది మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. జాన్వీ కపూర్ పాపులారిటీ రోజురోజుకూ పెరుగుతోంది. ఆమెకు పాన్‌ఇండియా స్థాయిలో మంచి గుర్తిపు ఉంది. జాన్వీని దక్షిణాది సినిమాలో తీసుకుంటే నార్త్ ఆడియెన్స్‌ను సైతం ఆకట్టుకోవచ్చని దక్షిణాది నిర్మాతలు భావిస్తున్నారు. అందుకే దర్శక నిర్మాతలు జాన్వీ ఎంత అడిగినా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలోనూ జాన్వీ కపూర్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 2.6 కోట్లకు పైగా మంది అనుసరిస్తున్నారు. ఉప్పెన మూవీతో జాతీయ అవార్డు అందుకున్న దర్శకుడు సనా బుచ్చిబాబు.. పెద్ది మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, జగపతిబాబు, మీర్జాపూర్ వెబ్ సిరీస్ ఫేమ్ దివ్యేందు తదితరులు ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని అప్ డేట్స్ రానున్నాయి.

## పౌర్ణమి మళ్లీ వస్తోంది



టాలీవుడ్‌లో రీ రిలీజ్‌ల ట్రెండ్ రోజు రోజుకి బాగా పెరిగిపోతోంది. స్టార్ హీరోల క్లాసిక్ సినిమాలు మళ్లీ థియేటర్లకు వస్తూ, అభిమానులకు నాస్టాల్జిక్ ఫీలింగ్ కలిగిస్తున్నాయి. అయితే తాజాగా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ఓల్డ్ క్లాసిక్ మూవీ పౌర్ణమి మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సెప్టెంబర్ 19, 2025న ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. 2006లో విడుదలైన ఈ సినిమా, అప్పట్లో భారీ అంచనాల మధ్య విడుదలై, మిక్స్‌డ్ టాక్ దక్కించుకుంది. అయినప్పటికీ, దాంట్లోని విజువల్స్, సంగీతం, కథనం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్రభాస్ ఎనర్జిటిక్ డాన్సులు, రొమాంటిక్ పెర్ఫార్మెన్స్, ట్రెడిషనల్ కాన్సెప్ట్, మాస్ క్లాస్ ఎలెమెంట్స్ ఇవన్నీ సినిమాకు హైలైట్స్‌గా నిలిచాయి. డాన్స్ మాస్టర్ ప్రభుదేవా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, దేవి శ్రీ ప్రసాద్ సంగీతం, చంద్రబోస్ లిరిక్స్‌తో ప్రేక్షకులను అలరించింది. పూజా (త్రిష) శివశంకర్ (ప్రభాస్) మధ్య సాగిన కథలో మన సంప్రదాయ నృత్యానికి, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన సినిమా ఇది.

## నరసింహావతారానికి బ్రహ్మరథం



కేజీఎఫ్, కాంతారా, సలార్ వంటి భారీ హిట్. చిత్రాలను నిర్మించిన హోంబలే సంస్థ, క్లీమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి తెరకెక్కించిన యానిమేషన్ చిత్రం మహావతార్ నరసింహ. మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన తొలి చిత్రం. శుక్రవారం పలు భాషల్లో విడుదలైంది. యానిమేటెడ్ విజువల్స్‌తో ఎంతో గ్రాండ్‌గా తెరకెక్కించారు. అందరికీ తెలిసిన కథే అయినప్పటికీ.. భారతీయ సంస్కృతికి అద్దం పట్టే పురాణ గాథలను సరికొత్త సాంకేతిక సహాయంతో తెర పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. యానిమేషన్ మూవీ కావడంతో పాత్రలతోనూ, ఆ భావోద్వేగాల తోనూ మరింత కనెక్ట్ అయ్యేలా దృష్టి సారించారు. అయితే ఇప్పుడీ చిత్రం విడుదలైన అన్ని భాషల్లో, అన్ని ప్రాంతాల్లో పెను సంచలనమే సృష్టిస్తోంది. ఎలాంటి హంగులు, ఆర్భాటం లేకుండా సైలెంట్‌గా హరిహరవీరమల్లు వంటి భారీ చిత్రానికి పోటీగా థియేటర్లకు వచ్చిన ఈ చిత్రం కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. మొదటి రెండు రోజులు ఎలాంటి హంగామా, చప్పుడు లేకుండా ఉన్న ఈ సినిమాకు మూడో రోజు నుంచి అన్ని భాషల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. చాలామంది చెప్పులు విడిచి థియేటర్లలో సినిమాలు చూస్తుండడం విశేషం. అంతేగాక మూవీ అనంతరం, మధ్యలో కొంత మంది విజిల్స్ వేస్తుండగా చాలామంది ఓ గ్రూపుగా చేరి థియేటర్లలోనే విష్ణు భజనలు, కీర్తనలు పాడుతూ మైమరిచి పోతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో పబ్లిక్ మౌత్ టాక్ అంతకంతకూ పెరుగుతూ వందల మంది సినిమా చూడడం కోసం క్యూ కడుతున్నారు.

బుక్ మై షోలో అయితే వీరమల్లును మించి టికెట్లు బుక్ అవుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా మూవీలో.. వారాహావతారం, భూదేవిని చూపించిన తీరు, ప్రహ్లాదుడిని ఏనుగులతో తొక్కి చంపించేందుకు చేసే ప్రయత్నాలు, హోలిక ఎపిసోడ్, నరసింహావతారంతో కూడిన పతాక సన్నివేశాలు ఈ సినిమాకు హైలెట్‌గా నిలిచాయని ఈ సినిమాను చూసిన ప్రేక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

ఆయా సన్నివేశాల్లో విజువల్ గ్రాండ్నెస్ ఆకట్టుకుంటుందని, సాంకేతిక విభాగాల్లో సంగీతం మరో ఎత్తయితే, శ్యామ్ సీఎస్ నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రాణం పోసిందని వారంటున్నారు. అశ్విన్ కుమార్ స్క్రీన్ ప్లే రచన, దర్శకత్వం మెప్పించేలా ఉందని, తెలిసిన కథే అయినా చాలా ఆసక్తికరంగా చెప్పారని ప్రేక్షకులు తమ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు, కామెంట్లు చేస్తున్నారు. నిర్మాణంగా ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు చిన్నారులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళే చిత్రంగా రూపొందించారని ఇది కుటుంబాలు కుటుంబాలు కలిసి చూడాల్సిన సినిమా అని, ప్రధానంగా పిల్లలకు ఈ మహావతార్ నరసింహ సినిమా ఎంతో నేర్పిస్తుందని అంటున్నారు.

## వెండి తెరపై దిగజారుతున్న తెలుగుతనం

ఒకప్పుడు తెలుగు సినిమా భాషాభివృద్ధికి తోడ్పడింది, కానీ ఇప్పుడు పాన్ ఇండియా మోజులో పడి తెలుగు టైటిల్స్‌ను నిరక్ష్యం చేస్తున్నారు. తెలుగులో విడుదల చేసే డబ్బింగ్ సినిమాలకు వాటి మాతృక పేర్లనే పెడుతుండటం విమర్శలకు దారితీస్తోంది. ఈ ధోరణి తెలుగు భాషను అవమానించడమేనని, మన మాతృభాషను అగౌరవపరచడమేనని భాషాభిమానులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి నుంచైనా డబ్బింగ్ చిత్రాలకు తెలుగు పేర్లు పెట్టాలని కోరుకుంటున్నారు. సూర్య నటిస్తున్న కొత్త సినిమాకి తెలుగులో కరుప్పు అనే టైటిల్ ఫిక్స్ చేయడంతో మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. తెలుగు భాష తియ్యదనం తెలుగు జాతి గొప్పతనం.. తెలుసుకున్నవాళ్లకి తెలుగే ఒక మూలధనం.. తల్లిదండ్రి నేర్పినట్టి మాతృభాషరా.. తెలుగు మరచిపోతే వాళ్లని నువు మరచినట్టురా.. ఇది మరువబోకురా అంటూ మన మాతృభాష గురించి మనం గొప్పగా పాడుకుంటాం. నిజానికి తెలుగు భాషాభివృద్ధిలో ఖితెలుగు సినిమా గణనీయమైన పాత్ర పోషించింది. ఒకప్పుడు తెలుగు సినిమాలు కేవలం వినోదాన్ని మాత్రమే కాదు.. తెలుగు సంస్కృతిని, సాహిత్యాన్ని, భాషా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. కానీ ఆధునిక పోక డల వెనుక పరుగులు తీయడం ప్రారంభించిన తర్వాత, తెలుగు సినిమాల్లో తెలుగు భాషను నిరక్ష్యం చేస్తూ వచ్చారు. తెలుగు సినిమాలకు కనీసం తెలుగు పేర్లు పెట్ట డం లేదు. మరీ విడ్డూరంగా ఈ మధ్య కాలంలో డబ్బింగ్ చిత్రాలను ఒరిజినల్ వెర్షన్ టైటిల్స్ తోనే తెలుగులో రిలీజ్ చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. తెలుగు సినిమా ప్రారంభం నుంచీ భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసింది. పద్య నాటకాలు, సాంఘిక చిత్రాలు, జానపద కథలు - ఇలా ఏది వచ్చినా తెలుగుదనం ఉట్టిపడేది. తెలుగు సినిమా కేవలం వినోదాన్ని అందించడమే కాకుండా, ఒక విద్యా సాధనంగా, తెలుగు భాషాభివృద్ధికి ఒక వాహకంగా నిలిచింది. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల ద్వారా పద్యాలు, సామెతలు, జాతీయాలు ప్రజల్లోకి వెళ్ళాయి. సినీ గేయ రచయితలు అందించిన అనేక పాటలు తెలుగు సాహిత్యానికి కొత్త సొబ గులు అద్దాయి. ఇక అలనాటి తెలుగు సినిమా టైటిల్లు అచ్చమైన తెలుగు పదాలతో, భాషా సౌందర్యాన్ని ప్రతిబింబించేలా ఉండేవి. అద్భుతమైన కథాంశాలతోనే కాకుండా, వాటి టైటిల్స్‌తోనూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాయి. కాలం మారుతున్న కొద్దీ, సినిమా ట్రెండ్స్ కూడా మారాయి. ఒకప్పుడు ఆయా హీరోలను బట్టి, కథకు సరిపోయే అచ్చ తెలుగు టైటిల్స్ పెట్టడానికి ప్రాధాన్యత ఇచ్చిన ఫిలిం మేకర్స్.. ఇప్పుడు నేటి తరాన్ని ఆకర్షించడం కోసం వింత వింత పేర్లను పెడుతున్నారు. తెలుగు ఇంగ్లీష్ మిక్స్ చేసిన టింగ్లీష్ పదాలు.. తెలుగుహిందీ పదాల కలయికతో.. అర్థం పర్థం లేని ఇతర భాషా పదాలతో టైటిల్స్ పెట్టడం మొదలుపెట్టారు. ఇది కేవలం స్ట్రెయిట్ తెలుగు చిత్రాల విషయంలోనే కాదు, ఇతర భాషల నుంచి తెలుగులోకి అనువాదం చేయబడే డబ్బింగ్ సినిమాలలోనూ ఈ పోకడ విపరీతంగా పెరిగిపోయింది.

## రాక్షసులందరికీ రాజుగా...



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ లేటెస్ట్ చిత్రం కింగ్‌డమ్. ఈ నెల 31న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలవడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ కూడా ఈ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేశాయి. ఇక తాజాగా ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమా రన్‌టైమ్ 2 గంటల 40 నిమిషాలుగా లాక్ అయింది. అయితే, ఈ సినిమాలోని కొన్ని అభ్యంతరకర సీన్స్, డైలాగులు తొలగించాలని సెన్సార్ బోర్డు ఆదేశించడంతో 2 నిమిషాల 31 సెకన్ల సన్నివేశాలను రీప్లేస్ చేశారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పవర్ ప్యాక్డ్ యాక్షన్‌తో ఇరగదీశాడని.. ఆయన పర్ఫార్మెన్స్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సత్యదేవ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు. విజయ్ ఈ సినిమాలో రాయలసీమ యాసలో మాట్లాడటం సినిమాకే హైలైట్‌గా మారింది. రాక్షసులందరికీ రాజుగా అన్న డైలాగ్ ఇప్పటికే వైరల్ అవుతుండగా.. ఈ డైలాగ్‌కి ఫుల్ విజిల్ ఫెస్ట్ అని థియేటర్స్ తగలబడతాయని అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, డైలాగ్స్, మ్యూజిక్ అన్నీ ఫ్యాన్స్‌కు గూస్బంప్స్ తెప్పించాయి. ట్రైలర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. అనిరుధ్ మ్యూజిక్ కిల్లర్.. ట్రైలర్ సినిమా రేంజ్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లిందని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఇప్పటివరకు ఫీల్‌గుడ్, ఎమోషనల్ సినిమాలు తీసి అపజయం ఎరుగని డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి టేకింగ్ అదిరిపోయిందని, అతని నుంచి ఈ తరహా సినిమా ఊహించలేదని, సితార ఎంటర్ టైన్ మెంట్స్ పెట్టిన ప్రతీ రూపాయి కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి క్రిటిక్, ట్రేడ్ ఎనలిస్ట్ తరన్ ఆదర్శ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బాలీవుడ్‌లో టైటిల్ గురించి తెలిపారు.

## కబడ్డీ ఆటగాడి సాహసం



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా అర్జున్ చక్రవర్తి. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హను రాఘవపూడి సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. ఓ కబడ్డీ ఆటగాడి నిజజీవితాన్ని ఆధారంగా తీసుకొని రూపొందిన ఈ మూవీ టీజర్ ప్రేక్షకులని కట్టిపడేసింది. సినిమాని బిగ్ స్క్రీన్‌పై చూడాలనే క్యురియాసిటీని టీజర్ మరింతగా పెంచింది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ.. ఒక తల్లి బిడ్డకు జన్మనివ్వడానికి తొమ్మిది నెలలు మోస్తుంది. నేను కూడా ఈ సినిమాని మీకు చూపించడానికి తొమ్మిదేళ్లుగా మోశాను. నేను 12 ఏళ్ల పిల్లాడిగా ఉన్నప్పుడు ఒక పర్సన్‌ని కలిసాను. ఆ పర్సన్ పేరు అర్జున్ చక్రవర్తి. ఆయన దగ్గర నేను కబడ్డీ ట్రైనింగ్ కోసం వెళ్ళినప్పుడు ఆయన ఒక కథ చెప్పారు. అది నా మనసులో అలాగా నాటుపోయింది. ఆ కథని ఎలాగైనా ప్రపంచానికి చెప్పాలి భావించను. అలా ఈ కథ నేను డైరెక్టర్ కావడానికి డ్రైవ్ చేసింది. ఈ సినిమాని 120 లొకేషన్స్‌లో షూట్ చేశాం. హీరో విజయ్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. మైనస్ డిగ్రీల్లో షూట్ చేసాం. డిఓపి జగదీష్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేసాడు. మేము అనుకున్నది తీయడానికి ఎంతకైనా సాహసించారు అన్నారు. హీరో విజయ రామరాజు మాట్లాడుతూ.. నేను ఏడాదిన్నర పాటు ప్రో కబడ్డీ టీమ్స్‌తో ట్రావెల్ అయ్యి రియల్‌గా గేమ్ నేర్చుకుని ఈ సినిమా చేశాను. బాడీ ట్రాన్స్ఫర్మేషన్ కోసం సిక్స్ ప్యాక్ చేయాల్సి వచ్చింది అన్నారు. ప్రొడ్యూసర్ శ్రీని గుబ్బల మాట్లాడుతూ డైరెక్టర్ ఈ సినిమా కథ చెప్పినప్పుడు గానీ తీస్తున్నప్పుడు గానీ ఎక్కడ కూడా డ్రాప్ అయినట్లు అనిపించలేదు. హీరోయిన్ సిజ్జా రోజ్‌ను అందరూ కూడా మీ ఇంట్లో ఒక అమ్మాయిగానే భావిస్తారు అన్నారు. హీరోయిన్ సిజ్జా రోజ్ మాట్లాడుతూ... ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. చాలా ప్యాషన్‌తో పనిచేశాం అన్నారు. యాక్టర్ దుర్గేష్, మ్యూజిక్ డైరెక్టర్ విగ్నేష్ భాస్కరన్, డిఓపి జగదీష్ మాట్లాడారు.

## మాతృభూమి రక్షణ కోసం

వార్ 2 ట్రైలర్‌లో పాన్ ఇండియన్ స్టార్స్ హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఫెరోషియస్ లుక్‌లో అదరగొట్టారు. నువ్వా నేనా అన్నట్లుగా పోటీపడుతూ హృతిక్, ఎన్టీఆర్ మధ్య సాగే యాక్షన్ సీక్వెన్స్ ఈ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. టాప్ నాచ్ విజువల్స్, బీజీఎమ్‌తో పాటు ఐ ఫీస్ట్‌గా సాగుతూ ఆడియెన్స్‌కు గూస్ బంప్స్‌ను కలిగించింది. ట్రైలర్ ఈ సినిమాపై ఉన్న అంచనాల్ని రెట్టింపు చేసింది. ఇద్దరు మెగాస్టార్స్ విశ్వరూపాన్ని సిల్వర్ స్క్రీన్‌పై చూసేందుకు ఫ్యాన్స్ ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న వార్ 2 చిత్రాన్ని అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. నాలుగు వందల కోట్ల బడ్జెట్‌తో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ యశ్ రాజ్ పిల్మ్స్ పతాకంపై ఆదిత్య చోప్రా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వార్ 2 సినిమాకు శ్రీధర్ రాఘవన్ కథను అందిస్తున్నారు.

వార్ 2 ట్రైలర్‌లో దేశ రక్షణే తమ ప్రథమ కర్తవ్యం అంటూ హృతిక్ రోషన్, ఎన్టీఆర్ చేసిన ప్రమాణం ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ ఛాలెంజ్‌తోనే సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ క్యారెక్టర్స్ ఎంత ఇంటెన్స్‌గా, పవర్‌ఫుల్‌గా ఉంటాయన్నది మేకర్స్ చూపించారు. ట్రైలర్‌లో సినిమా కథేమిటి, అసలు ఏజెంట్ ఎవరు అన్నది రివీల్ చేయకుండా ఆడియెన్స్‌లో సస్పెన్స్ క్రియేట్ చేశారు మేకర్స్. ట్రైలర్‌లో స్టోరీకి సంబంధించి ఎలాంటి హింట్ ఇవ్వకుడదనే ఐడియా ప్రొడ్యూసర్‌దేనని రైటర్ శ్రీధర్ రాఘవన్ అన్నారు. శ్రీధర్ రాఘవన్ మాట్లాడుతూ...మాతృభూమి రక్షణ కోసం డేంజరస్ కోవర్ట్ ఆపరేషన్‌లోకి ఇద్దరు ఏజెంట్స్ అడుగుపెడతారు. దేశం కోసం అవసరమైతే ప్రాణ త్యాగానికి వెనుకాడని వారి ధైర్యసాహసాలను, పోరాటాన్ని చాటిచెబుతూ స్పై యూనివర్స్ ప్రమాణం ఉంటుంది. ఈ ప్రమాణం సినిమా కథను, హీరోయిజాన్ని ఎలివేట్ చేస్తూ ఆడియెన్స్‌కు థియేటర్లలో హై ఫీల్ ఇస్తుంది. దేశం కోసం పోరాడే ఇద్దరు ఏజెంట్లు ఒకరితో మరొకరు ఎందుకు తలపడాల్సి వచ్చింది అన్నది సినివాలో క్యూరియాసిటీని కలిగిస్తుంది. అసలు ఈ ఇద్దరిలో నిజమైన ఏజెంట్ ఎవరు? వారిద్దరి మధ్య ఉన్న లింక్ ఏమిటన్నది థ్రిల్లింగ్‌ను పంచుతుంది అని శ్రీధర్ రాఘవన్ చెప్పారు. వార్ 2 మూవీ తెలుగు హిందీ, భాషల్లో వరల్డ్ వైడ్‌గా ఆగస్ట్ 14న రిలీజ్ కాబోతుంది. ఈ స్పై యాక్షన్ మూవీలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఐకానిక్ స్టార్స్ అయిన హృతిక్ రోషన్, ఎన్టీఆర్ 25 ఏళ్ల నట ప్రస్థానాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసేలా వార్ 2 ఉండబోతున్నట్లు మేకర్స్ పేర్కొన్నారు.



# నాగమ్మా.. కొలిచేమమ్మా !

అగ్ని పురాణం, స్కంద పురాణం, నారద పురాణం మరియు మహాభారతం వంటి భారతీయ గ్రంథాలు పాములను ఆరాధించే పాముల చరిత్ర వివరాలను తెలియజేస్తాయి. మహా భారత ఇతిహాసంలో, కురు వంశానికి చెందిన పరీక్షిత రాజు కుమారుడు జనమేజయుడు, తక్షకుడు అనే పాము కాటుతో తన తండ్రి మరణించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి సర్ప సత్రం అని పిలువబడే పాము యాగం చేస్తున్నాడు. ఒక బలి కొరివి ప్రత్యేకంగా నిర్మించబడింది మరియు ప్రపంచంలోని అన్ని పాములను చంపడానికి అగ్ని యాగం నేర్చుకున్న ఋషుల గెలాక్సీ ద్వారా ప్రారంభించబడింది. జనమేజయుని సమక్షంలో చేసిన యాగం చాలా శక్తివంతమైనది, ఇది అన్ని పాములను యజ్ఞ కుండంలో పడేలా చేస్తుంది. పరీక్షితహితను



కాటువేసి చంపిన తక్షకుడు మాత్రమే తన రక్షణకోరుతూ ఇంద్రలోకానికి పారిపోయాడని పురోహితులు గుర్తించినప్పుడు, ఋషులు తక్షకుడిని మరియు ఇంద్రుడిని కూడా యజ్ఞ అగ్నికి లాగడానికి మంత్రాలు పఠించే వేగాన్ని పెంచారు. తక్షకుడు ఇంద్రుని మంచం చుట్టూ చుట్టుకున్నాడు, అయితే యజ్ఞం యొక్క బలం చాలా శక్తివంతమైనది. తక్షకుడితో పాటు ఇంద్రుడు కూడా అగ్ని వైపుకు లాగబడ్డాడు. ఇది దేవుళ్ళను భయపెట్టింది, అప్పుడు మానసాదేవి జోక్య చేసుకుని సంక్షోభాన్ని పరిష్కరించమని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆమె తన కొడుకు ఆస్తికను యజ్ఞం జరిగే ప్రదేశానికి వెళ్లి సర్ప సత్ర యజ్ఞాన్ని ఆపమని జనమేజయుడిని కోరింది. ఆ సమయంలోనే ఆస్తికుడు జనమేజయుడిని అన్ని శాస్త్రాల జ్ఞానంతో ఆకట్టుకున్నాడు. అతను అతనికి వరం కోరడానికి అనుమతించాడు. ఆ సమయంలోనే ఆస్తికుడు సర్ప సత్రాన్ని ఆపమని జనమేజయుడిని అభ్యర్థించాడు. రాజు బ్రాహ్మణుడికి ఇచ్చిన వరాన్ని తిరస్కరించేవాడు కానందున, యజ్ఞం చేస్తున్న ఋషులచే రక్షించబడినప్పటికీ అతను పశ్చాత్తాపం చెందాడు. అప్పుడు యజ్ఞం నిలిపివేయ బడింది. ఈ రోజు, హిందూ క్యాలెండర్ ప్రకారం, నాడివర్ధిని పంచమి వర్షాకాలంలో శ్రావణ మాసం యొక్క ప్రకాశవంతమైన పక్షం యొక్క ఐదవ రోజు మరియు అప్పటి నుండి ఈ రోజు నాగదేవత యొక్క పండుగ రోజు, ఎందుకంటే వారి జీవితం ఈ రోజున మిగిలి పోయింది. రోజు ఇంద్రుడు కూడా మానసాదేవి వద్దకు వెళ్లి పూజించాడు. గరుడ పురాణం ప్రకారం, ఈ రోజున పాములకు పూజలు చేయడం శుభప్రదం మరియు ఒకరి జీవితంలో శుభవార్తలను అంది స్తుంది. దీన్ని అనుసరించి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. నాగపంచమి రోజున, నాగుపాము, పాములను పాలు, మిఠాయిలు, పువ్వులు, దీపాలతో పూజించయడమే కాకుండా నైవేద్యాలతో పూజిస్తారు. వెండి, రాయి, చెక్క లేదా గోడపై చిత్రించిన నాగ లేదా సర్ప దేవతలను మొదట నీటితో మరియు పాలతో స్నానం చేసి, తరువాత 'నాగ ప్రీతా భవంతి శాంతిమాప్నోతి బిల విబోధ్ సశాంతి లోక్ మా సాధ్య సత్య సత్యే' ' నాగ్ ప్రీతా భవని శాంతిమాప్నోతి బియా విభోః స శాంతి లోకా మా సాధ్యా మోదతే షష్ఠితః సుమః' అనే మంత్రాలను పఠిస్తూ పూజిస్తారు.

# ఒక్క నిమిషం చాలు ప్రాణం కాపాడొచ్చు



**కొంచెం ముందు తీసుకొచ్చునచంటే ప్రాణాలు కాపాడి ఉండేవాళ్లం చాలాసార్లు వైద్యుల నుంచి ఈ మాట వింటుంటాం. నిజానికి ఏదైనా ప్రమాదం జరగ్గానే ఒక్కరు తేరుకున్నా అలా ప్రాణం పోకుండా కాపాడొచ్చు. అంతటి మహాత్యమ్యం కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్)ది. దీనిపై అవగాహన కల్పించడమే కాదు, వేలమందికి శిక్షణనిస్తున్నారు డాక్టర్ దివ్యబన్న.**

గత ఏడాది.. చార్‌ధామ్ యాత్రలో ఒకతను ఉన్నట్టుండి కుప్పకూలి పోయాడు. పక్కనే ఉన్న కొడుకు వెంటనే ఆయనకి సిపిఆర్ చేసి, ఆసుపత్రికి తరలించాడు. ఆ క్షణం అతను చేసిన ప్రయత్నం తన తండ్రిని కాపాడింది. అంతటి శక్తి సిపిఆర్‌ది. అందుకే దీనిపై అవగాహన కల్పిస్తున్నా. దీని ద్వారా సంబంధిత వ్యక్తినే కాదు, మొత్తం కుటుంబాన్నీ రక్షించినవాళ్లం అవుతాం. పైగా రూపాయి ఖర్చుకాదు. నిజానికి యూరప్ దేశాల్లో అయిదో తరగతి విద్యార్థులకీ దీన్ని నేర్పిస్తారు. చాలా దేశాల్లో దీన్నో ప్రాథమిక నైపుణ్యంగానూ భావిస్తారు. పిల్లలే నేర్చుకున్నప్పుడు మిగతావాళ్లు నేర్చుకోవడానికే ముంది అనిపించింది. అందుకే శిక్షణనిస్తున్నాం. మాది విశాఖపట్నం. పుదుచ్చేరిలో ఎంబిబిఎస్, నెల్లూరులో ఎండి చేశా. నాలుగేళ్లుగా గీతంలో ఎమర్జెన్సీ మెడిసన్ విభాగాధిపతిగా పనిచేస్తున్నా. అతనయవసర పరిస్థితుల్లో మా దగ్గరికి వచ్చే ఎంతోమందికి వైద్యం చేశా. ఎప్పుడైనా నా వాళ్లు, స్నేహితులకు అనుకోనిదేదైనా జరిగి, నేను అందుబాటులో లేకపోతే పరిస్థితేంటి అన్న ఆలోచన వచ్చింది. నిజానికి ఏ వ్యక్తియినా కుప్పకూలితే ఎమర్జెన్సీ విభాగానికి తరలించడానికి కొన్ని నిమిషాలైనా పడుతుంది. కానీ తను పడిపోయిన 5 నిమిషాల్లో మెదడు పనితీరు 70 శాతానికిపై తగ్గిపోతుంది. ఒక్కోనిమిషం గడిచేకొద్దీ కోలుకునే అవకాశం క్షీణిస్తూ పోతుంది. ఇంతవరకూ రావొద్దంటే సిపిఆర్ తెలిసుండటమే మార్గం. ప్రతి ఒక్కరికీ దీనిపై అవగాహన కల్పిస్తే ఎన్నో ప్రాణాలను కాపాడొచ్చు. దీనికి వైద్యవిద్య చదవాల్సిన అవసరమూ లేదు. రక్షించాలన్న ఉద్దేశం, సిపిఆర్ మీద అవగాహన ఉంటే చాలు.



ఆలోచన రాగానే గీతం విశ్వవిద్యాలం నుంచే మొదలుపెట్టాం. వైద్యులతోపాటు హౌస్‌కీపింగ్ స్టాఫ్, హాస్పిటాలిటీ, సెక్యూరిటీ, జూనియర్ అసిస్టెంట్లు, ల్యాబ్ సిబ్బంది. అలా 70 శాతానికిపైగా ఉద్యోగులకు శిక్షణనిచ్చా. క్యాంపస్‌లో ఎవరికైనా సిపిఆర్ అవసరమైతే నిమిషాల్లో ఎవరో ఒకరు అందుబాటులో ఉంటారని ఉద్దేశం. అత్యవసర సమయాల్లో పనికొస్తుందని అంబులెన్స్ డ్రైవర్లకీ నేర్పించాం. గత ఏప్రిల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభించాం. జిమ్ ట్రైనర్లు, పోలీసులు, సెక్యూరిటీ గార్డులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు.. ఇలా గత ఏడాది వెయ్యి మందికిపైగా శిక్షణనిచ్చాం. ఏటా ఆ సంఖ్య మరింత పెంచాలన్నది లక్ష్యం. నెలలో మూడు రోజులు శిక్షణకు కేటాయిస్తున్నాం ప్రొఫెసర్లు, విద్యార్థులనూ భాగస్వాములు చేయాలనుకుంటు న్నాం. కేవలం నేర్పడమే కాదు పరీక్షనీ నిర్వహిస్తాం. సరైన మార్కులు రాకపోతే మళ్లీ నేర్చుకోవాలి. ఏడాది వ్యాలిడిటీతో సర్టిఫికెట్ ఇస్తాం. గడుపు పూర్తయ్యాక తిరిగి శిక్షణ తీసుకునేలా చూస్తున్నాం.

# అందెల రవళి





ప్రత్యేకతను చెప్పకనే చెప్పారు. పట్టీలు, అందియలు, గజ్జెలు..అంటూ ప్రాంతానికో పేరుతో పిలిచే ఇవంటే మగువలకు ఎంతో మురిపెం ఒకప్పుడు పెద్దా, చిన్నా తేడాలేకుండా ప్రతి మహిళా వీటిని ధరించేవారు. అయితే వీటిల్లో ఎక్కువగా వెండివే కనిపిస్తుంటాయి. ఇవి రెట్టింపు అందాన్ని తెచ్చిపెడతాయనడంలో సందేహం ఏముంది? ఇవి అమ్మాయిల మనసు దోచుకోవడమే కాదు.మగవారి గుండెల్లోనూ అలజడి రేపుతుంటాయట. అందుకే కాలి అందియలు ఘల్లుఘల్లుమన రాజహంసలా రావే..గజ్జె ఘల్లు మన్నాదిరో గుండె జల్లుమనాననదిరో అంటే సినీ కవులు పట్టాల నాడుల్ని ప్రేరేపితం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయనేది పెద్దల నమ్మకం. బంగారాన్ని ధరించేవారు అరుదుగా ఉన్నా.. ఈ మధ్య కాలంలో అచ్చంగా పసిడిని తలపించేలా పంచలోహాలతో చేసిన పట్టీలకూ ప్రాధాన్యం పెరిగింది. పంచలోహాలంటే బంగారం, వెండి, రాగి, జింక్, ఇనుము అనే ఐదు లోహాల కలయిక. ఇవి అచ్చంగా పుత్తడిని పోలి ఉండటం, మెరుపై ఎక్కువ కాలంల నిలిచి ఉండటంతోవీటితో చేసిన అందెలకూ ఆదరణ లభిస్తోంది.



# చింతగింజలతో ఎన్నో లాభాలు!



చింతపండు.. రెగ్యులర్‌గా వంటల్లో వాడేస్తుంటాం. పులుసు తీసి చారుల్లో, కూరల్లో ఉపయోగించినా.. గింజల్ని మాత్రం పడేస్తుంటారు. అయితే, చింతగింజల్లోనూ అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చింతగింజల పొడి నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. సాఫ్ట్ డ్రింక్స్ ఎక్కువగా తాగడం వల్ల దంతాల మీద ఒక రకమైన పొర ఏర్పడుతుంది. చింత గింజల పొడితో పళ్ల మీద రుద్దడం వల్ల ఈ పొర తొలగి పోతుంది. చిగుళ్లా ఆరోగ్యంగా మారుతాయి. అజీర్ణాన్ని తగ్గించడంలో చింతగింజల రసం దివ్యౌషధమే! ఇందులోని డైటరీ ఫైబర్.. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తుంది. పాంక్రియాస్‌ని రక్షించే గుణం చింతగింజల్లో ఉంది. ఈ పొడి నీరు తాగితే రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. ఇందులోని పొటాషియం.. అధిక రక్తపోటు, ఇతర గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. చింతగింజల్లో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు ఎక్కువ. ఇవి చర్మ సమస్యలను తగ్గిస్తాయి. అయితే, చింత గింజల పొడి ఎలా వాడాలో నిపుణుల సలహా తీసుకోవడం అవసరం.

# సిస్టమ్‌ని తదేకంగాచూస్తే..



తదేకంగా సిస్టమ్‌ని చూస్తే.. ప్రతి గంటకోసారి కుర్చీలోంచి లేచి అలా నాలుగు అడుగులు వేయాలన్నది తెలిసిందే కదా! కానీ చాలామంది ఉద్యోగినులు రోజు మొత్తంలో మరీ అవసర మైతే తప్ప సీటులోంచి లేవడానికి ఇష్టపడటం లేదట. తదేకంగా సిస్టమ్‌ని చూసీ చూసీ సాయంత్రానికి కళ్లు లాగడం, మంటలు వగైరా! మీదీ అదే ఇబ్బందా? అయితే 20-20-20 సూత్రాన్ని పాటించేయండి.ా. అసలు కళ్లార్పుతున్నారా.. గమనించుకోండి. పని హడావుడిలో ఇవేం పట్టించుకుంటాం అంటారా? సిస్టమ్ చూసేప్పుడు సాధారణంగానే కళ్లు ఆర్పడం మార్చిపోతుంటాం. దీంతో అవి పొడిబారి నొప్పులు, మండటం లాంటివి కనిపిస్తాయి. ప్రతి 20 నిమిషాలకు ఓసారి పని పక్కన పెట్టండి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లపాటు కళ్లార్పకుండా చూడండి. ఇలా చేస్తూ ఉంటే కళ్లకూ వ్యాయామం, విశ్రాంతి దొరుకుతుంది. సమయం గుర్తుండదు అనిపిస్తే అలారం పెట్టుకున్నా సరే! తరచూ తలనొప్పి, పనిపై దృష్టి పెట్టలేక పోవడం, మెడనొప్పి.. వగైరా వచ్చినప్పుడు తెగ ఇబ్బంది పడతాం కదా! నిజానికి కళ్లు మూసుకోండి. తర్వాత నెమ్మదిగా తెరిచి, అర నిమిషంపాటు ఆపకుండా కళ్లార్చాలి. అప్పుడు తేమ అంది ఉపశమనం కలుగుతుంది. ప్రతి అరగంటకు ఓసారి సిస్టమ్ నుంచి కళ్లు మరల్చి, వేరే పనిమీద దృష్టిపెట్టండి. వీలుంటే గంటకోసారి అలా పక్కకు వెళ్లినా మంచిదే. కళ్లతోపాటు శరీరానికీ మేలు కలుగుతుంది. సమయం వృథా అనుకుంటాం కానీ, ఇలా చేయడం వల్ల మెదడూ శాంతపడుతుంది. కనీసం అయిదు నిమిషాలైనా అలా నడుస్తూ ఉండండి మరి. సిస్టమ్ నుంచి వచ్చే వెలుతురు, సన్నని అక్షరాలు కూడా కళ్లపై ప్రభావం చూపేవే ! కాబట్టి, వెలుతురు మరీ ఎక్కువ కాకుండా చూసుకోండి. అలాగే అక్షరాల సైజును పెంచుకోండి. చాలావరకూ వాటిపై భారం తగ్గుతుంది.

**బరువు తగ్గడానికి మనలో చాలామంది ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటాం కదా! వాటిలో ఎక్కువమంది ఆకర్షిస్తోంది డుకన్ డైట్. జెన్నిఫర్ లోపేజ్ కిమ్ కర్దాషియన్ సహ ఎందరో తారలు దీన్ని ప్రయత్నించడంతో మనవాళ్ల చూపూ దీనిపై పడింది. ఇతకీ ఏమిటీ డైట్?**

ఎక్కువ ప్రొటీన్, తక్కువ మొత్తం కార్బోహైడ్రేట్.. ఈ డైట్ ప్రధాన సూత్రం. ఇంకా ఇది నాలుగు దశల్లోనూ సాగుతుంది. అవేంటంటే.. ఎక్కువ ప్రొటీన్, తక్కువ మొత్తం కార్బోహైడ్రేట్స్. ఈ డైట్ ప్రధాన సూత్రం,

# ఆకర్షిస్తున్న డుకన్ డైట్



ఇంకా ఇదినాలుగు దశల్లోనూ సాగుతుంది, అవేంటంటే.

**అటాక్ ఫేజ్..** ఇది వారం రోజులు ఉంటుంది. ఈ సమయంలో లీన్ ప్రొటీన్‌కే ప్రాధాన్యమివ్వాలి. అంటే స్కిన్‌లెస్ చికెన్, గుండ్లు, చేప, సోయాలతో పాటు కొవ్వులేని పాలు, పెరుగు, చీజ్ వంటివి తినొచ్చు. రోజులో నూనె స్పూనుకి మించకూడదు. కూర గాయలు,పండ్లు, కొవ్వులు, చక్కెరలను అసలు దగ్గరికి రానివ్వకూడదు. అందుకే స్పూను వరకూ ఓట్ బ్రాన్ తొనొచ్చు. వీటితోపాటు రోజూ 8 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగాలి.

**క్రూయిజ్ ఫేజ్:** ఇది 12 నెలల వరకూ ఉంటుది. ఈ సమయంలో పిండి పదార్థాలు లేని కాయగూరలు, ఆకుకూరలు, దుంపలు, మష్రూమ్స్, ఉల్లి, బ్రకలీ, క్యాలీఫ్లవర్ వంటి వాటిని ప్రాధాన్యమివ్వాలి. ఒకరోజు లీన్ ప్రొటీన్ డైట్ తీసుకుంటే మరోరోజు కాయగూరలను తీసుకోవాలి. ఓట్ బ్రాన్, రెండు స్పూన్ల నూనెనీ తీసుకోవచ్చు. పండ్లు, బంగాళదుంప, మొక్కజొన్న, గోధుమ, వరి, బార్లీ, మిల్లెట్లు, చక్కెర వంటివి తినకూడదు. కన్సాలిడేషన్ ఫేజ్: బరువు తగ్గడం మొదలుయ్యాక ఇది ప్రారంభమవుతుంది. అరకేజీ తగ్గిన ప్రతిసారి దీన్ని పాటించాలి. ఇది అయిదురోజులు ఉంటుంది. ఈ సమయంలో లీన్‌ప్రొటీన్లు, పిండిపదార్థాలు లేనికాయగూరలతోపాటు కార్బొహైడేట్స్ కొవ్వు ఉన్న పదార్థాలు, ఒక పండునీ తీసుకోవచ్చు. ఒకరోజు రైస్, నిచ్చన ఆహారాలు తీసుకోవచ్చు. రెండు స్పూన్ల ఓట్ బ్రాన్ రోజూ తప్పనిసరి అయితే తీపిపదార్థాలు, అరటి, ద్రాక్ష, చెర్రీస్‌కి అనుమతి ఉండదు. ఈ సమయంలో రోజూ కనీసపం 25 నిమిషాలు ఏదైనా వ్యాయామం తప్పనిసరి.

**స్టెబిలైజేషన్ ఫేజ్:** కోరుకున్నంత బరువు తగ్గగానే క్రూయిజ్ ఫేజ్‌ని పక్కన పెట్టి, ఈ దశ కొనసాగిస్తూ వెళ్లొచ్చు. ఇక్కడ మరీ నోరు కట్టుకోవాల్సిన పని ఉండదు. లీన్ ప్రొటీన్లను వారానికోసారి తీసుకోవచ్చు. వారంలో 2-3 సార్లు అన్నం, తీప పదార్థాలు, రోజూ పండ్లు, కాయగూరలు తినొచ్చు. అయితే రోజూ 3 స్పూన్ల ఓట్ బ్రాన్ తప్పనిసరి. నచ్చినవన్నీ తినమన్నారు కదాని ఇష్టానుసారం లాగిస్తే బరువు పెరుగుతారు.

# కీళ్ల నొప్పులకు రోజ్‌హిప్ టీ

అందం, ఆరోగ్యం కోసం.. సంప్రదాయ టీ స్థానంలోకి హెర్బల్ టీలు వచ్చాయి. వాటిల్లోనూ యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే రోజ్‌హిప్ టీ తీసుకోవడం వల్ల అధిక ప్రయోజనాలు పొందొచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు.

- . సాధారణ హెర్బల్ టీలతో పోలిస్తే ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల మనలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- రక్తంలోని ట్రైగ్లిజరాయిడ్లని అదుపుచేసి.. గుండెజబ్బులు రాకుండా చేస్తుంది. బరువుని అదుపులో ఉంచుతుంది.
- తుంటి, కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతర్గత వాపుల రాకుండా చూస్తుంది.ఈ టీని నిత్యం తాగేవారికి విటమిన్ సి, విటమిన్ ఇ లు పుష్కలంగా అందుతాయి. ఈ విటమిన్లు.. చర్మంలో సాగే గుణాన్ని

# కాల్షియం అందించే ద్రాక్ష

కాల్షియం అందించే ద్రాక్ష సీజన్‌తో సంబంధం లేకుండా దొరికే పండ్లలో ద్రాక్ష ఒకటి! పండైనా, ఎండినదైనా ఇది మనకు అందించే పోషకాలెన్నో! శారీరకంగానే కాదు.. మానసికంగానూ ఆరోగ్య ప్రయోజనాలు అందించే దీని గురించి తెలుసుకుందాం.. 1. 30 దాటాక కొందరు మహిళల్లో ఎముక బలం తగ్గుతుంది. ద్రాక్షను తరచూ తీసుకోండి. దీనిలో క్యాల్షియం పొటాషియం, మెగ్నీసియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండి, ఎముకలను దృఢంగా చేయడంలో సాయపడ తాయి. పాలిఫినాల్ రక్తంలోని చెడుకొవ్వులనుకరిగించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ద్రాక్షలోని మెలటోనిన్ ప్రశాంతమైన నిద్రను అందిస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. దీనిలోని పోషకాలు అల్జీమర్స్‌నీ దరి చేరనీయవు.వ యాంటీఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్, ఎండవల్ల జరిగే నష్టం నుంచి కాపాడతాయి. విటమిన్ సి చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా తయారయ్యేలా చేయడమే కాదు. రోగనిరోధకతనూ అందిస్తుంది. వ కెలోరీలు తక్కువ, నీటి శాతం ఎక్కువ. అధికచ మోతాదులో ఉండే ఫైబర్ బరువు తగ్గించటంలో సాయపడుతుంది. లుటిన్ కళ్ల ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది.



# పెంపకాన్ని బట్టి ఎదుగుతారు..



**పిల్లలకు మొదటి పాఠశాల ఇల్లే.. తల్లిదండ్రుల ప్రభావం, వారి పెంపకంలోనే వ్యక్తిత్వం తీర్చి దిద్దుకుంటారు. భవిష్యత్తులోకి అక్కడి నుంచే అడుగులేస్తారు. పెంపకానికి ఇంతటి ప్రాముఖ్యం ఉంది. అయితే దీని వెనక ఉన్న తల్లిదండ్రులు, వారు పెంచే విధానాలు పలు రకాలు. వీటిని బట్టి పిల్లలెలా ప్రభావితులు అవుతారో నిపుణులు చెబుతున్నారిలా..**

**దండించి చెబితే..** పిల్లలపట్ల తల్లిదండ్రులు నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తారు. క్రమశిక్షణ తప్పిందా.. దండిస్తారు. ప్రతి విషయం తమకు నచ్చేలా చేయాలని పిల్లలపూ ఒత్తిడి తెస్తారు. నియమనిబంధనలు పాటించేలా చేస్తారు. ఎదురు ప్రశ్నించే అవకాశాన్నివ్వరు. ఈ పెంపక ప్రభావంతో పిల్లలు యుక్త వయసుకొచ్చేసరికి నలుగురితో కలవలేకపోవడం, కుంగుబాటు లాంటి మానసిక అనారోగ్యా లకు లోనవుతారు. యూనివర్సిటీ ఆఫ్ లూవెన్ అధ్యయనంలో ఇది వెల్లడైంది కూడా. కొరవడిన ఆత్మవిశ్వాసంతో, చిన్న వైఫల్యాన్ని కూడా అంగీకరించలేని స్థితిలో ఉంటారు.

**మీరే లక్ష్యాన్ని నిర్ణయిస్తే..** ఈ రకమైన పెంపకంలో పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పడానికి తల్లిదండ్రులు స్వేచ్ఛనిస్తారు. పొరపాట్లు చేస్తే వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడానికి అవకాశాలన్నిస్తారు. అయితే తమ లక్ష్యాలనే పిల్లలు సాధించాలని కోరుతారు. పిల్లలకంటూ ప్రత్యేక అభిప్రాయం ఉండటం వీరికి నచ్చదు. తప్పటడుగు వేసినా, అనుకున్న ఆశయాలను వారు చేరలేకపోయినా శిక్షిస్తారు. ఇలా పెరిగిన పిల్లల్లో క్రమశిక్షణ ఉన్నా..నచ్చిన రీతిలో ఉండే స్వేచ్ఛ లేదనే వేదన ఉంటుంది. అందరికన్నా ముందు ఉండాలనీ, ఎదుటివారితో నిత్యం పోటీగా ఉంటూ.. అన్నింటిలో తామే నెగ్గాలనే ఆలోచన వీరిలో కనిపిస్తుంది.తల్లిదండ్రులకోసం నచ్చని లక్ష్యాన్ని చేరుకొని అసంతృప్తిగా జీవిస్తారు. స్నేహంగా ఉంటూ.. అరుదుగా పిల్లలను క్రమశిక్షణలో ఉంచుతారు. సంతానం నుంచి ఎక్కువగా ఆశించరు. పిల్లలతో స్నేహంగా ఉంటారు. వారి ఆశయాలు, లక్ష్యాలకు విలువనిచ్చి స్వేచ్ఛనిసానతరు. పిల్లలపట్ల బాధ్యతగా ఉంటారు తప్ప, అధికారాన్ని ప్రదర్శించరు. ఈ పెంపకంలో పిల్లలు అనుకున్నంత ఉన్నతస్థానాలు చేరుకోలేకపోయినా.. జీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా పరిష్కరించుకోగలుగుతారు.

**బాధ్యత లోపిస్తే...** పిల్లలపట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తారు. మాటామంతీ ఎక్కువ ఉండదు. కన్నందుకు బాధ్యత వహిస్తామనే ధోరణి కనిపిస్తుంది. అవసరాలన్నీ తీరుస్తారు తప్ప పిల్లల భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోరు. సలహా సూచనల్వీరు. మరి కొందరైతే పిల్లల బాధ్యతను కొంచెం కూడా పట్టించుకోరు. అవసరాలు తీర్చాలనే ఆలోచనా ఉండదు. వేధింపులకూ గురి చేస్తుంటారు. ఇటువంటి తల్లిదండ్రుల వద్ద పెరిగిన పిల్లలు యుక్తవయసుకొచ్చేసరికి స్వీయ నియంత్రణ కోల్పోతారు. పెద్దగా సక్సెస్ కాలేక, కారణం ఎదుటివారే అనే భావనలో ఉంటారు.

# డ్రాతో ఇంగ్లండ్‌కు షాక్

## టాప్ 2పై ఆశలు ఆవిరి

### పాయింట్లలో 4 ప్లేస్‌లో భారత్




**న్యూఢిల్లీ:** భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ నాలుగో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఒక దశలో ఇంగ్లాండ్ ఈ మ్యాచ్‌ను సులభంగా గెలుస్తుందనిపించినా, టీమిండియా బ్యాట్స్‌మెన్ల పోరాటం వల్ల ఈ టెస్ట్ డ్రా అయ్యింది. భారత్ నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకోవడం ద్వారా ఇంగ్లాండ్‌కు పెద్ద షాక్ ఇచ్చింది. దీన్ని గెలిచి ఉంటే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 పాయింట్ల పట్టికలో ఇంగ్లాండ్ టాప్ 2లోకి వచ్చి ఉండేది. కానీ ఇప్పుడు అది మూడో స్థానానికే పరిమితమైంది. భారత జట్టు గతంలో లాగే నాలుగో స్థానంలో ఉంది. భారత్ 4 మ్యాచ్‌లలో ఒక విజయం, ఒక డ్రా, రెండు ఓటములతో 16 పాయింట్లు ఉండగా, విజయశాతం 33.330గా ఉంది. నాలుగో టెస్ట్ డ్రా అయిన తర్వాత భారత్, ఇంగ్లాండ్ రెండూ చెరో 4 పాయింట్లు పొందాయి. టెస్ట్‌లో గెలిచిన జట్టుకు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో 12 పాయింట్లు లభిస్తాయి. టెస్ట్ టై అయితే చెరో 6 పాయింట్లు, టెస్ట్ డ్రా అయితే చెరో 4 పాయింట్లు చేరతాయి. అయితే, డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో జట్ల స్థానాలు పాయింట్లతో కాకుండా విన్నింగ్ పర్సంటేజీతో నిర్ణయించబడతాయి. మరోవైపు ఇంగ్లాండ్ స్థానంలోనూ మార్పు చోటు చేసుకోలేదు. ఇంగ్లాండ్ మూడో స్థానంలోనే ఉంది. ఈ సైకిల్‌లో ఇంగ్లాండ్ ఇప్పటి వరకు 4 నాలుగు మ్యాచ్‌లు ఆడింది. రెండు మ్యాచ్‌ల్లో గెలవగా, ఓ మ్యాచ్‌లో ఓడిపోయింది. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో 26 పాయింట్లు ఉండగా విజయశాతం 54.170గా ఉంది. ఇక పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆసీస్ ఖాతాలో 36 పాయింట్లు ఉండగా, విజయశాతం 100గా ఉంది. ఈ జాబితాలో శ్రీలంక 2వ స్థానంలో ఉంది. రెండు మ్యాచ్‌లు ఆడిన లంక ఓ మ్యాచ్‌లో గెలవగా, మరో మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో 16 పాయింట్లతో విజయశాతం 66.670గా ఉంది. ఇక ఐదోలో బంగ్లాదేశ్, ఆరో స్థానంలో వెస్టిండీస్ జట్లు ఉన్నాయి. న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా జట్లు ఇంకా డబ్ల్యూటీసీ కొత్త సైకిల్‌లో మ్యాచ్‌లను ఆడలేదు.






## టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో.. రెండు రజతాలతో ముగిసిన భారత్ పోరు

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటీటి కాంటెండర్ బ్యూనస్ ఎయిర్స్-2025లో భారత్ టేబుల్‌టెన్నిస్ ప్లేయర్లు అంకుర్‌పయాస్, హర్మీత్ యశశ్విని రన్నరప్‌గా నిలిచారు. ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మానవ్ థక్కర్ ఓడిపోవడంతో డబుల్స్ ఈవెంట్లలో రెండు రజత పతకాలతో ముగిసింది, చివరి రోజు సోమవారం భారత్ తృటిలో స్వర్ణాన్ని కోల్పోయింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో భారత జోడీ పయాస్ జైన్-అంకుర్ భట్టాచార్జీ 1-3 తేడాతో జపాన్‌కు చెందిన కజుకి హమదా-హిరోము కొబయాషి చేతిలో ఓడిపోయారు. ఈ మ్యాచ్‌లో జపాన్ 11-5, 11-7 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. మూడో గేమ్‌లో పయాస్-అంకుర్ జోడీ గట్టి పోటీని కనబరిచి, 3-6 తేడాతో ఆడి 11-9 తేడాతో ఆధిక్యాన్ని సాధించారు. అయితే, నాల్గవ మ్యాచ్‌లో ఆ ఊపును నిలబెట్టుకోలేకపోయారు. 9-9 వద్ద కీలకమైన సర్వీస్ ఫాల్ట్‌తో సహా అనవసర తప్పిదాలు జరిగాయి. దీంతో ఈ జపాన్ జంట మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను దక్కించుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో హర్మీత్ దేశాయ్-యశస్విని ఘోర్పడేలతో కూడిన భారత జట్టు కూడా రెండవ సీడ్ బ్రెజిలియన్ జంట హ్యూగో కాల్డెరానో-బ్రూనా టకాహషి చేతిలో 0-3 తేడాతో ఓడి రజతంతో సంతృప్తి చెందింది. 15-17, 7-11, 11-13 వరుస గేమ్‌లతో ఓడిపోయినప్పటికీ దేశాయ్, ఘోర్పడే గట్టి పోటీ ఇచ్చారు. సెమీఫైనల్స్‌లో థక్కర్‌ను జపాన్‌కు చెందిన మిజుకి ఓయికావా 10-12, 5-11, 5-11 స్కోరుతో వరుస గేమ్‌లలో ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో, ఐహికా ముఖర్జీ హాంకాంగ్‌కు చెందిన సుత్ జ్ తుంగ్ చేతిలో 1-3 తేడాతో ఓటమి పాలైంది. ఐహికా తొలి గేమ్‌ను 11-7తో కైవసం చేసుకుంది కానీ జోరును కొనసాగించలేకపోయింది, చివరికి 11-7, 11-13, 7-11, 8-11 తేడాతో ఓడిపోయింది.

## ‘లెజెండ్స్’లో దక్షిణాఫ్రికా గెలుపు

### 95 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఓటమి



**న్యూఢిల్లీ:** వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్-2025లో ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా మట్టికరిపించింది. దక్షిణాఫ్రికా ఆస్ట్రేలియాను 95 పరుగుల తేడాతో ఓడించింది. 360 డిగ్రీల స్ట్రోక్‌ప్లేకు పేరుగాంచిన దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్, వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసిఎల్) 2025 లో వరుసగా రెండవ సెంచరీని సాధించడం ద్వారా తన సత్తాను మరోసారి నిరూపించాడు. లీడ్స్‌లో టోర్నమెంట్ ప్రారంభంలో ఇంగ్లాండ్‌పై అద్భుతమైన సెంచరీ చేసిన తర్వాత, డివిలియర్స్ ఆసీస్ పై కేవలం 46 బంతుల్లోనే 123 పరుగులు చేసి తన సంచలనాత్మక ఫామ్ ను కొనసాగించాడు. అతని ఇన్నింగ్స్ లో 15 బౌండరీలు మరియు 8 అద్భుతమైన సిక్సర్లు ఉన్నాయి. డివిలియర్స్‌కు జెజె స్మట్స్ తో కలిసి 81 బంతుల్లోనే 187 పరుగుల భారీ ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. స్మట్స్ 53 బంతుల్లో 85 పరుగులు చేసి, 10 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. మరోవైపు డివిలియర్స్ బాణసంచాతో రాణించాడు. ఈ జంట యొక్క విస్ఫోటన భాగస్వామ్యం దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 241/6 పరుగులు సాధించడంలో సహాయపడింది. ఆస్ట్రేలియన్ల బౌలర్లలో పీటర్ సిడిల్ 38 పరుగులకు 3 వికెట్లు పడగొట్టి బౌలింగ్ లో కీలక పాత్ర పోషించాడు. ఈ లక్ష్యాన్ని అధికమించేందుకు ఆస్ట్రేలియన్ జట్టు ఆరంభంలో తడబడి, కోలుకోలేదు, చివరికి 16.4 ఓవర్లలో కేవలం 146 పరుగులకే ఆలౌటైంది. బెన్ కటింగ్ ఒక్కడే అజేయంగా 59 పరుగులు చేశాడు, కాని మిగిలిన లైనప్ నుండి అతనికి మద్దతు లేదు. కెప్టెన్ ఆరోన్ ఫాంగిసో ముందు నుండి బంతిని నడిపించాడు, 3.4 ఓవర్లలో 4/13తో మ్యాచ్ గెలిచేలా చేశాడు. ఇమ్రాన్ తాహిర్ 3 వికెట్లు తీసి ఆసీస్ కష్టాలను మరింత పెంచాడు. ఫలితంగా దక్షిణాఫ్రికా 95 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది.



## మహిళల కబడ్డీ వరల్డ్ కప్ మళ్లీ వాయిదా

### ప్రో కబడ్డీ లీగ్ తర్వాతే జరిగే అవకాశం

**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్-2025 రెండవ ఎడిషన్ నిరవధికంగా వాయిదా పడింది. ఆగస్టు 3 నుండి 10 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ ప్రపంచ కప్ జరగాల్సి ఉంది. మొదట బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరగాల్సిన ఈ టోర్నమెంట్, బీహార్ ఆతిథ్య బాధ్యతల నుండి వైదొలిగిన తర్వాత వేరే చోటికి మార్చబడింది. ఈ టోర్నమెంట్‌లో అర్జెంటీనా, బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, జర్మనీ, నెదర్లాండ్స్, ఇరాన్, జపాన్, కెన్యా, నేపాల్, థాయిలాండ్, ఉగాండా, జాంజిబార్, పోలాండ్ మరియు ఆతిథ్య మరియు డిఫెండింగ్ ఛాంపియన్స్ భారతదేశంతో సహా మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. ఆగస్టు 29న వైజాగ్‌లో ప్రారంభమయ్యే ప్రో కబడ్డీ లీగ్ ముగిసిన తర్వాత ఈ టోర్నమెంట్ హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ జట్టు తమ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించిన గంట తర్వాత ఈ వాయిదా నిర్ణయం వచ్చింది. ఈ మేరకు దీనికి సంబంధించి అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అంతర్జాతీయ కబడ్డీ ఫెడరేషన్‌కి రాసిన లేఖలో జట్టు కంటింజెంట్ అడ్మినిస్ట్రేటివ్ వివరాలను సకాలంలో సమర్పించకపోవడం వల్ల సంబంధిత మంత్రిత్వ శాఖల నుండి అనుమతులు పొందడంలో సమస్య తలెత్తిందని పేర్కొంది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే దేశాల జాబితాలో ఎటువంటి మార్పులు అనుమతించబడవని కబడ్డీ ఫెడరేషన్ స్పష్టం చేసిందని, ఇది సకాలంలో అనుమతుల కోసం పరిపాలనా ప్రక్రియను దెబ్బతీస్తుందని పేర్కొంది. సవరించిన తేదీలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. టోర్నమెంట్ నిర్వహణకు పరిమిత సమయం అందుబాటులో ఉన్నందున, క్రీడ యొక్క ఉత్తమ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, 2వ మహిళల కబడ్డీ ప్రపంచ కప్ 2025ను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. సవరించిన తేదీలను త్వరలో ప్రకటిస్తారని అ లేఖలో పేర్కొంది.

## కృత్రిమ మేధను తేలిగ్గా తీసుకోవద్దు: ఏఐ పితామహుడు

**న్యూఢిల్లీ, జూలై 28:** టెక్ దిగ్గజాలు కృత్రిమమేధ ముప్పును తక్కువ అంచనా వేస్తున్నాయని ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ వ్యాఖ్యలు చేశారు. ఏఐతో తలెత్తే ప్రమాదాలను టెక్నాలజీ కంపెనీలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. కీలక శాస్త్రవేత్తలు ఏఐ ముప్పును తక్కువ చేసి చెప్తున్నారని నా అభిప్రాయం. డెమిస్ హస్సాబిస్ (డీప్‌మైండ్ సంస్థ సీఈఓ) వంటివారు ఈ ముప్పును అర్థం చేసుకొని, దానిని ఎదుర్కొనేందుకు పని చేయాలనుకుంటున్నారు. తొలినాళ్లలో ఈ ప్రమాదాన్ని గుర్తించనందుకు చింతిస్తున్నాను అని అన్నారు. దశాబ్దం పాటు సేవలు అందించి 2023లో హింటన్ గూగుల్‌ను వీడారు. ఏఐని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడానికి గూగుల్ చేస్తోన్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆయన వెళ్లిపోయారని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అయితే అందులో వాస్తవం లేదని తాజాగా ఆయన వెల్లడించారు. శామ్ ఆల్ట్‌మన్ వార్నింగ్ అప్పటికి తన వయసు 75 ఏళ్లని, ఆశించిన మేర పనిచేయలేక పోవడం వల్లే ఆ సంస్థను వీడినట్లు చెప్పారు. అయితే ఇప్పుడు



తాను ఏఐ ముప్పు గురించి స్వేచ్ఛగా మాట్లాడగలనని వ్యాఖ్యానించారు. ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్‌లో చేసిన కృషికిగానూ హింటన్‌కు 2024లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ వరించింది. ఆ రంగంలో దశాబ్దకాలం పాటు ఆయన చేసిన కృషి ఫలితమే ఇప్పుడు ఏఐ విప్లవానికి దోహదం చేసింది. కృత్రిమ మేధ ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దానిపై గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు.

## బ్యాంకింగ్, రియాల్టీ షేర్ల అమ్మకాలు

### నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 28:** దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాలను మూటగట్టుకున్నాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, కీలక రంగాల షేర్లలో అమ్మకాలను మార్కెట్లను కుదిపేశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్టీ రంగ సూచీలు నష్టపోవడం సూచీలను కిందకు పడేసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 570 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,700 మార్క్‌ను కోల్పోయింది. ఉదయం 81,299.97 వద్ద స్వల్ప నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ తొలుత కాస్త కోలుకున్నట్లు కన్పించింది. కానీ, మధ్యాహ్నం తర్వాత మరింత పతనమైన సూచీ.. ఇంట్రాడేలో 80,776.44 వద్ద కనిష్ఠానికి



పడిపోయింది. చివరకు 572.07 పాయింట్లు కిందకు వెళ్లి 80,891.02 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 156.10 పాయింట్లు నష్టపోయి 24,680.90 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు తగ్గి 86.66గా ముగిసింది. ఫార్మా మినహా అన్ని రంగాల సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. రియల్టీ సూచీ ఏకంగా 4 శాతం పతనమైంది. మీడియా సూచీ దాదాపు 3శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, లోహ, టెలికాం రంగ సూచీలు 1 1.5 శాతం మేర పడిపోయాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, హీరో మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా.. కొటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్‌బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. త్రైమాసిక ఫలితాల ఎఫెక్ట్‌తో కొటక్ మహీంద్రా షేర్లు దాదాపు 7.34శాతం పతనమయ్యాయి. టీసీఎస్ షేర్లు 1.59శాతం కుంగాయి.

## 25శాతమే ఆన్‌లైన్‌లో షాపింగ్




**ముంబై, జూలై 28:** బయటకువెళ్లి వేచి చూసే పని లేకపోవడం, ఊరించే ఆఫర్లు.. ఇవన్నీ కలిసి ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే అమెరికా, చైనాతో పోల్చుకుంటే ఈ విషయంలో భారత్ నాలుగు అడుగులు వెనకే ఉంది. భారత్‌లో 850 మిలియన్ల (85 కోట్లు) మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నప్పటికీ వారిలో 2025 శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేస్తున్నారని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ మెకెన్సీ వెల్లడించింది. రానున్న రోజుల్లో భారత ఇ-కామర్స్ రంగం గణనీయమైన వృద్ధి సాధించడానికి అవకాశం ఉందని పేర్కొంది. అమెరికా, చైనాల్లో ఇంటర్నెట్ వినియోగదారుల్లో 85 శాతం మంది ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నారని పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగిందని వెల్లడించింది. భారతీయులు ఈ తరహా షాపింగ్ వైపు మొగ్గుచూపడమే గాకుండా కొత్త ఆలోచనలతో ఇ-కామర్స్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నారు. నిమిషాల వ్యవధిలో వస్తువులను ఇంటికి తెచ్చిచ్చే క్విక్ కామర్స్ వేదికలు అందుకు నిదర్శనమని తెలిపింది. కాగా, 2023 నాటికి దేశ రిటైల్ అమ్మకాల్లో ఈ కామర్స్ వాటా 7 నుంచి 9 శాతంగా ఉండగా, అది 2030 నాటికి రెట్టింపు అవుతుందని అంచనాలు ఉన్నాయి.

## రూ.46 వేల కోట్లు క్షీణించిన ఎల్‌ఐసి పోర్టుఫోలియో!

**న్యూఢిల్లీ, జూలై 28:** ఎల్‌ఐసిలో పెట్టుబడుల పోర్టుఫోలియో జూలై నెలలో ఇప్పటివరకూ 46వేల కోట్లు తగ్గినట్లు తేలింది. మార్కెట్‌లోనే ఉన్న హెచ్చుతగ్గులు ఇందుకు కారణం అవుతున్నాయి. అలాగే రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రభావం కూడా ఈ కంపెనీపై ఉన్నట్లు అంచనా. మొత్తంగా పోర్టుఫోలియో విలువలు 16.10 లక్షల కోట్ల రూపాయల నుంచి 15.64 లక్షల కోట్లకు తగ్గిపోయాయి. అంటే 2.6శాతం క్షీణత నమోదుచేసింది. మొత్తం మార్కెట్లలోనే నెలకొన్న హెచ్చుతగ్గులు ఎల్‌ఐసి పోర్టుఫోలియో క్షీణతకు కూడా కారణం అయింది. రిలయన్స్ షేర్లు ఎల్‌ఐసి పోర్టుఫోలియోపై ఎక్కువ ప్రభావం చూపించాయి. మార్కెట్‌ధరలు పడిపోవడంతో మొత్తంగా కంపెనీ పోర్టుఫోలియో విలువలు కూడా తగ్గాయి. ఇన్వెస్టర్లు విత్‌డ్రాకే మొగ్గుచూపించడం వల్ల పెట్టుబడుల పోర్టుఫోలియోలో 46వేల కోట్ల రూపాయలు క్షీణత నమోదుచేసింది. ఐటి రంగంలో నాలుగు ప్రధాన కంపెనీలు టిసిఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్‌మహీంద్ర కంపెనీలు కూడా ఎల్‌ఐసి క్షీణతకు కారణం అయ్యాయి. ఈ కంపెనీల షేర్లు పైపైకి వెళ్లడం ప్రభుత్వరంగంలోని ఎల్‌ఐసిపై ప్రభావం చూపించింది. వీటికితోడు స్టాక్ మార్కెట్లలో నెలకొన్న ఒడుదుడుకులు కూడా మరికొంత కారణం అయ్యాయి. ఎల్‌ఐసి మొత్తం 322 లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబ డులు పెట్టింది. 16.10 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నాయి. అవికాస్తా 15.64 లక్షల కోట్లకు క్షీణించినట్లు మార్కెట్ నిపుణులు అంచనావేసారు. కొన్ని వారాల్లోనే 46 వేల కోట్ల తగ్గదల 0నమోదుచేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచి చూస్తే ఎల్‌ఐసి మార్కెట్ పోర్టుఫోలియో 52 వారాల కనిష్టంగా ఉంది. ఎల్‌ఐసి పోర్టుఫోలియో ఇప్పటికీ 1.94 లక్షల కోట్లుగా కొనసాగుతోంది. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కూడా ఇందుకు కొంతకారణం అయింది. జులైలో ఇప్పటి వరకూ విదేశీ ఇన్వెస్టర్లు 20,263 కోట్లు విత్‌డ్రాచేసారు. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు 39,826 కోట్లవరకూ పెట్టుబడులుపెట్టారు.దీనివల్ల మార్కెట్లకు కొంత ఊరట లభించింది.

## ప్రైవేట్ బ్యాంకులపై ఆర్‌బిఐకి ‘ఫాడా’ ఫిర్యాదు

**ముంబై, జూలై 28:** వాహన కొనుగోలుదారులకు వడ్డీ రేట్ల కోతల ప్రయోజనాలను అందించడంలో ప్రైవేట్ బ్యాంకులు జాప్యం చేస్తున్నాయని ఆటో డీలర్ల సంఘం ఫాడా ఆర్‌బిఐకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాసింది. అందులో ఆటో-లోన్ పోర్ట్‌ఫోలియోలో ప్రైవేట్ బ్యాంకుల రెపో ఆధారిత వడ్డీ రేట్ల అమలును సమీక్షించాలని, ఆటో రుణగ్రహీలకు 100శాతం వడ్డీ రేటు ప్రయోజనాలను బదిలీ చేసేలా ఆదేశాలివ్వాలని పేర్కొంది. ఆర్థికవ్యవస్థకు పుష్ ఇచ్చేలా ఆర్‌బిఐ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా కీలక రేట్లలో కోత విధించింది. ‘మీ నేతృత్వంలో ఎక్కువ సమయంలో వేగంగా రేట్ల తగ్గింపు అమలైంది. కానీ వాహన పరిశ్రమలో ఆ స్థాయి ప్రయోజనాలు కనిపించడం లేదు. ప్రభుత్వ రంగ బ్యాంకులు వాహన కొనుగోలుదారులకు అనుగుణంగా వడ్డీ రేట్లు సవరించినప్పటికీ, ప్రైవేట్ బ్యాంకులు ఆ వైపుగా ఆలోచన కూడా చేయలేదు. అంతర్గత నిధుల వ్యయ అంచనాల సాకుతో వడ్డీ ప్రయోజనాలను బదిలీ చేయడంలో ఆలస్యం చేస్తున్నాయని ఫాడా వైస్-ప్రెసిడెంట్ సాయి గిరిధర్ లేఖలో పేర్కొన్నారు. ప్రైవేట్ బ్యాంకులు పాలసీ-రేటు మార్పులను అమలు చేసేలా, వడ్డీ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## వాణిజ్యం

### పారిశ్రామిక ఉత్పత్తిసూచి 1.7% పెరుగుదల!

**న్యూఢిల్లీ, జూలై 28:** భారత్‌లోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి జూన్‌నాటికి 1.7శాతంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. వార్షిక పద్ధతిన బేరీజువేస్తే జూన్ నెలలో 1.7శాతం పెరిగిందని గడచిన మూడునెలలతో పోలిస్తే గణనీయంగా వృద్ధిని నమోదు చేస్తున్నట్లు తేలింది. మేనెలలో 1.2శాతంగా నమోదయిన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ గతనెలలోనే 0.7శాతం అదనంగా వచ్చింది. గత ఏడాది జూన్‌లో ఐదుశాతంగా ఉంది. ఎనిమిది కీలక రంగాలు అయిన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, శుద్ధిచేసిన ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్‌రంగాల్లో సాధించిన వృద్ధితో దేశంలోని పారిశ్రామిక ఉత్పత్తికి ఈ ఎనిమిది రంగాల నుంచే 40శాతం నమోదయింది. అదే మే నెలలో 1.2శాతంగా అంచనా ఉంటే జూన్‌కు



మరింతగా పెరిగింది. మార్చి నెలలో మౌలిక వనరుల ఉత్పత్తి 4.5శాతంగా నమోదయింది. మౌలికవనరులపరంగా ముడిచమురు 1.2శాతంగా ఉంది. సహజవాయు ఉత్పత్తి జూన్‌లో పడిపోయింది. వార్షిక పద్ధతిలో చూస్తే 2.8శాతంగా ఉంది. మేనెలలో ఏకంగా 3.6శాతం క్షీణించింది. సిమెంట్ ఉత్పత్తి 9.2శాతంగా జూన్‌లో ఉంది. అదే మేనెలలో 9.7శాతం పెరిగింది. ఉక్కు ఉత్పత్తిపరంగా 9.3శాతం వార్షికపద్ధతిలో పెరిగింది. మే నెలలో 7.4శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ఇక ఎరువుల ఉత్పత్తి 1.2శాతం క్షీణించింది. బొగ్గు ఉత్పత్తి కూడా వార్షిక పద్ధతిన బేరీజు వేస్తే 6.8శాతంగా ఉంది. గతనెలలో చూస్తే 2.8శాతం పెరిగింది. విద్యుత్ ఉత్పత్తి కూడా అంతంతమాత్రంగానే పెరిగింది. శుద్ధి చేసిన ఉత్పత్తుల తయారీ మాత్రం 3.4శాతం పెరిగింది. గతనెలలో కూడా 1.1శాతం వృద్ధిని నమోదు చేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.